

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి
రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 5

మంగళవారం 28-3-2023




ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమ్మిట్ (IWG) 2023
విశాఖపట్నం, 28-30 మార్చి, 2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సిటీ ఆఫ్ డెస్టినీ "విశాఖపట్నం" G-20 ప్రతినిధులకు ఘన స్వాగతం పలుకుతోంది


గౌ॥శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

G20 भारत 2023 INDIA


గౌ॥ శ్రీ. నరేంద్ర మోదీ
భారత ప్రధాన మంత్రి

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమ్మిట్ (IWG) 2023

విశాఖపట్నం, 28-30 మార్చి, 2023

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమ్మిట్ వేదికగా మౌలిక సదుపాయాలను పెట్టుబడి అవకాశంగా అభివృద్ధి చేయడం - మౌలిక వసతుల కల్పనలో నాణ్యమైన పెట్టుబడులను ప్రోత్సహించడం - ఇన్‌ఫ్రాటెక్, మౌలిక వసతుల్లో పెట్టుబడుల కోసం ఆర్థిక వనరులను సమీకరించడానికి వినూత్న సాధనాలను అన్వేషించడం వంటి మౌలిక రంగంలో పెట్టుబడులకు సంబంధించిన వివిధ అంశాలను చర్చిస్తారు.. వర్కింగ్ గ్రూప్‌కు ఆస్ట్రేలియా మరియు బ్రెజిల్ దేశాలు సహ-అధ్యక్షులుగా వ్యవహరిస్తారు ..

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (IWG) 2023 శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానితులు

G-20 సభ్య దేశాలు + యూరోపియన్ యూనియన్	- 41
MEA ఆహ్వానిత దేశాలు	- 09
ఫైనాన్స్ ట్రాక్ ఆహ్వానిత దేశాలు	- 04
IWG ఆహ్వానిత అంతర్జాతీయ సంస్థలు	- 21
IWG ఆహ్వానిత మల్టీలేటరల్ డెవలప్‌మెంట్ బ్యాంకులు	- 02

ఆంధ్రప్రదేశ్ - పెట్టుబడులకు అనువైన రాష్ట్రం

- విస్తారమైన భూమి లభ్యత - అపారమైన వనరులు - నిరంతర విద్యుత్ సరఫరా..
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో వరుసగా గత మూడేళ్లు దేశంలోనే మొదటి స్థానం..
- దేశంలోనే అత్యధికంగా (11.23%) GSDP వృద్ధి రేటు..
- ఇప్పటికే ఉన్న 6 పోర్టులతో పాటు రాబోయే 4 పోర్ట్ లతో ఆగ్నేయాసియాకు ముఖద్వారం..
- రాష్ట్రంలోని 80% భూభాగాన్ని చుట్టేస్తూ దేశంలోని 11 పారిశ్రామిక కారిడార్లలో 3 కారిడార్లు ఏపీలోనే ..
- భారతదేశానికే ధాన్యాగారంగా, సముద్ర ఉత్పత్తుల అతిపెద్ద ఎగుమతిదారుగా ఆంధ్రప్రదేశ్..
- అనేక గ్లోబల్ & నేషనల్ ఫార్మా కంపెనీలకు నిలయం..
- ప్రపంచ స్థాయి కోస్టల్ మరియు ఎకో-టూరిజం సర్క్యూట్‌లతో 974 కి.మీల తీరంతో దేశంలోనే 2వ అతిపెద్ద సముద్ర తీరం గల రాష్ట్రం..

మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారా, దయచేసి మమ్మల్ని సంప్రదించండి
ఫోన్: 0863 2387611
ఈ-మెయిల్: commr_inds@ap.gov.in
director.industry@ap.gov.in



భవిష్యత్ నగరాల నిర్మాణానికి పెట్టుబడులు - సమ్మిళిత, పటిష్ఠ, సుస్థిరమైన నగరాలు

वसुधैव कुटुम्बकम

One Earth • One Family • One Future

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం ॥ 28-3-2023



● నిఖత్ జరీన్

ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్(ఐబీఏ) న్యూఢిల్లీలో (మార్చి15-మార్చి26) నిర్వహించిన ప్రపంచ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నిఖత్ జరీన్ (50 కేజీల విభాగం), స్వీటీ బూరా (81 కేజీల విభాగం), లవ్లీనా (75 కేజీల విభాగం), నీతూ గంగాస్ (48 కేజీల విభాగం) స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. నిఖత్ నుంచి నీతూ వరకు ఎవరిదీ నల్లేరు మీద నడక కాదు. అడుగడుగునా సవాళ్లు ఎదురయ్యాయి. వాటికి దీటుగా పంచ్‌లు ఇచ్చి తమను తాము నిరూపించుకున్న ఈ స్వర్ణవిజేతలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు...

పదమూడేళ్ల వయసులోనే బాక్సింగ్ బరిలోకి దిగింది తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్. నిఖత్‌లోని ప్రతిభ సంగతి పక్కన పెట్టి 'మగరాయుడిలా ఈ ఆటలు ఏమిటి' అన్న వాళ్లే ఎక్కువ.

'ఎందుకొచ్చిన తలనొప్పి' అని ఆమె తండ్రి నిఖత్‌ను ఆట మానిపించి ఉంటే విశ్వ విజేతగా నిఖత్‌ను చూసే వాళ్లం కాదు.

రింగ్‌లో ఒత్తిడి ఎదురైతే బిత్తరపోయే రకం కాదు నిఖత్. ఆ ఒత్తిడినే బలంగా చేసుకునే నైజం ఆమెది. ఆటకు సంబంధించిన వ్యూహాల పైనే కాదు ఆహార నియమాల విషయంలోనూ దృష్టి సారించే నిఖత్ ప్రతికూల వ్యాఖ్యల గురించి పట్టించుకోలేదు. ఆటలో వ్యూహ ప్రతివ్యూహాలపైనే తన ఆసక్తి.

వరుసగా రెండో ఏడాది ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌గా నిలిచి తన ప్రత్యేకత చాటుకుంది నిఖత్. మేరీ కోమ్ తరువాత ఒకటి కంటె ఎక్కువ స్వర్ణాలు గెలిచిన బాక్సర్‌గా నిలిచింది. పోరాటమే తన మార్గం. బలం.

హరియాణాలోని హిసార గ్రామీణ ప్రాంతానికి చెందిన స్వీటీ బురా తండ్రి మహేంద్రసింగ్ ఒకప్పటి బాస్కెట్‌బాల్ ప్లేయర్. తండ్రి ప్రభావంతో ఆటలపై స్వీటిలో ఆసక్తి మొదలైంది. బాక్సింగ్‌లో ఓనమాలు నేర్చుకోవడానికి ముందు స్వీటీ రాష్ట్ర స్థాయి కబడ్డీ ప్లేయర్. కబడ్డీలో స్వీటీ దూకుడు చూసి తండ్రితో సహా చాలామంది 'ఈ అమ్మాయికి బాక్సింగ్ అయితే కరెక్ట్' అనుకున్నారు.

తండ్రి సూచనతో బాక్సింగ్ వైపు వచ్చింది స్వీటీ. ఒక ఆటలో 'సూపర్' అనిపించుకున్నవారికి కొత్తగా వేరే ఆటలోకి వెళ్లి నిరూపించుకోవడం అంత సులువైన విషయం ఏమీ కాదు. స్వీటీ బడ్డింగ్ బాక్సర్‌గా ఉన్నప్పుడు తనకు పెద్దగా సౌకర్యాలు ఉండేవి కావు. ఎక్కడైనా ఖాళీ స్థానం కనిపిస్తే కోచ్ అక్కడ శిక్షణ ఇచ్చేవాడు. పొలం భూముల్లో నేర్చుకున్నామా, పట్టణంలోని ప్రసిద్ధ కోచింగ్ సెంటర్‌లో నేర్చుకున్నామా అనేదాన్ని స్వీటీ ఎప్పుడూ మనసు మీదికి తీసుకోలేదు. గురువు చెప్పినదానికి తనదైన వ్యూహాన్ని జోడించి ఆటలో రాణించేది.

ఒకసారి బాక్సింగ్ రింగ్‌లో ఉన్నప్పుడు స్వీటీకి ప్రత్యర్థి గట్టి పంచ్ ఇచ్చింది. 'చుక్కలు కనిపించి ఉంటాయి నీకు' అని తమ్ముడు అరిచాడు. అతను ఎగతాళిగా అన్నాడా, వ్యూహాత్మకంగా అన్నాడా అనేది వేరే విషయంగానీ తమ్ముడు చేసిన కామెంట్‌తో స్వీటీకి బాగా కోపం వచ్చింది. ఆ కోపం బలంగా మారి ప్రత్యర్థికి చుక్కలు చూపించింది!

స్వీటీ పంచింగ్ గ్రామర్‌ను చూసి ప్రేక్షకులు వేనోళ్ల పొగిడారు. ఆ విజయంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బాక్సింగ్‌లో స్వీటీ విజయపరంపర కొనసాగుతూనే ఉంది. 'ఆట అనేది నా రక్తంలోనే ఉంది' అని సగర్వంగా చెప్పే స్వీటీ బురాకు రాబోయే ఒలింపిక్స్ అనేది లక్ష్యం.

ప్రపంచాన్ని గెలిచిన మన బంగారాలు



● నీతూ గంగాస్

హరియాణా రాష్ట్రంలోని బివానీ జిల్లాలోని ఒక గ్రామంలో పుట్టింది నీతూ గంగాస్. తల్లి మాటల్లో చెప్పాలంటే చిన్నప్పుడు నీతూ చిలిపి అమ్మాయి. స్కూల్లో తగాదాలు, ఫైట్లు! బాక్సింగ్‌లో ఓనమాలు తెలియకపోయినా ప్రత్యర్థులకు బాక్సర్‌లా పంచ్‌లు ఇచ్చేది. ఇది చూసిన తండ్రి జై భగవాన్ కుమార్తెకు బాక్సింగ్‌లో శిక్షణ ఇప్పించడం ప్రారంభించాడు. అప్పుడు నీతూ వయసు 12 సంవత్సరాలు.

శిక్షణ తీసుకుంటోందన్న మాటేగానీ బాక్సింగ్‌లో ఎలాంటి ప్రతిభా చూపేది కాదు. ఎప్పుడూ ఎవరో ఒకరి చేతిలో ఓడిపోతూనే ఉండేది. ఒక రోజు 'ఇక నా వల్ల కాదు నాన్నా. నాకు బాక్సింగ్ వద్దు' అని ధైర్యంగా తండ్రితో చెప్పింది.

'అలాగే తల్లీ' అని ఆయన అని ఉంటే కొత్త చరిత్ర ఆవిష్కరణ అయ్యేది కాదు. కుమార్తెను బాక్సర్‌గా తీర్చిదిద్దడం కోసం చేస్తున్న ఉద్యోగానికి సెలవు(నాన్-పెయిడ్ లివ్) పెట్టి మరీ కుమార్తె ట్రైనింగ్ నుంచి డైట్ వరకు దగ్గరుండి పర్యవేక్షించాడు. కొంతకాలం తరువాత ప్రసిద్ధ బాక్సింగ్ కోచ్, బివానీ బాక్సింగ్ క్లబ్ (బీబీసి) వ్యవస్థాపకుడు జగ్‌దీష్ సింగ్ దృష్టిలో పడింది నీతూ. 'బీబీసి'లో చేరడం నీతూకు టర్నింగ్ పాయింట్‌గా మారింది. నిజంగా చెప్పాలంటే అసలు సిసలు శిక్షణ అప్పుడే మొదలైంది. బాక్సింగ్‌లోని మెలకువలను ఔపోసన పట్టి రింగ్‌లో ప్రత్యర్థులను మట్టి కరిపించడం ప్రారంభించింది.

గత సంవత్సరం కామన్‌వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం గెలుచుకొని ప్రపంచ దృష్టిని ఆకర్షించింది నీతూ.



● లవ్లీనా బోర్గో హెయిన్

అస్సాంలోని గోలగాట్ జిల్లాకు చెందిన టికెన్ బోర్గోహెయిన్ చిన్న వ్యాపారి. 'పాపం ఈయనకు ముగ్గురూ ఆడపిల్లలే' అని ఎప్పుడూ ఎవరో ఒకరు అకారణ సానుభూతి చూపుతుండేవారు. ముగ్గురు కుమార్తెలలో చిన్న అమ్మాయి లవ్లీనా బోర్గో హెయిన్ అక్కలను స్ఫూర్తిగా తీసుకొని బాక్సింగ్ నేర్చుకుంది.

'మనకెందుకు బాక్సింగ్' అని తల్లిదండ్రులు ఎప్పుడూ అనలేదు. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చిన్న కుమార్తెను బాక్సింగ్ ఛాంపియన్‌గా చూడాలని కలలు కనేవాడు తండ్రి. 2018, 2019 ఉమెన్ వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు గెలుచుకొని తల్లిదండ్రుల కళ్లలో వెలుగులు నింపింది లవ్లీనా. గత సంవత్సరం ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుచుకుంది.

అంతర్జాతీయ స్థాయిలో బాక్సర్‌గా పేరు తెచ్చుకున్నా తన మూలాలు మరిచిపోలేదు లవ్లీనా. ఇప్పటికీ తండ్రికి వ్యవసాయ పనుల్లో సహాయం చేస్తుంటుంది. పాదాలెప్పుడూ నేల మీదే ఉండాలనేది తన సిద్ధాంతం.

2020 ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకుంది లవ్లీనా. ఒలింపిక్స్‌లో బంగారు పతకం గెలుచుకోవాలనేది తన కల.



● స్వీటీ బురా

దిగుబడిలో రాజీ లేని సేద్యం!

సాగుబడి
ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 30 వరకు



ఎస్.ఆర్. సుందరరామన్(83) తమిళనాట వ్యవసాయదారులకు చిరపరిచితమైన పేరు. సేంద్రియ సేద్య దిగ్గజం. సుసంపన్న సేద్య సంస్కృతికి నిలువెత్తు సంతకం. 83 ఏళ్ల జీవితంలో 60 ఏళ్ల వ్యవసాయ అనుభవం ఆయనది. 30 ఏళ్ల రసాయనిక వ్యవసాయం, మరో 30 ఏళ్ల సేంద్రియ సేద్య అనుభవం ఆయన సొంతం. తాను అనుసరిస్తున్న, సాగు పద్ధతి ఏదైనా, పూర్తి నిమగ్నతతో ఆయా పద్ధతులను క్రమశిక్షణతో పాటించటం హరిత విప్లవ ఆరంభకాలం నుంచే ఆయనకు అలవాటైంది. ఆయన పొలంలోకి చెప్పుల్లేకుండా కాలుపెట్టినా, ఆయనతో కాసేపు మాట కలిపినా గొప్ప ఆనందం కలుగుతుంది, ఎవరికైనా!

రసాయనాలతో ప్రకృతిని నష్టపరిచే వ్యవసాయాన్ని మానక తప్పని 'అనివార్యత' తనను ప్రకృతితో కలసి పనిచేసే వ్యవసాయం వైపు నడిపించిందని ఆయన చెబుతున్నప్పుడు.. సేంద్రియ వ్యవసాయ పక్షపాతిగానో/ప్రచార కర్తగానో కాకుండా.. సాగు పద్ధతి ఏదైనా.. అధిక ఖర్చును భరించడానికి / దిగుబడులు నష్టపోవడానికి సుతరామూ ఇష్టపడని, అనుక్షణం వ్యవసాయాన్నే శ్వాసించే కాకలుతీరిన రైతు యోధునిగా ఆయన దర్శనమిస్తారు. అపారమైన సుందరరామన్ సేంద్రియ సేద్య జ్ఞానం ప్రకృతి సేద్యం చేస్తున్న మన రైతులకు ఎంతగానో ఉపయోగపడతుందనటంలో సందేహం లేదు.

ఎకరానికి ఏటా 10-20 టన్నుల పచ్చిరొట్టను విధిగా అందించాలంటారు సుందరరామన్. సాగు భూమి నిరంతరం సారవంతంగా ఉంటూ మంచి దిగుబడులు ఇవ్వాలంటే విధిగా ప్రతి ఏటా (6-8 రకాలు. ఎకరానికి 30 కేజీల విత్తనాలు చల్లి) పచ్చి రొట్ట పంటలను సాగు చేసి, 45-60 రోజుల్లో రోటవేటర్‌తో కలియదున్నాలి. దానితో పాటు, ప్రతి ఏటా (ఎకరానికి 10-20 టన్నుల) మాగిన పశువుల ఎరువు లేదా (8-12 టన్నుల) మాగిన కోళ్ల ఎరువు వాడాలి.



● పచ్చిరొట్ట సాగు తప్పనిసరి

అంతర పంటలను వత్తుగా సాగు చేయటం ద్వారా కలుపు సమస్యగా మారకుండా చూసుకుంటున్నారు సుందరరామన్. ప్రతి పంటలోనూ ఆ పంటకు తగిన అంతర పంటలు వేస్తున్నారు. అరటి తోటలో జనుము, జీలుగ, ఉలవ, బొబ్బర విత్తనాలను ఎకరానికి 20 కిలోలు చల్లి అంతర పంటలుగా వత్తుగా సాగు చేసి చేతితో కలుపు తీయకుండా సేద్యం చేస్తున్నారు సుందరరామన్. జనుము, జీలుగ కోసి తోటలోనే ఆచ్ఛాదనగా వేయటం ద్వారా నేలకు నేరుగా ఎండ తగలకుండా చూస్తారు.



● గడ్డితో ఆచ్ఛాదన



● అంతరపంటలతో కలుపు ఔట్

పసుపును 9 అంగుళాల ఎత్తు మడుల్లో విత్తుకుంటారు. దీనిలో పిల్లి పెసరను పోలిన నరిపైర్ (కుంకుప పెసర/మాత్ జీన్) అనే పప్పుధాన్యపు పంటను అంతర పంటగా విత్తుతారు. ఎత్తు తక్కువలో నిండుగా అల్లుకుంటుంది. 3 నెలల్లో ఈ పంట పూర్తయ్యే సరికి పసుపు మొక్కలు పూర్తిగా ఎదుగుతాయి కాబట్టి తర్వాత కలుపు బాధ ఉండదు. కూరగాయ తోటల్లోనూ కుంకుప పెసరనే విత్తుతారు. చెరకును వరుసల మధ్య 4 అడుగుల దూరం పటిస్తూ జనుము, జీలుగ సాగు చేస్తారు. ఈ పంటల నీడ ఎండ తీవ్రతను 3-4 డిగ్రీల మేరకు తగ్గిస్తుందంటారు సుందరరామన్. .



● సోలార్ డ్రయ్యర్‌లో కొబ్బరి

కొబ్బరి కాయలను కాకుండా బోండాలను పగులగొట్టి సోలార్ డ్రయ్యర్‌లో ఎండబెట్టి విక్రయిస్తారు. పసుపు, మిరప కాయలను కూడా ఈ డ్రయ్యర్‌లోనే ఎండబెట్టి అమ్ముతారు. పదెకరాల్లో రసాయనిక రైతులకు దీటుగా దిగుబడులు తీసే సుందరరామన్‌కు మార్కెటింగ్ సమస్య లేదు. వ్యాపారులు పొలం దగ్గరకే వచ్చి కొనుక్కెళ్తారు. సత్యమంగళం ఆర్గానిక్ ఫార్మర్స్ వెల్ఫేర్ ట్రస్టు (ఇది రిజిస్టరైన ఎఫ్.పి.ఓ. కూడా) ద్వారా మిగతా ఉత్పత్తులను అమ్ముతారు. పిటిఎస్10, సేలం పసుపు రకాలలో 3.5-4.25% కుర్కుమిన్ పొందుతున్నారు.

1% సేంద్రియ కర్బనంతోనే సుస్థిర దిగుబడి

శాస్త్రవేత్తలు సూచించిన విధంగా అన్ని జాగ్రత్తలనూ తీసుకున్నప్పటికీ రసాయనిక వ్యవసాయం నా సుదీర్ఘ అనుభవంలో అన్ని విధాలా నష్టదాయకంగా మారటం నేను అనుభవపూర్వకంగా చూశాను. అందుకే మహామహుల దగ్గర సేంద్రియ సేద్య నియమాలను ఐదేళ్లపాటు ప్రయోగాలు చేసి, స్వయంగా ఈ విధానం సరైనదేనని నిర్ధారణ చేసుకున్నాక నా పదెకరాల పొలాన్ని ఒకేసారి సేంద్రియ సేద్యంలోకి మార్చాను. మొదటి ఏడాది కూడా దిగుబడి తగ్గనివ్వలేదు.

ప్రతి పంటకూ ముందు పచ్చి రొట్ట ఎరువు పంటలు సాగు చేసి కలియదున్నటం.. సజీవ ఆచ్ఛాదనగా అంతర పంటలను ఏ పంట/తోటలోనైనా విధిగా సాగు చేయటం.. ఒకటికి పది రకాల సేంద్రియ ద్రావణాలు, జీవన ఎరువులను సొంతంగా తయారు చేసుకొని క్రమం తప్పకుండా వాడటం.. ప్రతి ఏటా పశువులు/కోళ్ల ఎరువు వాడటం.. ఈఎం (ఎఫెక్టివ్ మైక్రోఆర్గానిజమ్స్) మదర్ టింక్చర్ తప్ప మరి దేన్నీ మార్కెట్‌లో కొనుగోలు చేయకుండానే పోషక లోపం లేకుండా సేంద్రియ సేద్యం చేయటం.. హైబ్రిడ్ వంగడాలతోనే సేంద్రియ పంట దిగుబడులను రసాయనిక సేద్యానికి తీసిపోని విధంగా మొదటి ఏడాది నుంచే సాధించటం.. పాక్షికంగా ప్రాసెస్ చేసి విక్రయించటం ద్వారా అధికాదాయం పొందటం.. ఇవీ నా అనుభవాలు. కొత్త రైతులు పావెకరంతో మొదలు పెట్టి, అన్ని విషయాలూ బేరీజు వేసుకుంటూ 2-3 ఏళ్లలో పొలం అంతటినీ సేంద్రియ సేద్యంలోకి మార్చుకోవచ్చు. సేంద్రియ కర్బనం కనీసం 1%కి పెంచుకుంటేనే తప్ప దిగుబడులు స్థిరంగా రావు. ప్రతి ఏటా సేంద్రియ కర్బనం పరీక్ష చేయించుకోవాలి. ఇది ఏటేటా ఎంతో కొంతైనా పెరుగుతుంటేనే బాగా చేస్తున్నట్లు లెక్క. పంటలు ఏవి సాగు చేసినా ఏడాది పొడవునా పొలాన్ని పంటలతోనో, గడ్డితోనో కప్పి ఉంచాలి. పంటల మధ్య విరామంలో కూడా వారానికి మించి పొలాన్ని ఖాళీగా ఎండబారనివ్వకూడదు. సేంద్రియ సేద్యానికి, సేంద్రియ కర్బన పరిరక్షణకు ఇదే మూల సూత్రం.

- ఎస్.ఆర్. సుందర రామన్
(9842724778) వీరకొట్యుపాళెం, ఈరోడ్ జిల్లా, తమిళనాడు
(తమిళం/ఆంగ్లంలో సుందర రామన్‌తో మాట్లాడొచ్చు. క్షేత్రాన్ని సందర్శించవచ్చు. ఆయన శిష్యుడు కిషోర్‌ను 99490 94370 నంబరులో సంప్రదించవచ్చు)



సగటున ఎకరానికి ఏటా రూ. 50-60 వేల నికరాదాయం పొందుతున్నారు సుందరరామన్. ప్రకృతి అనుకూలిస్తే మరో రూ.15 వేలు అదనం. ఒకటికి పది రకాల ద్రవరూప ఎరువులు సొంతంగా తయారు చేసుకొని వాడటం ఆయన విజయ రహస్యం. అమృతం, పంచామృతం, పులిసిన మజ్జిగ, కషాయాలు, ఈఎం ద్రావణం, మురగబెట్టిన పశుమూత్రం, పులియబెట్టిన పండ్ల రసాలు, చేపల ద్రావణాలను (ఎకరానికి నెలకు ఇవన్నీ కలిపి 75-150 లీటర్లు) నెలకు 2.3 సార్లు డ్రిప్ ద్వారా పారిస్తారు. మరీ అవసరమైతే పిచికారీ చేస్తారు. ద్రావణాలను అందించటం ద్వారా భూమిలో సూక్ష్మ జీవరాశిని నిరంతరం వృద్ధి చేసుకుంటేనే సేంద్రియ కర్బనంతో పాటు దీటైన దిగుబడులు వస్తాయంటున్నారాయన.

దిగుబడి ఏనాడూ తగ్గలేదు!

రసాయనిక సేద్యం నష్టదాయకమని గుర్తించి సేంద్రియ సేద్యంలోకి మారిన సుందర రామన్ క్షేత్రంలో తొలి ఏడాది కూడా దిగుబడి తగ్గలేదు. సేంద్రియ సాగులో ఎకరానికి చెరకు 50-60 టన్నులు, పసుపు 20-25 క్వింటాళ్లు, వరి ధాన్యం 2.5- 3 టన్నులు, మిరప 35-40 బస్తాలు (40 కేజీలు), హైబ్రిడ్ మొక్కజొన్న 12-15 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు.

రెండు రోజుల్లో ఎండు మిర్చి రెడీ!

- నాణ్యంగా మిర్చిని ఎండబెట్టే విద్యుత్ ప్లాంట్లు అందుబాటులోకి
- మిర్చి రకాన్ని బట్టి 24- 36 గంటల్లో మిరప కాయలను ఎండబెట్టే ప్లాంట్లు
- మిర్చి రకాన్ని బట్టి టన్ను నుంచి రెండు టన్నుల సామర్థ్యంతో డ్రయ్యర్లు
- రంగు, క్వాలిటీ కలిగి ఉండే ఈ ఎండు మిర్చికి మంచి ధర పలికే అవకాశం
- ఎండు మిర్చిని ఏసీ లేకుండా ఏడాది పాటు ఇంటిదగ్గరే నిల్వ చేసుకునే వీలు

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని రైతులకు పంట నష్టాలను తగ్గించేందుకు పండు మిరప కాయలను చప్పున, సురక్షితంగా, నాణ్యంగా ఎండబెట్టే యంత్రాలు (డ్రయ్యర్లు) అందుబాటులోకి వచ్చాయి. ఆరుబయట కల్లాల్లో పండు మిరపకాయలు పూర్తిగా ఎండాలంటే వాతావరణాన్ని బట్టి 20-30 రోజుల వరకు పడుతుంది. అంతేకాక, పండు మిర్చిని కల్లాల్లో ఆరబెట్టే సమయంలో సక్రమంగా ఎండ తగలదు. ఎండవేడి ఒకచోట తగిలి మరోచోట తగలక తాలు సమస్య వస్తోంది. నల్లమచ్చలు ఏర్పడే అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో సోలార్‌తో పనిచేసే డ్రయ్యర్లతో పాటు, విద్యుత్‌తో పనిచేసే డ్రయ్యర్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. తక్కువ సమయంలో ఎటువంటి బ్యాక్టీరియా లేకుండా, తాలు రాకుండా మిర్చిని ఎండబెట్టే యూనిట్‌కు చెన్నైకి చెందిన శాంత ఇంజనీరింగ్ సంస్థ రూపకల్పన చేసింది. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో, విద్యుత్ సర్క్యూట్‌లను తయారు చేసి.. వాటిలో ఓజోన్ గాలితో యంత్రాలను, మిర్చిని స్టెరిలైజ్ చేసి.. తక్కువ సమయంలోనే ఆరబెట్టే ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది ఈ సంస్థ. విద్యుత్ యూనిట్లు అనేక దేశాల్లో మంచి ఫలితాలిస్తున్నట్లు చెబుతున్నారు. గుంటూరు జిల్లా జొన్నలగడ్డలో విద్యుత్ డ్రయ్యర్లపై రైతులకు ఇటీవల అవగాహన కల్పించారు.



● విద్యుత్ ప్లాంట్‌లో మిరపకాయలు

తాలు రాదు.. తొడెం రంగు మారదు

రైతు పొలంలో కోసిన పండు మిర్చిని నేరుగా విద్యుత్‌తో నడిచే డ్రయ్యర్ ప్లాంట్‌కు తరలించి ఎండబెట్టుకోవచ్చు. మిర్చి రకాన్ని బట్టి 24 నుంచి 36 గంటల్లోనే ఎండు మిర్చిని పొందవచ్చు. ఈ విధంగా ఆరబెట్టుకున్న మిర్చిలో తాలు ఒక శాతం కూడా రాదని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా మిరపకాయకు ఉండే తొడెం సైతం ఆకుపచ్చ రంగులోనే ఉంటుంది. కోసినప్పుడు మిరప పండ్లకు ఉన్న రంగులోనే ఎండు మిరప కాయలు ఉంటాయి. మిర్చి రంగు, తొడెం పచ్చదనం చూసి నాణ్యతను అంచనా వేస్తారని, దాన్ని బట్టి ధర నిర్ణయమవుతుందని నిపుణులు అంటున్నారు. ఓజోన్ గాలితో మిర్చిని స్టెరిలైజ్ చేయటంతో మిర్చిలో బ్యాక్టీరియా ఉండేందుకు ఆస్కారం లేదంటున్నారు.




● తొడిమెలు ఆకుపచ్చగా

ఏసీ లేకుండా ఏడాది పాటు ఇంటిపట్టునే నిల్వ

విద్యుత్ ప్లాంట్‌లో మిర్చిని సరైన వేడిలో, ఓజోన్ గాలితో ఎండబెట్టడం ద్వారా మిరపకాయలు రంగు మారకుండా, తొడిమలు సైతం ఆకుపచ్చగా నాణ్యంగా ఎండుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ విధంగా ఎండబెట్టిన మిరపకాయలను ఎటువంటి ఏసీలు లేకుండా సాధారణ గోదాములు/ఇళ్ళలోనే నిల్వ చేసుకొనే వీలుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా రైతులు కోల్డ్‌స్టోరేజ్ ఖర్చు లేకుండా సరైన ధర వచ్చినపుడు విక్రయించుకొని మంచి ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుంది.

1-2 టన్నుల యూనిట్లు

విద్యుత్‌తో నడిచే యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవడానికి కనీసం 440 వాట్ల త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం అవసరం. ఒక టన్ను మిర్చిని ఆరబెట్టే సామర్థ్యం ఉన్న ప్లాంట్ నెలకొల్పడానికి రూ.15 లక్షల వరకూ ఖర్చవుతుంది. రెండు టన్నుల ప్లాంట్‌కు రూ.25 లక్షల వరకూ ఖర్చవుతుంది. కేంద్ర ప్రభుత్వం 35 శాతం వరకూ సబ్సిడీని అందిస్తుందని సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. ఈ విధంగా రైతు ఒకరు ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుంటే తన పంటతోపాటు గ్రామంలోని, ఇతర గ్రామాల్లోని రైతుల మిర్చిని ఆరబెట్టి అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. సోలార్ డ్రయ్యర్లలో రాత్రుళ్లు వేడి తగ్గిపోకుండా చూసే పరిశోధనలు ఫలిస్తే భవిష్యత్తులో ఖర్చు తగ్గి, రైతులకు మేలు జరిగే అవకాశాలున్నాయి.



● సోలార్ డ్రయ్యర్‌లో ఎండుతున్న మిరపకాయలు

- దాళా రమేష్‌బాబు, సాక్షి ప్రతినిధి, గుంటూరు
ఇన్‌పుట్స్: మల్లిఖార్జునరావు, గుంటూరు రూరల్



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 5

మంగళవారం 28-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఇజ్రాయెల్‌లో సంస్క'రణం'

న్యాయవ్యవస్థలో భారీ మార్పులు.. ప్రభుత్వం చేతిలో సుప్రీం కీలుబొమ్మ -6లో



ఫస్ట్ సిటిజన్స్ చేతికి ఎస్‌వీబీ

ఎస్‌వీబీ సింహభాగం కార్యకలాపాలను దక్కించుకున్న ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్-13లో



అట్టుడికిన పార్లమెంటు

రాహుల్‌గాంధీపై అనర్హత వేటుతో పాటు పలు అంశాలపై విపక్ష సభ్యుల ఆందోళనలతో పార్లమెంటు అట్టుడికిపోయింది.

వివరాలు 6లో ▸



కరోనా కొత్త కేసులు 1,805

దేశవ్యాప్తంగా గత 24 గంటల వ్యవధిలో 1,805 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

వివరాలు 6లో ▸



అమెరికా గురుద్వారాలో కాల్పులు

అమెరికాలోని శాక్రమెంటోలో ఉన్న సిక్కుల గురుద్వారాలో జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



అరుణాచల్‌లో జీ20కి చైనా డుమ్మా

అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో నిర్వహించిన జీ20 సన్నాహక సదస్సుకు చైనా గైర్హాజరయ్యిందని కేంద్రం తెలిపింది.

వివరాలు 6లో ▸

ఏపీ ఓ రోల్ మోడల్

ప్రజలకు ప్రభుత్వం ఎలా సేవలందించవచ్చో నిరూపిస్తున్నారు

- ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అభినందనలు
- ప్రపంచ బ్యాంకు (ఇండియా) డైరెక్టర్ 'ఆగస్ట్ తను కమే' వ్యాఖ్య
- రాష్ట్రంలో సమర్థవంతమైన, డైనమిక్ ప్రభుత్వం ఉంది
- ఉత్తమ వైద్యం, విద్య ఎలా అందించవచ్చో మార్గం చూపారు
- నిర్దేశిత సమయంలోగా పౌరులకు సేవలందించడంలో మేటిగా నిలిచారు
- మిగిలిన రాష్ట్రాలు ఏపీని ఉదాహరణగా తీసుకుని ముందుకు సాగొచ్చని కితాబు
- సీఎం జగన్‌తో ప్రతినిధి బృందం భేటీ.. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో అమలవుతున్న మూడు కార్యక్రమాలపై సమీక్ష
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో మరింత భాగస్వామ్యం అందించాలని కోరిన సీఎం
- సత్య నాదెళ్ల లాంటి వారు మరింత మంది ఏపీ నుంచి రావాలన్నది తమ ఉద్దేశమని వెల్లడి



ప్రపంచ బ్యాంకు బృందంతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


సాక్షి, అమరావతి: ప్రజలకు మంచి వైద్యం, అత్యుత్తమ విద్యను ఎలా అందించవచ్చో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి మార్గాన్ని చూపారని భారత్‌లో ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ 'ఆగస్ట్ తను కమే' ప్రశంసించారు. నిర్దేశిత సమయంలోగా పౌరులకు సేవలను అందించడంలో గొప్ప ఉదాహరణగా నిలిచారని ముఖ్యమంత్రిని అభినందించారు. ఆంధ్రప్రదేశ్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి జగన్ ఎంతో తపనపడుతున్నారని చెప్పారు. భారత్‌లో ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ 'ఆగస్ట్ తను కమే' నేతృత్వంలోని బృందం సోమవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశమైంది. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో అమలు చేస్తున్న ప్రాజెక్టులు 'ఏపీ ప్రజారోగ్య బలోపేతం, ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్ (సాల్ట్), ఏపీ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్ట్ (ఏపీఐఐఏటీపీ)లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆగస్ట్ తను కమే ఏమన్నారంటే..

దేశ సగటుకు మించి వృద్ధి రేటు

రాష్ట్రానికి రావడం ఇదే తొలిసారి. వివిధ రంగాల్లో మీరు చేరుకున్న లక్ష్యాలను ప్రత్యక్షంగా తిలకించాం. ఒక ప్రభుత్వం తన ప్రజలకు ఏ విధంగా సేవలు అందించగలదనే అంశానికి మీరు (సీఎం జగన్) చక్కటి ఉదాహరణగా నిలిచారు. ఇందుకు మన స్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాం. మంచి వైద్యం, ఆరోగ్యం, ఉత్తమ విద్యను ఎలా అందించవచ్చు? అన్నదానికి మీరు చక్కటి మార్గాన్ని చూపారు. నిర్దేశిత సమయంలోగా సేవలను పౌరులకు అందించడంలో గొప్ప ఉదాహరణగా నిలిచారు.

☛ దేశంలో దాదాపు 22 రాష్ట్రాలకు మేం రుణాలిస్తున్నాం. వివిధ రంగాల్లో వృద్ధి కోసం రుణాలు ఇస్తున్నాం. మీ రాష్ట్రాన్ని (ఏపీ) మిగిలిన రాష్ట్రాలు ఉదాహరణగా తీసుకుని ముందుకు సాగవచ్చు. రాష్ట్రంతో మా భాగస్వామ్యం చాలా రోజులుగా కొనసాగుతోంది. వచ్చే పాతికేళ్లలో మీ విజన్, మిషన్‌కు

మిగతా 2వ పేజీలో ▶



గవర్నర్‌తో సీఎం జగన్ భేటీ

2లో

విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

దర్యాప్తు ఎందుకింత ఆలస్యమవుతోంది?



- వివేకా హత్య కేసులో సీబీఐపై సుప్రీంకోర్టు అసహనం
- అవసరమైతే దర్యాప్తు అధికారిని మార్చాలని ఆదేశం
- రాజకీయ ఉద్దేశాలతోనే హత్య అనడానికి ఆధారాలు ఇవ్వలేదని వెల్లడి
- ఇంప్లీడ్ అవుతానని సునీత అభ్యర్థన.. ఎందుకని ప్రశ్నించిన కోర్టు

2లో

న్యూస్‌రీల్

పారిశ్రామిక అభివృద్ధిలో నూతన విప్లవం



పారిశ్రామికవేత్తలతో విశాఖలో జరిగిన సమావేశంలో నూతన పారిశ్రామిక విధానాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసేలా సీఎం జగన్ ఆదేశాలకు అనుగుణంగా ఈ పాలసీని రూపొందించారు. ఇది రాష్ట్ర అభివృద్ధిలో విప్లవాన్ని సృష్టిస్తుందని పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

వివరాలు 10 ▸

పరిశ్రమలకు అనుమతులన్నీ ఒకేచోట



ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న పారిశ్రామిక వేత్తలు కేవలం ఒకే యాప్, వెబ్‌పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులు పొందొచ్చు. ఈ మేరకు సరికొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వైఎస్సార్ ఏపీ వన్ యాప్ ద్వారా 23 రకాల అనుమతులకు ఒకేచోట దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కల్పించింది.

వివరాలు 10 ▸

అంగుళం కూడా తగ్గదు

- పోలవరం ఎత్తుపై రాజ్యసభలో మరోసారి తేల్చిచెప్పిన కేంద్ర ప్రభుత్వం
- గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం 45.72 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తున్నామని పునరుద్ఘాటన
- ఎత్తు తగ్గించాలని ఏపీ ప్రభుత్వం తమకు ఎలాంటి ప్రతిపాదన పంపలేదని స్పష్టీకరణ
- ఎన్నిసార్లు స్పష్టంగా చెప్పినా టీడీపీ సభ్యులు పదేపదే పాత ప్రశ్నే అడగటంపై కేంద్రం అసహనం



2లో

'ఓటుకు కోట్లు 2.0' ప్రకంపనలు

- టీడీపీ నేతలు తననూ ప్రలోభపెట్టడానికి ప్రయత్నించారన్న ఎమ్మెల్యే మద్దాళి గిరి
- పోలింగ్ రోజుకు వారం ముందు నుంచే ఫోన్ ద్వారా సంప్రదించారని వెల్లడి
- ఫోన్‌కాల్ లిస్టును బయట పెట్టిన మద్దాళి గిరి
- టీడీ జనార్దన్ కూడా సంప్రదించడానికి యత్నించారు
- కానీ, తాను ఫోన్ లిఫ్ట్ చేయలేదని వెల్లడి
- ఓటేస్తే రూ.పది కోట్లు ఇస్తామన్నారని ఇప్పటికే వెల్లడించిన ఎమ్మెల్యే రాపాక

11లో

జీ-20 సదస్సుకు సర్వ సన్నద్ధం

- విశాఖ వేదికగా నేటి నుంచి నాలుగు రోజులపాటు సమావేశాలు
- జీ-20 దేశాలతోపాటు యూరోపియన్ దేశాల నుంచి 57 మంది ప్రతినిధుల రాక
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలను తెలియజేయనున్న సర్కారు
- తొలిరోజు సదస్సుకు సీఎం వైఎస్ జగన్ హాజరు
- రూ.157 కోట్లతో సర్వాంగ సుందరంగా విశాఖ ముస్తాబు

10లో

గవర్నర్‌తో సీఎం వైఎస్ జగన్ భేటీ

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సాయంత్రం 5గంటలకు విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాజ్‌భవన్ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గవర్నర్‌తో గంటకుపైగా సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి గవర్నర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వివరించినట్టు సమాచారం.

ఒంటిమిట్టలో సీతారామ కళ్యాణ మహోత్సవానికి సీఎం జగన్‌కు ఆహ్వానం

- 30 నుంచి ఏప్రిల్ 9 వరకు ఒంటిమిట్టలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు
- ఏప్రిల్ 5న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం

సాక్షి,అమరావతి: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆహ్వాన శుభపత్రికను అందజేశారు. ఈ మేరకు వారు సోమవారం తాడేపల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ ఆహ్వానపత్రికను, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు ఒంటిమిట్టలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీఎం జగన్‌కు వివరించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 5వ తేదీ రాత్రి 8 నుంచి 10 గంటల వరకు శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో మూడు స్వామినారాయణ్ గురుకుల్ ట్రస్ట్ స్కూళ్లు

- సీఎం జగన్‌ను కలిసిన ట్రస్ట్ సభ్యులు, ప్రతినిధులు
- విశాఖ, తిరుపతి, పులివెందులలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడి
- అవసరమైన సహకారం అందిస్తామన్న ముఖ్యమంత్రి



సీఎం జగన్‌ను కలిసిన శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ ట్రస్ట్ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: విశాఖపట్నం, తిరుపతి, పులివెందులలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు శ్రీస్వామినారాయణ్ గురుకుల్ ట్రస్ట్ తెలియజేసింది. సీఎం జగన్‌ను సోమవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ట్రస్ట్ సభ్యులు, ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని వారు తెలియజేయగా.. ఎలాంటి సహకారం అవసరమైనా అందించడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం జగన్ వారికి హామీ ఇచ్చారు. ఇందుకు అవసరమైన భూమిని కేటాయించేందుకు కూడా సీఎం అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యా రంగం అభివృద్ధికి అనుసరిస్తున్న పారదర్శక విధానాలను వారికి సీఎం వివరించారు. సుశిక్షితులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కాగా, వైఎస్సార్ హయాంలో తెలంగాణలోని మొయినాబాద్‌లో గురుకుల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం తమ ట్రస్ట్‌కు 100 ఎకరాల భూమిని కేటాయించేందుకు సన్నాహాలు జరిగాయని.. కానీ ఆయన అకాల మరణంతో ఆ ప్రాజెక్టు నిలిచిపోయిందని సీఎంకు ప్రతినిధుల బృందం వివరించింది. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, న్యూఢిల్లీతో పాటు అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాలలో 52కు పైగా విద్యాసంస్థలు ఉన్నాయని తెలియజేసింది. సమావేశంలో ట్రస్టీ మెంబర్ సుఖ్‌వల్లభ్ స్వామి, విజయవాడ బ్రాంచ్ ఆర్గనైజర్ మంత్రస్వరూప్ స్వామి, ట్రస్ట్ సభ్యులు శ్రవణ్‌ప్రియ్ స్వామి, విషుధ్జీవన్ స్వామి, మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు.

వరికూటి కోటమ్మకు సీఎం జగన్ ఘన నివాళి



కోటమ్మ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్

కారుమంచి (కొండపి): ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మాతృమూర్తి వరికూటి కోటమ్మ భౌతికకాయానికి సోమవారం కారుమంచి గ్రామంలో సీఎం వైఎస్ జగన్ నివాళులర్పించారు. వరికూటి అశోక్‌బాబు, డాక్టర్ వరికూటి అమృతపాణితోపాటు ఇతర కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించి కొద్దిసేపు మాట్లాడారు. అన్ని వేళలా అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. సీఎంతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు కోటమ్మ భౌతికకాయం వద్ద నివాళి అర్పించారు.

40 వేల టిడ్కో ఇళ్లు సిద్ధం

ఏప్రిల్, మే నెలల్లో పంపిణీకి ఏర్పాట్లు: టిడ్కో ఎండీ శ్రీధర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిర్మాణం పూర్తి చేసుకున్న టిడ్కో గృహాల పంపిణీకి అధికారులు మరోసారి ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యం మేరకు ఏప్రిల్, మే నెలల్లో 40 వేల యూనిట్లను పంపిణీ చేయనున్నారు. ఆయా పనులపై టిడ్కో ఎండీ చిత్తూరి శ్రీధర్ అధ్యక్షతన సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం, గుడివాడ, గుంటూరు, నరసరావుపేట, కందుకూరు, పొన్నూరు, కావలి, ఆళ్లగడ్డ, డోన్, విశాఖ జిల్లా యలమంచిలి, పిఠాపురం పట్టణాలలో దాదాపు 40 వేల టిడ్కో గృహాలు అన్ని హంగులతో సిద్ధంగా ఉన్నాయి. వీటితోపాటు మే చివరి నాటికి పూర్తయిన అన్ని ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎండీ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. ఇంకా గృహ ప్రవేశాలు చేయాల్సిన చోట నిర్ణీత కాలవ్యవధి లోగా నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేలా సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలతో సమన్వయం చేయాలని చెప్పారు.

నివాసితుల సంక్షేమ సంఘాల ఏర్పాటు

ఇప్పటికే గృహ ప్రవేశాలు జరిగిన చోట నివాసితులతో సంక్షేమ సంఘాల ఏర్పాటుకు టిడ్కో అధికారులు చర్యలు చేపట్టారు. విజయనగరం, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కర్నూలు, విశాఖ జిల్లాల్లో ఇప్పటిదాకా సుమారు 49,500 పైగా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అక్కడ కమిటీలను నియమించి పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను వారికే అప్పగించనున్నారు. ఇంకా బ్యాంకుల నుంచి సుమారు రూ.3వేల కోట్ల రుణ సదుపాయం రావాల్సి ఉంది. ఈ రుణాలు రాబట్టేందుకు లబ్ధిదారులకు రుణాల మంజూరు విషయంలో మెప్మా, మునిసిపల్ అధికారుల సహకారం తీసుకుని ఆయా బ్యాంకులతో మాట్లాడాలని నిర్ణయించారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే సుమారు 50వేల టిడ్కో ఇళ్లు పంపిణీ చేశామని చెప్పారు. ఈ సమావేశంలో టిడ్కో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్ గోపాల కృష్ణారెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగుళం కూడా తగ్గదు

పోలవరం ఎత్తుపై రాజ్యసభలో మరోసారి స్పష్టం చేసిన కేంద్రం

ఒక్క అంగుళం కూడా ఎత్తు తగ్గదని 2022 మార్చి 22న శాసనసభ వేదికగా ప్రకటించిన సీఎం జగన్

కావాలంటే టేపు తెచ్చి కొలుచుకోవాలంటూ ఆనాడే సవాల్



"పోలవరం ఎత్తును ఒక్క అంగుళం కూడా తగ్గించం.. 45.72 మీటర్ల ఎత్తుతో, 194.6 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తాం. కావాలంటే ప్రాజెక్టు పూర్తయ్యాక టేపు తెచ్చి కొలుచుకోవచ్చు."
- 2022 మార్చి 22న అసెంబ్లీ సాక్షిగా టీడీపీ, ఎల్లో మీడియాకు సీఎం జగన్ సవాల్

"పోలవరం ఎత్తు తగ్గిస్తున్నామని చంద్రబాబు పదేపదే అబద్ధాలు చెబుతున్నారు. ఎల్లో మీడియా పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తోంది. వాటిని నమ్మవద్దు. ఒక్క అంగుళం కూడా ఎత్తు తగ్గించం."
- ఈ నెల 23న శాసనసభలో సీఎం జగన్

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తున్నారంటూ రెండేళ్లుగా టీడీపీ నేతలు, ఎల్లో మీడియా సాగిస్తున్న దుష్ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి ఖండించింది. ఈ మేరకు రాజ్యసభలో టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ సోమవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు సమాధానమిస్తూ ప్రాజెక్టు ఎత్తు ఒక్క అంగుళం కూడా తగ్గదని మరోసారి తేల్చి చెప్పారు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం 45.72 మీటర్ల గరిష్ట నీటి మట్టం(ఎఫ్ఆర్ఎల్)తో పోలవరాన్ని నిర్మిస్తున్నామని పునరుద్ఘాటించారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు ఎలాంటి ప్రతిపాదన పంపలేదని పార్లమెంట్ సాక్షిగా స్పష్టం చేశారు. నిజానికి పోలవరం ఎత్తు ఒక్క అంగుళం కూడా తగ్గించే ప్రశ్నే లేదని 2021 నుంచి ఇటు రాష్ట్ర ప్రభుత్వం అటు కేంద్ర ప్రభుత్వం పదేపదే స్పష్టం చేస్తున్నా ఎత్తు తగ్గిస్తున్నారంటూ రాజ్యసభ, లోక్‌సభలో టీడీపీ సభ్యులు తరచూ ప్రశ్నలు వేస్తుండటంపై కేంద్రం అసహనం వ్యక్తం చేసింది. పోలవరం ఎత్తు తగ్గిస్తున్నారంటూ రాజకీయ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేయడం తగదని కేంద్ర జల్ శక్తి శాఖ అధికారవర్గాలు సూచిస్తున్నాయి.

మళ్లీ మళ్లీ ఒకే ప్రశ్నా..?

పోలవరం ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గిస్తున్నట్లు ఈనాడులో 2021లో రామోజీరావు ఓ తప్పుడు కథనాన్ని అచ్చేశారు. అది పట్టుకుని పోలవరం ఎత్తును సీఎం జగన్ తగ్గించేస్తున్నారంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆ పార్టీ నేతలు దుష్ప్రచారానికి దిగారు. టీడీపీ నుంచి బీజేపీలోకి పంపిన రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ద్వారా ఈ అంశంపై 2021 ఫిబ్రవరి 8న ప్రశ్న అడిగించారు. దీనిపై కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానమిస్తూ పోలవరం ఎత్తు తగ్గించాలన్న ప్రతిపాదన ఏదీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు పంపలేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టు ఎత్తు ఒక్క అంగుళం కూడా తగ్గదని తేల్చిచెప్పారు. ఆ తర్వాత మూడు రోజులకే ఫిబ్రవరి 11న ఎంపీ రఘురామకృష్ణరాజు కూడా అదే అంశంపై లోక్‌సభలో ప్రశ్న అడిగారు. దానిపై కూడా కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మరోసారి సమాధానమిస్తూ పోలవరం ఎత్తు తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు ఎలాంటి ప్రతిపాదన పంపలేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టు ఎత్తు ఒక్క అంగుళం కూడా తగ్గదని మరోసారి తేల్చిచెప్పారు. ఇక శాసనసభలో పోలవరంపై చర్చ జరిగిన ప్రతి సందర్భంలోనూ ప్రాజెక్టు ఎత్తు ఒక్క అంగుళం కూడా తగ్గదని సీఎం వైఎస్ జగన్ పదేపదే స్పష్టం చేస్తూ వస్తున్నారు. అయినా సరే టీడీపీ నేతలు దుష్ప్రచారాన్ని ఆపడం లేదు. ఎల్లో మీడియా తప్పుడు కథనాలను అచ్చేయడం కూడా మానడం లేదు. ఈక్రమంలో పోలవరం ఎత్తు తగ్గిస్తున్నారా? అంటూ టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ మరోసారి రాజ్యసభలో పాత ప్రశ్నే వేయడం గమనార్హం.

ప్రాజెక్టుల భద్రత దృష్ట్యా..

ఏదైనా కొత్తగా ఒక ప్రాజెక్టును నిర్మించినప్పుడు నిర్మాణం పూర్తయిన తొలి ఏడాదే పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయరు. నిర్మాణంలో ఏవైనా లోపాలు ఉంటే.. పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయడం ప్రాజెక్టు భద్రతకే ప్రమాదం. ప్రాజెక్టుల భద్రత దృష్ట్యా నీటిని నిల్వ చేయడంపై కేంద్ర జలసంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తొలి ఏడాది పూర్తి నీటి నిల్వ సామర్థ్యంలో 1/3వ వంతు.. రెండో ఏడాది 2/3వ వంతు.. మూడో ఏడాది పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయాలని సీడబ్ల్యూసీ పేర్కొంది.

నాడు శ్రీశైలంలోనూ..

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం 1981 నాటికి పూర్తయింది. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా, పూర్తి నీటి నిల్వ 215.80 టీఎంసీలు. సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం 1981–82లో 854 అడుగుల్లో నీటిని నిల్వ చేశారు. ఆ తర్వాత దశలవారీగా 1984–85 నాటికి పూర్తి స్థాయిలో అంటే 215.80 టీఎంసీలను నిల్వ చేశారు. ఆ ప్రకారమే పోలవరం పూర్తయిన తొలి ఏడాది 41.15 మీటర్లలో నీటిని నిల్వ చేస్తామని సీఎం వైఎస్ జగన్ అనేక మార్లు స్పష్టం చేశారు. ఆ తర్వాత 45.72 మీటర్ల పరిధిలోని ముంపు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించి సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు పూర్తి స్థాయిలో అంటే 194.6 టీఎంసీలు నిల్వ చేస్తామని చెప్పారు. సీడబ్ల్యూసీ మార్గదర్శకాలపై అవగాహన లేని టీడీపీ నేతలు, ఎల్లో మీడియా పోలవరం ఎత్తు తగ్గిస్తున్నారంటూ పదేపదే దుష్ప్రచారం చేస్తుండటం గమనార్హం.

ప్రణాళికాయుతంగా పూర్తి చేస్తుంటే కడుపు మంట

విభజన చట్టం ప్రకారం కేంద్రమే కట్టాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను 2016లో దక్కించుకున్న చంద్రబాబు సులభంగా చేయగలిగి, అధికంగా లాభాలు వచ్చే పనులనే చేపట్టారు. వరద ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలెట్ ఛానల్‌ను పూర్తి చేయకుండానే గోదావరి గర్భంలో ప్రధాన డ్యామ్(ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్) పునాది డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నిర్మాణాన్ని ప్రారంభించి వాటిని పూర్తి చేయలేక ఇరువైపులా ఖాళీలను వదిలేసి చేతులెత్తేశారు. గోదావరికి 2019లో వచ్చిన భారీ వరద ప్రవాహం ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గూండా అధిక ఉద్ధృతితో ప్రవహించడం వల్ల ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతం కోతకు గురై నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించాక 18 నెలలపాటు కోవిడ్ మహమ్మారి విజృంభించినా, కేంద్రం నిధులు ఇవ్వకున్నా రాష్ట్ర ఖజానా నుంచే వెచ్చిస్తూ పోలవరం ప్రాజెక్టును ప్రణాళికాయుతంగా పూర్తి చేస్తున్నారు. స్పిల్ వేను 45.72 మీటర్ల ఎత్తుతో పూర్తి చేశారు. అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్, పైలెట్ ఛానల్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేశారు. డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చి డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్ది ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఇది చంద్రబాబు, ఎల్లో మీడియాకు కంటగింపుగా మారింది. పోలవరం పూర్తయితే రాష్ట్రం సస్యశ్యామలమై తమకు రాజకీయంగా పుట్టగతులు ఉండవనే భయంతో ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తున్నారంటూ పాతపాటే అందుకున్నారు.

ఊరూరా 'ఆసరా' ఉత్సవాలు

- సీఎం వైఎస్ జగన్ ఫొటోలకు పొదుపు సంఘాల మహిళల క్షీరాభిషేకాలు
- 76 మండలాల్లో లబ్ధిదారుల సమావేశాలు
- చంద్రబాబు మోసం.. జగన్ హామీ అమలుపై చర్చ



కృష్ణా జిల్లా పామర్రులో పొదుపు సంఘాల మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి ఎంపీడీవో ఆఫీసు వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పొదుపు సంఘాల మహిళలు

సాక్షి, అమరావతి: శ్రీరామనవమికి ముందే రాష్ట్రమంతటా 'వైఎస్సార్ ఆసరా' ఉత్సవాలు పండుగ వాతావరణంలో కొనసాగుతున్నాయి. పొదుపు సంఘాల మహిళలు ఊరూరా సభలు నిర్వహిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలకు క్షీరాభిషేకాలు చేస్తూ కృతజ్ఞత చాటుకుంటున్నారు. 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాల పేరుతో మహిళల పేరిట ఉన్న అప్పు మొత్తాన్ని నాలుగు విడతల్లో ప్రభుత్వమే నేరుగా ఆయా మహిళలకు అందజేసే వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని సీఎం జగన్ ఈ నెల 25న ఏలూరు జిల్లా దెందులూరులో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇంతకుముందే ప్రభుత్వం రెండు విడతల్లో రూ.12,758 కోట్ల మొత్తాన్ని నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేసింది. తాజాగా మూడో విడతగా 7,98,395 స్వయం సహాయక పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న 78,94,169 మంది అక్కచెల్లెమ్మలకు రూ.6,419.89 కోట్లను జమ చేయనుంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పైసా కూడా మాఫీ చేయకుండా మోసం చేశారు. చంద్రబాబు మాదిరిగా కాకుండా పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసి చూపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు వివిధ రూపాల్లో కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

101 మండలాల్లో లబ్ధిదారులతో సభలు

వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీని 10 రోజుల పాటు (ఏప్రిల్ 5 వరకు) రాష్ట్రమంతటా ఎక్కడికక్కడ స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించనున్నట్టు ప్రభుత్వం ముందే ప్రకటించింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 76 మండలాల్లో వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల సమావేశాలు జరిగినట్టు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో ఇంతియాజ్ వివరించారు. 25వ తేదీన ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన తర్వాత అదే రోజున రాష్ట్రవ్యాప్తంగా 12 మండలాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయని, ఆదివారం మరో 13 మండలాల్లోనూ, సోమవారం జరిగిన 76 మండలాల్లో కలిపి మొత్తం 101 మండలాల్లో ఇప్పటివరకు లబ్ధిదారుల సమావేశాలు పూర్తయ్యాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ముఖ్యమంత్రి రాసిన లేఖల ప్రతులను లబ్ధిదారులకు అందజేశారు.

ఏపీ ఓ రోల్‌మోడల్

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సహకారం కొనసాగుతుంది. 2047నాటికి దేశం మాదిరిగానే రాష్ట్రం కూడా మంచి ఆదాయం కలిగిన ప్రాంతంగా ఎదిగేందుకు మా సహకారం, మద్దతు కొనసాగుతుంది.

- అత్యంత వృద్ధిరేటు ఉన్న రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. దేశ సగటు కన్నా ఎక్కువ ఉంది. అభివృద్ధి రేటు చాలా బాగుంది. ప్రజలకు మంచి సేవలు అందుతున్నాయి. పారిశ్రామిక రంగం, వైద్య రంగాలు ఉన్నాయి. రాష్ట్రంలో సమర్థవంతమైన, డైనమిక్ ప్రభుత్వం ఉంది.
- వరల్డ్ బ్యాంకు కలసి ఏపీలో చేపడుతున్న కార్యక్రమాలు చాలా బాగా కొనసాగుతున్నాయి. మీరు (సీఎం జగన్) అమలు చేస్తున్న చాలా కార్యక్రమాలు జాతీయ స్థాయిలో స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఆరోగ్యరంగంలో టెలిమెడిసిన్, ఆన్‌లైన్ సేవలు, ప్రజలకు చేరువగా వైద్యం, స్వయం సహాయక సంఘాలకు మద్దతుగా నిలవడం.. ఇవన్నీ చాలా మంచి కార్యక్రమాలు.
- విద్యారంగంలో కూడా ప్రపంచబ్యాంకు రాష్ట్రంతో కలిసి పనిచేస్తోంది. ఈ రంగంలో మీరు చాలా బాగా పని చేస్తున్నారు. సీఎం జగన్ స్ఫూర్తిదాయకులు. రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని తపనపడుతున్నారు. రాష్ట్రంలో మంచి విధానాలు అమలవుతున్నాయి.

కీలక రంగాలకు మరింత సహకారం: సీఎం జగన్

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ప్రపంచ బ్యాంకు మరింత సహకారం అందించాలని సీఎం జగన్ కోరారు. సమావేశం సందర్భంగా ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు. సత్య నాదెళ్ల లాంటి వారు మరింత మంది ఆంధ్రప్రదేశ్ నుంచే రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో మా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని కోరుతున్నా. వీటిల్లో మరింతగా ప్రపంచబ్యాంకు భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం స్కూళ్ల రూపురేఖలన్నీ మారుస్తున్నాం. 12 రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం. 6వ తరగతి నుంచి ఐఎఫ్‌పీ డిజిటల్ ప్యానెళ్ల ఏర్పాటు చేస్తున్నాం. నాడు – నేడు తొలిదశ పూర్తైన స్కూళ్లలో వచ్చే జూన్ కల్లా వీటిని అందుబాటులోకి తెస్తాం. దీంతో బోధనా పద్ధతులను పూర్తిగా మారుస్తున్నాం. ఇది డిజిటలైజేషన్ దిశగా వేస్తున్న పెద్ద అడుగు. నాడు– నేడు కోసం భారీ ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నాం. ప్రస్తుతం రెండో దశ పనులు కొనసాగుతున్నాయి.
- విద్యార్థుల చేరికలకు సంబంధించి జీఈఆర్ రేషియోను పెంచుకుంటూ వెళ్లాలన్నదే మా ఉద్దేశం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో దేశ సగటు కన్నా తక్కువగా ఉంది. ఇప్పుడు దీన్ని అధిగమించాం. దీనికోసమే స్కూళ్లలో మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరిచాం. గతంలో ప్రైవేట్ స్కూళ్లతో ప్రభుత్వ పాఠశాలలు పోటీపడలేవన్న మాట వినిపించేది. రెండేళ్ల తర్వాత.. ప్రైవేట్ స్కూళ్లు ప్రభుత్వ స్కూళ్లతో పోటీపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. విద్యాభ్యాసాన్ని అత్యంత సులభతరం చేయడానికే ఈ చర్యలు. బైలింగ్యువల్ (ద్విభాషా) పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ ఇస్తున్నాం. విద్యాకానుకలో భాగంగా డిక్షనరీ అందచేస్తున్నాం. పిల్లలను బడికి పంపేలా తల్లులను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి తీసుకొచ్చాం. పిల్లల హాజరుతో అనుసంధానం చేసి పథకాన్ని అమలు చేస్తున్నాం. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రతి విద్యార్థిని ట్రాక్ చేస్తున్నాం. 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తున్నాం. వసతి దీవెన కింద ఇస్తున్నాం. మధ్యాహ్న భోజనంలో కూడా బాగా మార్పులు తీసుకొచ్చాం. మంచి పౌష్టికాహారం, నాణ్యతతో కూడా భోజనాన్ని అందిస్తున్నాం. ఈ కార్యక్రమాల మీద చేసే ఖర్చును మేం పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పెట్టుబడిగా భావిస్తున్నాం.
- రాష్ట్ర విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా విదేశీ విద్యా దీవెన కూడా అమలు చేస్తున్నాం. సత్య నాదెళ్ల లాంటి వారు మరింత మంది ఆంధ్రప్రదేశ్ నుంచే రావాలన్నది మా ఉద్దేశం. రాష్ట్రంలో ఆరు పోర్టులు ఉన్నాయి. మరో నాలుగు వస్తున్నాయి. పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థలకు అవసరమైన నైపుణ్యం ఉన్న మానవ వనరులు రాష్ట్రంలోనే తయారవుతాయి. ఈ కార్యక్రమాల్లో ప్రపంచబ్యాంకు భాగస్వామి కావాలని కోరుతున్నా.
- వైద్యారోగ్యశాఖలో కొత్తగా సుమారు 48 వేలమందికి పైగా సిబ్బందిని నియమించాం. కొత్తగా 17 కొత్త మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలవుతోంది. ఆరోగ్యశ్రీని అత్యంత సమర్థంగా అమలు చేస్తున్నాం. ఆర్బీకేల ద్వారా రైతులకు తోడుగా నిలుస్తున్నాం. వైద్యం, విద్య, వ్యవసాయం.. ఈ మూడు రంగాల్లో చాలా మార్పులు తీసుకొచ్చాం. రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నది మా లక్ష్యం. క్షేత్రస్థాయిలో సమస్యలకు సమూల పరిష్కారాలను చూపే దిశగా ముందుకు సాగుతున్నాం. ప్రపంచబ్యాంకు ఈ కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని కోరుతున్నా. కేవలం ఆర్థికంగానే కాకుండా మంచి విధానాలను అమలు చేయడంలో, సాంకేతికంగానూ.. ఇలా సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నా.
- ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎం.టీ.కృష్ణబాబు, ప్రవీణ్ ప్రకాష్, శశిభూషణ్ కుమార్, సత్యనారాయణ, సురేష్ కుమార్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ బ్యాంకు బృందంలో ప్రధాన విదేశీ వ్యవహారాల సలహాదారు సుదీప్ మజుందార్, ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ అండ్ టీటీఎల్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు కార్తీక్, అగ్రికల్చర్ స్పెషలిస్ట్ ఆండ్రూ డి.గుడ్‌ల్యాండ్, ప్రాక్టీస్ మేనేజర్, ఎంటీఐ హూస్ సాహిబ్ సోహ్, మానవాభివృద్ధి ప్రోగ్రామ్ లీడర్ జుంకో ఒనిషి, ఆరోగ్య పోషణ, జనాభా ప్రాక్టీస్ మేనేజర్ ట్రినా ఎస్.హక్యూ, ప్రోగ్రామ్ లీడర్ భావనా భాటియా తదితరులున్నారు.

రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై పిటిషన్

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా ఆర్ 5 జోన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గెజిట్ నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధంగా ప్రకటించి, దానిని రద్దు చేయడంతో పాటు దాని అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా, కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన రైతు అవల నందకిషోర్ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ చేయనుంది.

దర్యాప్తు ఎందుకింత ఆలస్యమవుతోంది?

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐపై సుప్రీం కోర్టు అసహనం

సాక్షి, న్యూఢిల్లీ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో ఎందుకింత ఆలస్యమవుతోందని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని, అవసరమైతే దర్యాప్తు అధికారి రామ్‌సింగ్‌ను మార్చే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించింది. వైఎస్ వివేకా హత్య కేసు విచారణలో దురుద్దేశపూరితంగా వ్యవహరిస్తున్న దర్యాప్తు అధికారి రామ్‌సింగ్‌ను మార్చాలని, నిరపరాధి అయిన తన భర్త జైలులో మగ్గుతున్నందున, దర్యాప్తును వేగవంతం చేయాలని కోరుతూ నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సీబీఐ గతంలో, ఇప్పుడు దాఖలు చేసిన నివేదికలు చూశామని, పెద్దగా తేడా ఏమీ లేదని తెలిపింది. రాజకీయ కక్షతోనే ఈ హత్య జరిగిందని చెబుతున్న సీబీఐ... ఆ వాదానికి బలం చేకూర్చే ఆధారాలేవీ ఇవ్వలేకపోయిందని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశించినప్పటికీ కేసు దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని పేర్కొంది. విచారణను త్వరగా పూర్తి చేయాలని ఎన్నిసార్లు చెబుతున్నా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తంచేసింది. దర్యాప్తు అధికారిని మార్చే విషయంపై సీబీఐ వైఖరి ఏమిటో తెలపాలని ఆదేశించింది. ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతి కోరిన వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె ఎన్.సునీత తరఫు న్యాయవాదిపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసులో మీరెందుకు ఇంప్లీడ్ కావాలని ప్రశ్నించింది. కేసు విచారణను ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది.

ఏపీ ప్రభుత్వ పథకాలు భేష్

ప్రపంచ బ్యాంక్ బృందం ప్రశంస



వణుకూరులో వలంటీర్లతో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంక్(ఇండియా) డైరెక్టర్ ఆగస్ట్ తను కమే

పెనమలూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరు అమోఘమని ప్రపంచ బ్యాంక్ (ఇండియా) డైరెక్టర్ ఆగస్ట్ తను కమే నేతృత్వంలోని బ్యాంక్ బృందం ప్రశంసించింది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం వణుకూరులో ప్రపంచ బ్యాంక్ బృందం సోమవారం పర్యటించింది. వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాన్ని సందర్శించింది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్, కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, గ్రామ/వార్డు సచివాలయాల జాయింట్ డైరెక్టర్ వికాస్, పలువురు అధికారులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తున్న సేవలను ప్రపంచ బ్యాంక్ బృందానికి వివరించారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్లతో ఆగస్ట్ తను కమే మాట్లాడారు. వలంటీర్లు అందిస్తున్న సేవల వివరాలను ప్రపంచ బ్యాంక్ బృందం అడిగి తెలుసుకుంది. అనంతరం వైఎస్సార్ హెల్త్ క్లినిక్, 104, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు, ఫ్యామిలీ ఫిజీషియన్, టెలిమెడిసిన్, ఆశ వర్కర్లు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవల తీరును పరిశీలించి ప్రశంసించింది. విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా సాయం, పంట కొనుగోలు వివరాలు, కియోస్క్ సేవలపై ప్రపంచ బ్యాంక్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతా బాయ్, జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిళ్ల బలోపేతం

సివిల్స్, గ్రూప్స్, స్టాఫ్ సెలక్షన్, రైల్వే రిక్రూట్‌మెంట్‌కు ఉచిత శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు (బీసీ) యువతకు మేలు చేసేలా బీసీ స్టడీ సర్కిళ్లను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. వీటి నిర్వహణ కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 13 బీసీ స్టడీ సర్కిళ్లు ఉన్నాయి. వాటి ద్వారా నిరుద్యోగ విద్యావంతులకు ఉచిత శిక్షణ ఇచ్చి మిగిలిన వారితో దీటుగా పోటీ పడి అవకాశాలు దక్కించుకునేలా తీర్చిదిద్దుతారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు స్టైఫెండ్, మెటీరియల్, పుస్తకాలు అందించనున్నారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్–2, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ), పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (పీఆర్‌బీ), డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. బీసీ స్టడీ సర్కిళ్లలో ప్రవేశం కోసం రూ.లక్ష వార్షిక ఆదాయ పరిమితిగా నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న 13 స్టడీ సర్కిళ్లలో ప్రవేశానికి రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14శాతం సీట్లు కేటాయించారు.

రాష్ట్రంలో ఉపాధి కూలీల వేతనం రూ.15 పెంపు

ఏప్రిల్ ఒకటి నుంచి అమలు.. గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన కేంద్రం

ప్రస్తుతం గరిష్టంగా రూ.257 చెల్లింపు... ఇక రూ.272



సాక్షి, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం వేతనాలను పెంచింది. రాష్ట్రంలో ప్రస్తుతం గరిష్టంగా రూ.257 చొప్పున వేతనం చెల్లిస్తుండగా, దానిని ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రూ.272కు పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో రోజువారీ గరిష్ట వేతనాన్ని రూ.15 పెంచింది. ఉపాధి హామీ పథకం కింద వేతనాలను ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచే రాష్ట్రాల వారీగా వేర్వేరుగా నిర్ణయిస్తోంది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆర్థిక సంవత్సరం ప్రారంభం సందర్భంగా వేతన రేట్లను నిర్ణయిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. ఆయా రాష్ట్రాల్లో వ్యవసాయ రంగంలోని కూలీల కొనుగోలుశక్తి (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్) ఆధారంగా వేతనాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నిర్ణయిస్తారు.

కొన్ని ముఖ్యమైన రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకం వేతనాల వివరాలు (రూ.లో)

రాష్ట్రం	ప్రస్తుతం గరిష్ట వేతనం	2023-24లో గరిష్ట వేతనం
ఆంధ్రప్రదేశ్	257	272
తెలంగాణ	257	272
బీహార్	210	228
గుజరాత్	239	256
కర్ణాటక	309	316
కేరళ	311	333
మధ్యప్రదేశ్	204	221
మహారాష్ట్ర	256	273
ఒడిశా	222	237
రాజస్థాన్	231	255
తమిళనాడు	281	294
పశ్చిమ బెంగాల్	223	237

ఘనంగా శ్రీచైతన్య స్కూల్ ఫియెస్టా

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శిల్ప కళా వేదికలో శ్రీచైతన్య స్కూల్ ఇంటర్ స్కూల్ స్టేట్ లెవెల్ కాంపిటీషన్ ఫియెస్టా– ఎ బోకె ఆఫ్ ఇన్‌హెరెంట్ టాలెంట్స్–2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్టు శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ పేర్కొన్నారు. నారథాన్–స్టోరీ నెరేషన్, అబాకస్, చిత్రకళ (డ్రాయింగ్) మూడు విభాగాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. స్కూల్, జోనల్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన తెలంగాణలోని దాదాపు 500కు పైగా విద్యార్థులతో గ్రాండ్ ఫినాలే విజయవంతంగా నిర్వహించి బహుమతులను అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత బీఎస్ రావు విద్యార్థులను అభినందించారు.

104 వాహనాలు మరో 260 అందుబాటులోకి..

జిల్లాల్లో ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ) వాహనాలు 260 కొత్తగా అందుబాటులోకొచ్చాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లో భాగంగా ప్రభుత్వం 260 ఎంఎంయూ వాహనాలను కొనుగోలు చేసింది. వీటిని సోమవారం జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2020లో మండలానికి ఒకటి చొప్పున 656 ఎంఎంయూ వాహనాలతో 104 సేవలను బలోపేతం చేసిన విషయం తెలిసిందే. కాగా, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను పీహెచ్‌సీ వైద్యుడు ఎంఎంయూ వాహనంతో పాటు నెలలో రెండు సార్లు సందర్శించాల్సి ఉంటుంది. 656 ఎంఎంయూ వాహనాలతో అన్ని విలేజ్ క్లినిక్‌లను నెలలో రెండు సార్లు సందర్శించడం వీలుపడదు. ఈ నేపథ్యంలో అన్ని సచివాలయాలను నెలలో రెండు సార్లు సందర్శించడానికి వీలుగా రూ.60 కోట్లకు పైగా నిధులతో మరో 260 ఎంఎంయూ వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ వాహనాల్లో జిల్లాకు ఒకటి చొప్పున 26 వాహనాలను బ్యాకప్ కింద ఉంచుతారు. మిగిలిన వాహనాలకు విలేజ్ క్లినిక్‌లను మ్యాపింగ్ చేశారు. మరోవైపు వచ్చే నెల ఆరో తేదీన పూర్తి స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి వైద్య శాఖ ఏర్పాట్లు చేపడుతోంది. గతేడాది అక్టోబర్ 21 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్‌గా కార్యక్రమాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే.

బాబు 'ఓటుకు కోట్లు' రాజకీయంపై
విచారణ జరపాలి

- నాటి వైశ్రాయ్ నుంచి నిన్నటి ఎమ్మెల్యేల కొనుగోలు వరకు బాబుది ఇదే తీరు
- సీబీసీఐడీ, ఈడీలు జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి
- ఇంత డబ్బు ఎలా ప్రయాణం చేసిందో వెలికితీయాలి
- శాసన మండలి సభ్యుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు 'ఓటుకు కోట్లు' రాజకీయంపై తక్షణమే విచారణ జరపాలని శాసన మండలి సభ్యుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు మనుషులు డబ్బులిస్తామని ఆఫర్ చేశారని, దానిని తాను తిరస్కరించానని ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ చెప్పడం, ఇది వాస్తవమేనని ఎమ్మెల్యే రామరాజు కూడా ఒప్పుకోవడమే బాబు 'ఓటుకు కోట్లు' రాజకీయానికి నిదర్శనమన్నారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలోనూ చంద్రబాబు ఇలాంటి 'ఓటుకు కోట్లు' కేసులో అడ్డంగా దొరికారని, ఆయన బ్రీఫ్‌డ్ మీ అనటం విన్నామని చెప్పారు. 1995లో వైశ్రాయ్ నుంచి నిన్నటి ఎమ్మెల్యేల కొనుగోలు వరకూ బాబుది ఇదే తీరని చెప్పారు. ఈ విషయంలో సీబీసీఐడీ, ఈడీలు జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. ఒక్కొక్క ఎమ్మెల్యేకి రూ.10 నుంచి 20 కోట్లు ఇస్తామన్నారని ఎమ్మెల్యేలు రాపాక, మద్దాళి గిరి కూడా చెప్పారన్నారు. వీటన్నిటిపై సీబీసీఐడీ విచారణ జరిపి, ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జరిగిన 'ఓటుకు కోట్ల' కేసును కూడా దీనితో కలిపి విచారించాలన్నారు. ఇంత డబ్బు ఎలా ప్రయాణం చేసింతో ఈడీలాంటి సంస్థలు దర్యాప్తు జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలుగు రాష్ట్రాల్లోనే ఎమ్మెల్యేల కొనుగోలు ఒకే వ్యక్తి వద్ద నుంచి ప్రారంభమైందని, అన్నీ ఒకే సోర్స్ నుంచి జరుగుతున్నాయని అన్నారు.

శ్రీదేవి స్క్రిప్ట్ చంద్రబాబుదే

శ్రీదేవి అమరావతి అన్నప్పుడే ఆ స్క్రిప్ట్ చంద్రబాబుదని అర్థమైందన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసినా, శ్రీదేవి ఒక్కరే అమరావతి నినాదాన్ని ఎందుకు ఎత్తుకున్నారని ప్రశ్నించారు. ఆమె బాగోతాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో ప్రాణ హాని ఉందని అనడం సరైనది కాదని అన్నారు. అంత పెద్ద వారి గురించి, అంతటి పెద్ద పెద్ద మాటలు ఎందుకని అన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో దళితులంతా గౌరవంగా ఉన్నారని, ఎమ్మెల్యే శ్రీదేవిని కూడా సీఎం గౌరవంగా చూసుకున్నారని తెలిపారు. శ్రీదేవికి భయం అక్కర్లేదని, ఆమె ఎక్కడైనా స్వేచ్ఛగా తిరగొచ్చని చెప్పారు. ఆమెకు ఏం రక్షణ కావాలో ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. శ్రీదేవి రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి వివాదాలేనని, ఎన్నిసార్లు చెప్పినా మార్పు రాలేదని తెలిపారు. ఆమె విషయంలో వాస్తవంగా ఏం జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. ఆమె ఇలాంటి వివాదాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.



న్యాయస్థానాల కంటే ఒక ఉన్నత న్యాయస్థానం ఉంది. అది అంతరాత్మ. దానిముందు ఏ న్యాయస్థానమూ పనికిరాదు.
– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, మార్చి, 28

మనవాళ్ళు బంగారం

ఇది మన అమ్మాయిలు రాసిన కొత్త చరిత్ర. ఒకటీ రెండు కాదు... ఏకంగా నాలుగు స్వర్ణాలు. అదీ అంతర్జాతీయ పోటీల్లో! ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబీఏ) నిర్వహించిన మహిళల వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో మన దేశ మహిళా బాక్సింగ్ జట్టు నాలుగు పసిడి పతకాలతో ప్రపంచమంతా తలతిప్పి చూసేలా చేసింది. ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో శనివారం నీతూ ఘంఘాస్ (48 కిలోల విభాగం), స్వీటీ బూరా (81 కిలోలు) బంగారు పతకాలు సాధిస్తే, ఆదివారం మన తెలుగమ్మాయి నిఖత్ జరీన్ (50 కిలోలు), లవ్లీనా బోర్గొహైన్ (75 కిలోలు) పసిడి కాంతులు పూయించారు. మొత్తం నలుగురూ తమ బాక్సింగ్ పంచ్‌లతో బలమైన ప్రత్యర్థులను మట్టికరిపించి, దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. నిన్నటి మేరీ కోమ్ వారసులుగా బాక్సింగ్‌లో మరింత మంది యువతులు ముందుకొచ్చిన చరిత్రాత్మక సందర్భం పతకాల సాక్షిగా వెల్లడైంది.

హర్యానా ఆడపిల్ల నీతూ, తెలంగాణ యువతి నిఖత్, అస్సామ్ అమ్మాయి లవ్లీనా, హర్యానాకే చెందిన సీనియర్ క్రీడాకారిణి స్వీటీ... నలుగురూ దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. స్వర్ణపతకం సాధించి తల్లి మెడలో దాన్ని అలంకరించాలని ఓ అమ్మాయి, బహుమతిగా వచ్చే పారితోషికంతో కొత్త మెర్సిడెస్ కారు కొని తల్లితండ్రులను తమ సొంతవూరు నిజామాబాద్‌కు తీసుకెళ్ళాలని మరో యువతి, సరైన ఫామ్‌లో లేవంటూ కొట్టిపారేసిన విమర్శకుల నోళ్ళు మూయించాలని ఇంకో వనిత, ఇష్టదైవతారాధన, ఆశీస్సులతోనే విశ్వవేదికపై విజయం సాధ్యమని భావించే వేరొక హర్యానా యువతి – ఇలా ఈ నలుగురిలో ఒక్కొక్కరికీ ఒక్కో రకమైన ప్రేరణ. మొత్తం 13 దేశాల నుంచి వచ్చి, ప్రపంచపోరులో ఫైనల్స్‌కు చేరిన మహిళలు 24 మంది. వారిలో భారత మహిళా బాక్సింగ్ చతుష్టయం సత్తా చాటింది. భారత్‌తో పాటు ఒక్క చైనా నుంచే నలుగురు ఫైనల్స్‌కు చేరుకొని, స్వర్ణాల కోసం పోటీపడ్డారు. గత ప్రపంచ మహిళా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో 3 పతకాలు సాధించిన భారత్ ఈసారి 4 పతకాలు గెలిచి, మునుపటి రికార్డును మెరుగుపరుచుకోవడం విశేషం.

గత ఏడాది 52 కిలోల విభాగంలో వరల్డ్ టైటిల్ సాధించిన 26 ఏళ్ళ నిఖిత్ ఈసారి కొత్తగా 50 కిలోల విభాగం ఎంచుకొని, అందులో తన సత్తా చాటారు. గతంలో రెండుసార్లు ఏషియన్ ఛాంపియన్ అయిన వియత్నామ్‌కు చెందిన ప్రత్యర్థి నూయెన్ తీ తామ్‌పై ఫైనల్‌లో 5–0 తేడాతో విజయం సాధించారు. కీలకమైన ఆఖరి మూడు నిమిషాల ఆటలో, ప్రత్యర్థి చాలా దూకుడు మీద ఉన్నప్పుడు, శరీర దార్ఢ్యం, మానసిక బలం తోడుగా నిఖత్ ప్రతిష్ఠాత్మక ప్రపంచ పోటీల్లో వరుసగా రెండుసార్లు స్వర్ణాలు సాధించి, చరిత్రకెక్కారు. మేరీ లానే ఈశాన్య ప్రాంతం నుంచి వచ్చిన లవ్లీనా సైతం ఫైనల్‌లో రెండుసార్లు కామన్‌వెల్త్ గేమ్స్ పతక విజేత అయిన ఆస్ట్రేలియాకు చెందిన గెయిట్లిన్ పార్కర్‌పై హోరాహోరీ పోరాడి, 5–2 తేడాతో గెలుపు కైవసం చేసుకున్నారు. ఎప్పుడూ ఎదురుదాడి అనే ఏకైక వ్యూహంతో సాగే నీతూ ఆటలో పరిస్థితి, ప్రత్యర్థిని బట్టి వ్యూహాన్ని మార్చుకొనే కళను అలవరుచుకున్నారు. బాక్సింగ్ మెలకువల్లో ఆరితేరిన నిఖత్ సైతం తాను పోటీపడ్డ ఒలింపిక్ వెయిట్ వర్గంలోని ప్రపంచ అగ్రశ్రేణి బాక్సర్లతో తలపడి, మెరుగైన ఆటతీరుతో దుమ్మురేపడం గమనార్హం.

రానున్న ఆసియా క్రీడోత్సవాలకు సిద్ధం కావడానికీ, తప్పులు సరిదిద్దుకోవడానికీ ఈ ప్రపంచ బాక్సింగ్ పోటీలు మన అమ్మాయిలకు మంచి అవకాశమయ్యాయి. మరో 16 నెలల్లో ప్యారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో స్వర్ణమే ధ్యేయంగా ముందుకు సాగే ఊపు తెచ్చింది. నిజానికి, క్రీడల్లో మన దగ్గర ప్రతిభాపాటవాల కొరత లేదు. యువతరంలో బోలెడంత ఉత్సాహం, ఉత్తేజం ఉన్నాయి. అయితే, ఆ యువ క్రీడాప్రతిభను సరైన పద్ధతిలో తీర్చిదిద్ది, దోవలో పెట్టే వేదికలే ఎప్పుడూ కరవు. 2018లో క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ క్షేత్రస్థాయిలో క్రీడా సంస్కృతినీ, ప్రాథమిక వసతి సౌకర్యాలనూ పెంపొందించడానికి హిమాచల్‌ప్రదేశ్‌లో 'ఖేల్ మహాకుంభ్'ను ప్రారంభించారు. క్రమంగా అది బిహార్, ఉత్తరప్రదేశ్, లద్దాఖ్, కశ్మీర్‌లలోని గ్రామాలకు విస్తరించింది. దేశంలో కనీసం 200 మంది దాకా ఎంపీలు తమ తమ నియోజకవర్గాల్లో ఈ ఖేల్ మహాకుంభ్‌ను నిర్వహిస్తూ వచ్చారు. ఇవన్నీ దిగువ, మధ్యాదాయ కుటుంబాల యువతుల కలలకు కొత్త రెక్కలు తొడిగాయి. సాంప్రదాయిక పురుషాధిక్య రంగంలోనూ మహిళలు పైకి రావడానికి దోహదపడ్డాయి.

'బేటీ బచావో, బేటీ పఢావో' తర్వాత పాలకుల 'ఖేలో ఇండియా' పథకం నవతరం ఆశలకు కొత్త ఊపిరి. మెరుగైన శిక్షణకు క్రీడా సామగ్రి అందుబాటులో ఉండే ఖేలో ఇండియా కేంద్రాలు గ్రామీణ యువతరానికి, ముఖ్యంగా యువతులకు వరం. మీడియా దృష్టిపెట్టని అనేక భారతీయ ఆటలు ఈ పథకంతో జనం ముందుకు వస్తున్నాయి. గ్రామీణ స్థాయిలోనే అథ్లెట్లకు ప్రోత్సాహం అందుతోంది. మగవారివే అనుకొనే క్రీడల్లోనూ మన వనితల జైత్రయాత్రకు ఇలాంటి ప్రయత్నాలు ఓ ఉత్ప్రేరకం. లింగభేదాల గోడలను బద్దలుకొట్టి, అందరికీ అభిమాన బాక్సర్‌గా నిఖత్ అవతరించడం అవిస్మరణీయం. గమనిస్తే, మన దేశపు ఒలింపిక్ పతకాల పట్టికలోనూ మహిళలే మహారాణులు. ఇంటా బయటా ఎన్నో సవాళ్ళను అధిగమించి, ఆరుసార్లు ప్రపంచ టైటిళ్ళు సాధించిన బాక్సర్ మేరీ కోమ్ ఆదర్శంగా మరిన్ని జాతి రత్నాలు వెలుగులోకి వచ్చాయి. 2008 ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన విజేందర్ సింగ్ విజయ గాథ తర్వాత మన పురుషుల బాక్సింగ్ కొంత స్తబ్దుగా మారినవేళ బాక్సింగ్‌ను భారత్‌కు పతకాల అడ్డాగా మార్చిన మహిళలూ మీకు జోహార్లు!

గొంతెత్తడం ప్రజల రాజకీయ కర్తవ్యం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

అభిప్రాయ ప్రకటనకు వీలులేని స్వాతంత్ర్యం నిరర్థకం. పౌరుల సమావేశ స్వేచ్ఛకు, చర్చలకు అవకాశం కల్పించని వ్యవస్థ దేనికి? అలా లేనప్పుడు దేశ సామాజిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి అంతకన్నా పెద్ద ప్రమాదం మరొకటి లేదు. బహిరంగ చర్చలు, నిర్ణయాలు ప్రజల రాజకీయ కర్తవ్యమని మరచిపోరాదని శతాబ్దం క్రితమే సుప్రసిద్ధ అమెరికన్ న్యాయమూర్తి జస్టిస్ లూయీ బ్రాండీస్ అన్నారు. పౌరులకు భారత రాజ్యాంగం హామీపడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అక్షరసత్యంగా అమలు జరగకుండా పాలక పక్షాలు అడ్డుకుంటూనే వస్తున్నాయి. పౌర స్వేచ్ఛకు 'శ్రీరామరక్ష'గా నిలబడగలిగిన పాలకులే ప్రజల మన్నన పొందగలరు. పౌరుల సుఖ సంతోషాలే తమ సుఖసంతోషాలని విశ్వసించగలిగినవారే పౌరస్వేచ్ఛకు హామీ ఇవ్వగలరు.

"స్వాతంత్ర్యం పొందిన దేశంలో రాజ్య పాలనా వ్యవస్థ అంతిమ లక్ష్యం– దేశ పౌరులు స్వేచ్ఛగా తమ శక్తియుక్తుల్ని వృద్ధి చేసుకునేటట్లు వారికి అండదండలుగా నిలవగల్గడం. ప్రభుత్వంలో నిరంకుశ ధోరణులు ప్రబలినప్పుడు బుద్ధిగల పాలకులు వాటిని అణచివేయాలి. అలాంటి పాలకులు మాత్రమే ప్రజల మన్ననలు పొందగల్గుతారు. అలాంటి పాలకులు మాత్రమే పౌర స్వేచ్ఛకు 'శ్రీరామరక్ష'గా నిలబడగలరు. అలాంటి వారు మాత్రమే పౌరుల సుఖ సంతోషాలే తమ సుఖసంతోషాలని విశ్వసించగలరు. పౌరులు స్వేచ్ఛగా ఆలోచించగల్గి, స్వేచ్ఛగా మాట్లాడగల్గడం అనే లక్షణం– రాజకీయ సత్యాల్ని స్వేచ్ఛగా అన్వేషించి కనుగొనడానికి అనివార్యమైన లక్షణమని గుర్తించాలి. స్వేచ్ఛగా అభిప్రాయ ప్రకటనకు, పౌరుల సమావేశ స్వేచ్ఛకు, చర్చలకు అవకాశం కల్పించని వ్యవస్థ నిరర్థకం. ఒక దేశ పౌరులు తమ సమస్యలపై స్పందించడానికి స్వేచ్ఛ లేని దేశ స్వాతంత్ర్యం అనర్థం, ప్రమాదకరం. బహిరంగ చర్చలు, నిర్ణయాలు ప్రజల రాజకీయ కర్తవ్యమని మరచిపోరాదు."
– సుప్రసిద్ధ అమెరికన్ న్యాయమూర్తి జస్టిస్ లూయీ బ్రాండీస్

"వచ్చే సాధారణ ఎన్నికలను బలంగా ఎదుర్కోవాలంటే, 2024 పోరాటం ఎవరో ఇద్దరు రాజకీయ నాయకుల మధ్య జరిగే పోరుగా కాకుండా దేశంలో ప్రజాస్వామ్యానికీ, నియంతృత్వానికీ మధ్య జరగవలసిన సంకుల సమరంగా అన్ని ప్రతిపక్షాలూ భావించి ఉమ్మడిగా రంగంలోకి దిగేందుకు నడుం కట్టాలి."
– ప్రొఫెసర్ హర్బన్స్ ముఖియా, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం చరిత్రాధ్యాపకులు (27 మార్చ్ 2023)

జస్టిస్ బ్రాండీస్ శతాబ్దం క్రితం చేసిన చరిత్రాత్మక హెచ్చరిక పౌర సమాజాలకు అరమరికలు లేని బహిరంగ చర్చలు నిరంతర రాజకీయ కర్తవ్యంగా కొనసాగవలసిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. దేశ రాజకీయ పాలనా వ్యవస్థను ఒక వైపు నుంచి స్వాతంత్ర్యానంతరం గాడి

రెండో మాట



తప్పిన కాంగ్రెస్ (ఐక్య సంఘటన పాలన మినహా) పాలకులు, మరొకవైపు నుంచి బీజేపీ నడిపిస్తూ వచ్చాయి. రాజ్యాంగ మౌలిక సూత్రాలను తమ ఇష్టానుసారం తారుమారు చేసి, భారత పౌరులకు రాజ్యాంగం హామీపడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అక్షరసత్యంగా అమలు జరగకుండా ఇవి అడ్డుకుంటూనే వచ్చాయి. వ్యక్తిగత ఎజెండాలతో పాలనా పద్ధతుల్ని భ్రష్టు పట్టిస్తూనే వచ్చాయి.

ఇక నేటి బీజేపీ పాలకవర్గం ప్రేమించే ఇజ్రాయెల్‌లో ఒక సరికొత్త పరిణామం తలెత్తింది. ఆ దేశ ప్రధానమంత్రిని ఏ పరిస్థితుల్లోనూ పాలనకు తగదని పదవి నుంచి తొలగించడానికి వీలు లేకుండా ఇజ్రాయెల్ తాజాగా చట్టం చేసింది. దీన్ని 'ఇజ్రాయెలీ రాజ్యాంగ నిర్మాణ వ్యవస్థలోనే సరికొత్త విపత్కర పరిణామం'గా బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూట్‌లో మధ్యప్రాచ్య విధాన నిర్ణయ కేంద్రం డైరెక్టర్ నతన్ సాక్స్ అభివర్ణించాడు. ఇజ్రాయెల్ కొత్త శాసనం ప్రకారం ఆ దేశపు సుప్రీం కోర్టుకు ఇజ్రాయెల్ పాలకవర్గంపైగానీ, దేశ శాసనాలపైగానీ అవసరమైన అదుపాజ్ఞలను జారీ చేసే హక్కు ఉండదు. ఈ తాజా పరిణామం ప్రభావం భారత పాలనా వ్యవస్థకు విస్తరించకుండా ఉండాలని మాత్రమే మనం కోరుకోగలం.

విచ్చలవిడిగా దేశ ఏకైక కుబేర వర్గంగా బలిసినవారి గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన పాదయాత్రలో ప్రస్తావించి, విమర్శిస్తే పాలకులకు అంత 'గుర్రెందు'కు? ఏ మాటకామాటే చెప్పుకోవాలి. కాంగ్రెస్ హయాంలోనూ, వారు ఈ వర్గంతో అంటకాగుతూ వారి దోపిడీ యథేచ్ఛగా సాగడానికి అనుమతించిన వారేనని మరచిపోరాదు! దీనికి భిన్నంగా తన సుదీర్ఘ పాదయాత్రలో కళ్లారా చూసిన ప్రజల కడగండ్ల దృష్ట్యా రూపొందించిన 'నవరత్న' ప్రణాళికను ఆ ప్రజలకు జీవశక్తిగా మలిచారు ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. కోవిడ్ ఒడుదొడుకుల ఫలితంగా రాష్ట్రం తలపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడానికి ఇబ్బందులు ఎదురైనా జగన్ తట్టుకోగల్గడం ప్రశంసనీయ పరిణామంగా భావించాలి. అందుకే వేమన అన్నాడేమో:

"భూమిలోన పుణ్యపురుషులు లేకున్న
జగములేల నిల్చు పాగులు లేక (కుమిలిపోక)"

రాహుల్ ఇవాళ ఇన్ని కబుర్లు చెబుతున్నారుగానీ, జగన్‌కన్నా ముందు ఉన్నత స్థాయికి ఎందుకు దూసుకురాలేక పోయారు? 'అసూయ' అనలేంగానీ, తనపై బనాయించిన అక్రమ కేసుల్ని జగన్ ఎదుర్కొంటూ పదహారు మాసాలకు పైగా జైళ్లలో మగ్గుతున్న ఘడియలలో ఒక్కసారైనా రాహుల్ సానుభూతిని ప్రకటించగలిగాడా? ఇవాళ సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్లను సుప్రీంకోర్టు హెచ్చరికలను సహితం లెక్క చేయకుండా స్వార్థ రాజకీయాలకు బీజేపీ పాలకవర్గం వినియోగిస్తున్న తీరు అభ్యంతరకరమే కాదు, పరమ హాస్యాస్పదం! 'ఉపా' చట్టాన్ని తమ మనుగడకు బీజేపీ పాలకులు 'ఉపాహారం'గా మలుచుకోవడం దారుణ పరిణామం! ప్రస్తుత సుప్రీంకోర్టు చైతన్యంతో నిర్ణయాలు చేస్తూండటం ఒక్కటే జస్టిస్ బ్రాండీస్ సంప్రదాయానికి నేడూ, రేపూ 'శ్రీరామరక్ష'గా భావించాలి! ఇంతకూ మనం కనీసం కోరుకోదగిందల్లా – సుప్రీంకోర్టు అధికారాలను ఇజ్రాయెల్ పార్లమెంట్ తగ్గించినట్టుగా 2024 ఎన్నికలకు ముందే అలాంటి పరిణామం భారత్‌లో రాకూడదనే!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇదేనా వేధింపు?



స్వాతంత్ర్య కాలం నుంచీ అనునిత్యం ముస్లింలను వేధించే భారత్ లాంటి దేశంలో– ఇండియన్ ఆర్మీ, రైల్వేల తర్వాత అత్యధిక భూములు కలిగిన మూడో యజమానిగా వక్ఫ్ బోర్డు ఎందుకుంది?
– ఒమర్ ఘాజీ, రచయిత

కుదరదంటే కుదరదు



ఈ లింగ (జెండర్) చెత్తను ఆపేయాలి. అబ్బాయిలకు, అమ్మాయిలకు పుట్టుకతో ఉన్న లింగాన్ని మార్చలేం. ఇప్పుడు ఇదొక పెద్ద వ్యాపారం అయిపోయింది. ఇంతే నేను చెప్పాల్సింది!
– అనస్తాసియా మారియా లూపిస్, వైద్యురాలు (ఎండీ)

న్యాయం జరగాలి



శిఖర్ ధవన్ విడాకుల పోరాటం గురించిన చాలా అంతరంగికమైన సమాచారం నా దగ్గర ఉంది. కానీ ఇప్పటికైతే నేను చెప్పగలిగేదల్లా ధవన్ దీనిగురించి బహిరంగంగా మాట్లాడటం మంచి విషయం. ఆయన కెరియర్‌ను పూర్తిగా నాశనం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ నేను అనుకోవడం క్రికెట్ యాజమాన్యం ఈ గందరగోళాన్ని ఇప్పుడు అర్థం చేసుకుంటోంది.
– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

మనమే పరిష్కరించుకోవాలి



అమృత్‌పాల్ సింగ్ బ్రిటన్ సమస్య కాదు. అతడు కెనడా సమస్య, అమెరికా సమస్య కూడా కాదు. అతడు ఇండియా సమస్య. అతడి విజయం భారత ప్రభుత్వ వైఫల్యానికి కొలమానం. ఇతరులను నిందించడం మాని, ఆత్మపరిశీలన చేసుకోండి.
– కపిల్ కొమిరెడ్డి, రచయిత

ఉద్వేగ శుభ్రత



మనుషులు సాంఘిక జంతువులు. కోపం మనల్ని వేరు చేస్తుంది. మనల్ని దగ్గరికి తెచ్చేవి ప్రేమ, ఆత్మీయత. ఎలాగైతే మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి భౌతిక శుభ్రతను పాటిస్తామో, అలాగే విధ్వంసకర ఉద్వేగాలను ఎదుర్కోవడానికీ, మనశ్శాంతిని సాధించడానికీ 'ఉద్వేగ శుభ్రత'ను పాటించాలి.
– దలై లామా, బౌద్ధ గురువు

విద్యావంతుల పాలన



దేశాన్ని ఇప్పుడు అత్యున్నత విద్యావంతులు పాలిస్తున్నారు. ప్రధానమంత్రికి 'మొత్తం రాజనీతి శాస్త్రం'లో డిగ్రీ ఉంది. గాంధీజీకి లా డిగ్రీ లేదని కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ చెబుతున్నారు. హోంమంత్రి తన సొంత చరిత్ర రాస్తున్నారు. ఇక మిగిలిన అందరికీ ఏకస్వరంలో అరవడం ఒక్కటే తెలుసు.
– యశ్వంత్ సిన్హా, కేంద్ర మాజీ మంత్రి

ఇది పనికొస్తుంది




అకెడమిక్ పరిశోధన కోసం చాట్‌జీపీటీ వాడకండి. అది అసలు ఉనికిలో కూడా లేని పేపర్లకు తప్పుడు ఉటంకింపులను సృష్టిస్తుంది. దానికి బదులుగా అకెడమిక్స్ కోసం డిజైన్ చేసిన కృత్రిమ మేధ ఆధారిత సెర్చ్ ఇంజిన్ కన్సెన్సస్ వాడండి. దాన్నో ప్రశ్న అడగండి. అది (వాస్తవంగా) ప్రచురితమైన టాప్ 5–10 పేపర్ల సమ్మరీని ఇస్తుంది.
– ముస్తాక్ బిలాల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్‌బాక్స్

ఆదర్శ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

నల్లమల అడవుల్లో చెంచులతో 7 రోజులు గడిపి, వారు 30–35 ఏళ్ల వయసులోనే తనువు చాలించడానికి గల కారణాలను శాసన మండలిలో ప్రస్తావించారు విఠపు బాల సుబ్రహ్మణ్యం. చెంచులకు సరైన పోషకాహారం అందడం లేదనీ, వారి జీవితాలు దుర్భరంగా ఉన్నాయనీ, ప్రభుత్వం ఆదుకోవాలనీ ఆయన శాసనమండలిలో కోరినపుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వెంటనే స్పందించారు. చెంచులకు 'ఫుడ్ బ్యాగ్ కిట్' అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ కిట్ 'బాలసుబ్రహ్మణ్యం కిట్' అని వైఎస్ స్వయంగా ప్రశంసించడం విశేషం.

'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' ఎందరికో ప్రాణం పోస్తున్న తరుణంలో దాని కింద స్త్రీలకు విపరీతంగా గర్భసంచీ తీసివేసే ఆపరేషన్లు జరగడాన్ని గమనించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆరోగ్యశ్రీ నుండి 'హిస్టరెక్టమీ'ని ప్రభుత్వం తొలగించింది. ఆ రోజుల్లో 72,000 సర్క్యులేషన్ కలిగిన 'చదువు' పత్రికకు సంపాదకునిగా పనిచేస్తూ ఉపాధ్యాయుల కోసం, విద్యార్థుల కోసం 64 పుస్తకాలు రాశారు. ఈ పత్రిక సంపాదకునిగానే అందరికీ సుపరిచితులై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసి గెలుపొందిన చరిత్ర ఆయనది. 'ఆల్ ఇండియా సైన్స్ ఆర్గనైజేషన్'కు దక్షిణ భారతదేశపు అధ్యక్షునిగా ఉన్న ఐఏఎస్ ఆఫీసర్ ఎస్ఆర్ శంకరన్‌తో కలసి కార్యదర్శిగా విఠపు బాలసుబ్రహ్మణ్యం పనిచేశారు.



విఠపు బాల సుబ్రహ్మణ్యం

1950 జూన్ 30న నెల్లూరు జిల్లా, చేజెర్ల మండలం, మాముడూరు గ్రామంలో అత్యంత నిరుపేద కుటుంబంలో బాల సుబ్రహ్మణ్యం జన్మించారు. తెలుగు భాషపై మక్కువతో డిగ్రీ తెలుగులో చేశారు. '2ఏ విద్వాన్' (1971), ఎంఏ తెలుగు (1979) లను తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో అభ్యసించారు. ప్రొద్దుటూరులో చదువుకుంటున్నప్పుడు వీరి క్లాస్‌మేట్ అయిన పద్మినిని ప్రేమ వివాహం చేసుకున్నారు. 1977లో 'ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్' (యూటీఎఫ్)లో చేరారు. ఉపాధ్యాయులకు బదిలీల్లో రాజకీయ జోక్యం విపరీతంగా ఉన్న కాలంలో బదిలీలకు కౌన్సిలింగ్ కావాలని పోరాటం చేశారు. ఇటువంటి పోరాటాలే ఉపాధ్యాయులకు వీరిని దగ్గర చేశాయి. 5 ఏళ్ల సర్వీసు వదులుకుని వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని... 2007లో పట్టభద్రుల స్థానం 'ప్రకాశం– నెల్లూరు' నుండి పోటీ చేసి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఆ తర్వాత 2011, 2017ల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించడం వీరి పనితనానికి నిదర్శనం.

నెల్లూరు జిల్లాలో దూబగుంటలో ప్రారంభమైన మద్యనిషేధ ఉద్యమంలో పాల్గొన్నారు. 1991–93 మధ్యకాలంలో 'జాతీయ సాక్షరతా మిషన్' పిలుపు మేరకు అక్షరాస్యతా ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న ఈ ఆదర్శప్రాయుడైన ఎమ్మెల్సీ తాను ఇక ఎమ్మెల్సీగా పోటీ చేయననీ, మిగిలిన కాలం సామాజిక ఉద్యమాలలో పాల్గొంటాననీ ఆయన అంటున్నారు. ఆయన ప్రజాజీవితం నిండు నూరేళ్లూ గడవాలనేది అందరి ఆకాంక్ష.

– బెజగం వెంకట శ్రీనివాసు; ఏపీ జీజేఎల్ఏ ఆర్గనైజింగ్ సెక్రెటరీ
(విఠపు బాలసుబ్రహ్మణ్యం మార్చి నెలాఖరున ఎమ్మెల్సీగా పదవీ విరమణ సందర్భంగా)

సహజంగా వికసించనిద్దాం!

అభిప్రాయం



శ్రీనివాస్ చింతగుంట

వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే అత్యున్నతమైన ప్రక్రియ విద్య. కానీ ఈనాటి పరుగుల సమాజం విద్యకు సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. అదే... మార్కులు, ర్యాంకులు, వ్యాపారం! ఒక సగటు పదవతరగతి విద్యార్థి ఈ విద్యా సంవత్సరంలో ఎన్ని గంటలు విద్యేతర కార్యక్రమాలలో పాల్గొన్నాడో లెక్కిస్తే... అది కేవలం ఒక్క శాతం కంటే తక్కువే అని చెప్పొచ్చు. ఈ పరిస్థితి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మరీ ఎక్కువ కనిపిస్తోంది. పిల్లలకు ఆటలు లేవు, పాటలు లేవు, తోటి వారితో సరిగా మాటలూ లేవు. బడిలో ఒత్తిడి, ఇంట్లో ఒత్తిడి, చివరకు తన ఒంట్లోనూ ఒత్తిడే. అంతిమంగా విద్యార్థి పరిస్థితి పరిణతి చెందకుండానే పండిపోయిన పండులా తయారవుతోంది. పండ్ల వ్యాపారి తన స్వార్థం కోసం పిందెలను సైతం రసాయనాలతో కృత్రిమంగా పండించినట్లు... పసిమొగ్గలాంటి విద్యార్థి బాల్యాన్ని మితిమీరిన ఒత్తిడితో మగ్గిపోయేలా చేస్తోంది సమాజం.

మానసిక వికాస సిద్ధాంత ప్రకారం వ్యక్తి వికాస దశలలో కౌమార దశ అత్యంత కీలకమైనది. సహజంగానే ఈ దశలో సంభవించే శారీరక, మానసిక మార్పుల మూలంగా ఎన్నో అలజడులు, ఒత్తిళ్లకు లోనవుతూ ఉంటారు పిల్లలు. తమ అభిరుచులు, వైఖరులతో సంబంధం లేకుండా ఇటు కుటుంబం, అటు పాఠశాల నుండి ఎదురయ్యే అదనపు ఒత్తిళ్లను నియంత్రించుకోలేక సతమతమవుతున్నారు. విద్యార్థి అంటే స్వతహాగా కొన్ని అభిరుచులూ, వైఖరులూ, ఆలోచనలూ... అన్నింటికీ మించి భావోద్వేగాలూ కలిగిన ఒక చైతన్య మూర్తి. తనకంటూ కొన్ని ప్రత్యేక సామర్థ్యాలు, అభిరుచులు ఉంటాయి. వాటికనుగుణంగా కొన్ని లక్ష్యాలు ఏర్పరచుకుని ఉంటాడు. కానీ కుటుంబం, పాఠశాల, సమాజం అనే చట్టంలో పడి తన చిట్టి గుండెలోని అభిరుచులనూ, తన బుల్లి మెదడులోని ఆలోచనలనూ అణచివేసుకుంటున్నాడు. ఈ వయసులో ఏర్పడే మానసిక రుగ్మతలతో సమీప భవిష్యత్తులో అనేక శారీరక రోగాలకు లోనవుతున్నాడు. దీనిని సైకాలజీలో 'సైకోసొమేటిక్ డిజార్డర్స్' అంటారు. అంటే మనిషి మానసిక సమస్యలు శారీరక అనారోగ్యానికి



దారితీయడం. ఉదాహరణకు అధిక ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక లక్షణాలు కలిగిన వ్యక్తి క్రమేపి... రక్తపోటు, షుగర్ వ్యాధి, గ్యాస్ ట్రబుల్, అజీర్తి వంటి రోగాలకు లోనవడం. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. విద్యార్థి దశలో కలిగే అనవసరమైన ఒత్తిడి మూలంగా భవిష్యత్తులో మనం ఆరోగ్యకరమైన యువతనూ, ఆనందకరమైన భారతావనినీ ఎలా ఆశించగలం?

ఎన్‌సీఆర్‌బీ (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) నివేదిక ప్రకారం 2016 నుండి ఇప్పటి వరకు దాదాపుగా 14,000 మంది విద్యార్థులు వారి పరీక్షల్లో ఫెయిల్ అయిన కారణంగా ఆత్మహత్యలకు పాల్పడి తనువు చాలించారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలకు ప్రధాన కారణం విద్యార్థి సామర్థ్యాలను సరిగా అర్థం చేసుకోలేకపోవడం, వారి అభిరుచులను, వైఖరులను, ఆలోచనలను పరిగణనలోనికి తీసుకోకపోవడమే. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్నీ, విద్యాశాఖనూ అభినందించక తప్పదు. గత విద్యా సంవత్సరం నుండి 'కెరీర్ గైడెన్స్' అనే చక్కటి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు వారి వారి అభిరుచులు, వైఖరులకు అనుగుణంగా సమాజంలో ఉండే అనేక రకాల కెరీర్లూ, వాటిని చేపట్టడానికి అవసరమైన కోర్సులూ, ఆ కోర్సులు అందుబాటులో ఉండే విద్యాసంస్థలూ... ఇలా అన్ని వివరాలనూ ఒక పోర్టల్ ద్వారా (కెరీర్ పోర్టల్) అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు ప్రభుత్వం తెలియపరుస్తోంది. ప్రభుత్వం ఇంతటి అద్భుతమైన, విద్యార్థి స్నేహపూర్వకమైన ఈ కార్యక్రమాన్ని పాఠశాల, విద్యా ప్రణాళికలలో ఒక కీలకమైన భాగంగా పొందుపరిచి అమలుపరిచినట్లయితే మరిన్ని సత్ఫలితాలు పొందవచ్చు.

తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా ప్రభుత్వాధికారులుగా మనం ఈ పరీక్షా సమయంలో పిల్లలకు ధైర్యాన్నిద్దాం, ఒత్తిడి నియంత్రణ మార్గాలను నిర్దేశిద్దాం. అన్నింటికీ మించి స్వేచ్ఛనిద్దాం. తద్వారా ఆరోగ్యకరమైన భావి భారత పౌరులను స్వాగతిద్దాం.

వ్యాసకర్త ఉపాధ్యాయుడు । 94412 30753

కర్మఫలం

మహా భారతం అనుశాసనిక పర్వం ప్రథమాశ్వాసంలో ఒక కథ ఉంది. ఆ కథ పేరు గౌతమీ లుబ్ధక మృత్యు కాల సంవాదం. కథలో పాత్రలు గౌతమి అనే పేరు గల ఒక స్త్రీ, ఒక కిరాతుడు, ఒక సర్పము, మృత్యు దేవత, యముడు.

గౌతమి అన్న ఆమె కొడుకు పాము కాటుకు చనిపోయాడు. ఒక కిరాతుడు ఆ పామును కట్టి తెచ్చి దానిని గౌతమి ముందు పడవేసి, "దీనిని చంపుతాను, అనుజ్ఞ ఇమ్మ"ని అడిగాడు.

పాముని చంపటానికి ఆమె ఒప్పుకోలేదు. "విధివశాత్తు వచ్చిన కీడు ఇది. ఎవరినీ నిందించే పని లేదు. అదీ గాక, ఈ పాముని చంపితే నా కొడుకు బ్రతుకుతాడా? కాబట్టి పామును విడిచిపెట్టు" అన్నది.

"అలా కాదు, ఈ పామును ఎట్లయినా చంపుతాను" అని వాడు వాదనకు దిగాడు.

అప్పుడు పాము, "నేనేమి తప్పు చేశాను? మృత్యువు నాతో ఈ బాలుణ్ణి కరవమన్నది. అందువల్ల నేను కరిచాను" అన్నది.



జ్యోతిర్మయం

ఇంతలో మృత్యువు వచ్చి అన్నది, "ఇందులో నేను చేసిన తప్పు ఏమీ లేదు. యముడు ఈ బాలుని చంపమని ఆజ్ఞాపించినాడు. అందువల్ల చంపినాను" అని.

అప్పుడు దోషమంతా యముని మీద పడ్డది. దోష నివారణకు, ధర్మ సంశయ నివృత్తికి యముడు అక్కడకు వచ్చి అన్నాడు, "ఈ బాలుని మృతికి పాము గానీ, మృత్యువు గానీ, నేను గానీ కారణం గాము. ఇతడు ఎలాంటి కర్మ చేసి ఉన్నాడో, ఆ కర్మకు అనుగుణమైన ఫలం పొందాడు. పాము కరచి చావవలసిన కర్మ చేశాడు కాబట్టి, పాము కరచి చనిపోయాడు. కొడుకు అట్లా చనిపోతే, దుఃఖించవలసిన కర్మ గౌతమి చేసింది" అని.

విశ్వనాథ సత్యనారాయణ 'సాహిత్య సురభి' అనే తమ గ్రంథంలో ఈ కథ గురించి గొప్పగా వ్యాఖ్యానిస్తూ, ఈ కథ కర్మ సిద్ధాంతాన్ని బోధిస్తున్నదని చెప్పారు. మృత్యువు నిత్యం. అది జీవులు చేసికొన్న కర్మ మీద ఆధారపడి ఉంది. ఇంకొక హేతువు చేత ఈ ప్రపంచకంలో జరిగే కార్యాలకు సమాధానం చెప్పటం సాధ్యం కాదు. అందుచేత మనుష్యుడు శాంతచిత్తుడై ఉండాలనీ, శమ దమాది వైరాగ్య సంపత్తి కలిగి ఉండాలనీ అన్నారు.
– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.సప్తమి రా.8.40 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** మృగశిర రా.7.11 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** తె.4.17 నుండి 6.02 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.25 నుండి 9.15 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.41 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.48 నుండి 11.30 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.02, **సూర్యాస్తమయం:** 6.07.

సర్వశక్తి స్వరూపిణి జగన్మాత

- విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి


మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర

విజయవాడ కల్చరల్: సర్వశక్తి స్వరూపిణి జగన్మాత అని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. గుడిపాటి సీతారాం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్ ఫిలిమ్ చాంబర్ హాల్‌లో సోమవారం శ్రీ మహాలక్ష్మి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ వేదాలు భారతీయ సంస్కృతిలో భాగమని, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. వేదాలను పరిరక్షించే బ్రాహ్మణులకు విశాఖ శ్రీశారదాపీఠం అండగా ఉంటుందని తెలిపారు. లోక రక్షణ కోసం మంగళవారం నిర్వహించే కోటి రుద్రాక్ష పూజను విజయవంతం చేయాలని కోరారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తదితరులు స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

పారిస్.. యానాం
మూడుముళ్ల బంధం


పారిస్

యానాం నుంచి పారిస్‌కు చాలా దూరం. కానీ.. రెండు ప్రాంతాల మనుషుల మధ్య కాదు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత 1954లో ఫ్రెంచ్ వాళ్లు యానాంను విడిచి వెళ్లినా.. ఇక్కడి వారితో మాత్రం నేటికీ బంధాలను కొనసాగిస్తూనే ఉన్నారు. కాగా, ఇటీవల కాలంలో మూడుముళ్లు.. ఏడడుగులతో పెనవేసుకుని.. కడవరకూ కలిసుంటామని ప్రమాణం చేసుకుంటూ బంధాలను మరింతగా పదిలం చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో 30 మందికి పైగా యానాం యువతీ యువకులు ఫ్రెంచ్ వారిని వివాహం చేసుకున్నారు. ఏటా కనీసం మూడుకు పైగా వివాహాలు ఫ్రెంచ్ పౌరులతో ముడిపడుతున్నాయి. అవి కూడా పెద్దలు కూర్చిన వివాహాలు కావడం.. హిందూ సంప్రదాయం ప్రకారమే జరుగుతుండటం మరో విశేషం.


పారిస్ అమ్మాయి, యానాం అబ్బాయి వివాహవేడుక

- వివాహాలతో పెనవేసుకుంటున్న ఫ్రెంచ్–యానాం బంధం
- మన సంప్రదాయం ప్రకారమే పెళ్లి చేసుకుంటున్న ఫ్రెంచ్ పౌరులు
- 25 దేశాలకు రెడ్ కార్పెట్ వేస్తున్న ఫ్రెంచ్ పాస్‌పోర్ట్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: యానాంకు చెందిన దవులూరు చంద్రశేఖర్.. ఫ్రెంచ్ యువతి షావలోత్ భారతీయ సంప్రదాయం ప్రకారం పెళ్లి పీటలెక్కారు. కాళ్లు కడగటం.. కన్యాదానం చేయడం.. కల్యాణ ఘడియలో వధూవరులు ఒకరి శిరస్సుపై ఒకరు పరస్పరం జీలకర్ర, బెల్లం ఉంచటం.. ఆ తరువాత వధువు మెడలో వరుడు తాళి కట్టడం.. అరుంధతీ నక్షత్ర వీక్షణ.. చివరగా అప్పగింతలు వంటి వివాహ తంతుల్లో ఏ ఒక్కటీ వదలకుండా వివాహ తంతును సంప్రదాయం ప్రకారం జరిపించారు. ఆ తరువాత ఆ దంపతులిద్దరూ యానాం–పారిస్ వివాహ బంధానికి ప్రతీకగా యానాంలోనూ ఈఫిల్ టవర్ నమూనా నిర్మించారు.

30 మందికి పైగా..

ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 30 మందికి పైగా పారిస్ పౌరులను మన సంప్రదాయం ప్రకారమే వివాహమాడారు. వీరిలో మంచాల, బెజవాడ, దవులూరు, చింతా, కామిశెట్టి, సలాది వంటి కుటుంబాలకు చెందిన వారున్నారు. అలాగని.. ఇవన్నీ ప్రేమ వివాహాలే అనుకుంటే పప్పులో కాలేసినట్టే. వీటిలో అధిక శాతం వివాహాలు ఇరుపక్షాల తల్లిదండ్రులు కుదుర్చుకున్నవే. ఇక్కడి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ అంగరంగ వైభవంగా వివాహాలు చేసుకోవడానికే ఫ్రెంచ్ పౌరులు మక్కువ చూపుతున్నారు. పెళ్లికి ముందు జాతకాలు, ఫొటోలు ఇచ్చిపుచ్చుకోవడంతోపాటు ఇరు కుటుంబాల మధ్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏటా మాఘమాసంలో కేంద్రపాలిత ప్రాంతాలైన యానాం, పాండిచ్చేరి, మాహే, కారైకల్ ప్రాంతాలకు చెందిన కనీసం పది జంటలు వివాహ బంధంతో ఒక్కటవుతూ అనుబంధాల్ని పెనవేసుకుంటున్నాయి.

అలనాటి అనుబంధాన్ని కొనసాగిస్తూ..

కాకినాడ–కోనసీమ జిల్లాల నడుమ జాతీయ రహదారిని ఆనుకుని ఉండే యానాం పట్టణం కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి పరిధిలో ఉంది. యానాంను రెండు శతాబ్దాల పాటు ఫ్రెంచ్ వాళ్లు పాలించారు. తమ పాలనకు స్వస్తి పలికి తిరిగి వెళ్లేప్పుడు ఇక్కడి వారికి ఐచ్ఛికంగా ఫ్రెంచ్ పౌరసత్వం ఇచ్చే అవకాశం కల్పించారు. అప్పట్లో సుమారు 4 వేల మంది ఉండగా.. వారిలో 70 మంది ఫ్రెంచి పౌరసత్వం తీసుకున్నారు. ఫ్రెంచ్ పౌరసత్వం అనేది ఐచ్ఛికమని భారత్–పారిస్ మధ్య ఒప్పందం కుదిరింది. దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ ఫ్రెంచి–యానాం మధ్య అనుబంధం చెక్కుచెదరకుండా కొనసాగడం విశేషం. తొలినాళ్లలో 70 మంది ఫ్రెంచ్ పౌరసత్వం తీసుకోగా.. ఆ దేశ పౌరసత్వం ఉన్న సుమారు 100కు పైగా కుటుంబాల వారు ఫ్రాన్స్‌లోనే స్థిరపడి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఫ్రాన్స్‌లో ఉన్నా



ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు వీడకుండా ఏటా రెండు, మూడు పర్యాయాలు వచ్చి వెళుతుంటారు. యానాంలో నివసించిన తమ పూర్వీకుల సమాధులు, వారి స్వీయ అనుభవాలు నిక్షిప్తమై ఉన్న యానాం రోమన్ కేథలిక్ చర్చితోపాటు సమాధులను దర్శించుకుని వెళుతుంటారు. అలా వారి మధ్య కొనసాగుతున్న అనుబంధాన్ని ఇప్పుడు వివాహ బంధంతో ముడివేస్తున్నారు.

జాక్‌పాట్ కొట్టినట్టే..

ఫ్రెంచ్ వారితో వివాహ బంధంతో ఒక్కటైతే వరుడు లేదా వధువు జాక్‌పాట్ కొట్టినట్టే. ఫ్రెంచ్ యువతీ యువకులను వివాహం చేసుకుంటే లభించే ఫ్రెంచ్ పాస్‌పోర్టుతో వీసా లేకుండా ప్రపంచ దేశాలు చుట్టి రావచ్చు. కెనడా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఉత్తర అమెరికా తదితర 25కు పైగా దేశాలకు వీసా లేకుండా స్వేచ్ఛగా వెళ్లిరావచ్చు. పైగా ఫ్రెంచ్ ప్రభుత్వం అమలు చేసే పథకాలను, ప్రయోజనాలను అనుభవిస్తూ హాయిగా జీవనం సాగిస్తున్నారు.

చెక్కుచెదరని అనుబంధం



స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచీ ఫ్రెంచ్ వారితో అనుబంధం కొనసాగుతూనే ఉంది. వారి పాలనకు మెచ్చి యానాం సహా పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంతవాసులు వారితో వివాహ బంధం కోసం అమితాసక్తి చూపుతున్నారు. ఏటా యానాం సహా పాండిచ్చేరి ప్రాంతానికి చెందిన కనీసం 10 మంది ఫ్రెంచ్ వారిని సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకుంటున్నారు.

– సాధనాల బాబు, ఫ్రెంచ్ కాన్సులేట్ సభ్యుడు, యానాం

మూడుముళ్లతో ఒక్కటవుతున్నారు



ఫ్రెంచ్ యువతీ, యువకులను యానాం ప్రాంత వాసులు పెళ్లిళ్లు చేసుకోవడం ద్వారా స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఉన్న ఆత్మీయతను కొనసాగిస్తున్నారు. ఫ్రెంచ్ వారు కూడా మన సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారు. ఫ్రెంచ్ వారు తమ పూర్వీకుల చరిత్రను తెలుసుకునేందుకు, సమాధులను దర్శించుకోవడం కోసం ఏటా ఒకటి, రెండుసార్లు వచ్చి వెళుతున్నారు.

– కనకాల రామదాసు, ప్రముఖ న్యాయవాది, యానాం

ఇంటర్ భౌతికశాస్త్రంలో తప్పుగా వచ్చిన ప్రశ్నకు మార్కులు

అదనంగా 2 మార్కులు కలపనున్న అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సీనియర్ ఇంటర్ భౌతికశాస్త్ర ప్రశ్నపత్రంలో తప్పుగా ఇచ్చిన ఒక ప్రశ్నకు అదనంగా రెండు మార్కులు కలుపుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ఫిజిక్స్ పేపర్–2 ఇంగ్లిష్ మీడియం ప్రశ్నపత్రంలోని సెక్షన్–ఏలో రెండు మార్కులకు సంబంధించి లఘు సమాధాన ప్రశ్నల్లో మూడో ప్రశ్న తప్పుగా రావడంతో గుర్తించిన ఇంటర్మీడియెట్ బోర్డు తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకున్నట్లు ఆర్ఐవో జి.సునీత చెప్పారు. ప్రశ్న తప్పుగా వచ్చిన దృష్ట్యా విద్యార్థులకు నష్టం కలగకుండా దానికి అదనంగా రెండు మార్కులు కలుపుతామని బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిరావు ప్రకటించినట్లు తెలిపారు. కాబట్టి విద్యార్థులు ఆందోళన చెందవద్దని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు


ఆలయం వెలుపల జస్టిస్ గంగారావు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,415 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.86 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గంగారావు దర్శించుకున్నారు.

స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు ప్రజలకు భారమే

- కేంద్ర ప్రభుత్వం షరతులపై సీపీఎం ఖండన

సాక్షి, అమరావతి: స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ద్వారా వినియోగదారులకు తెలియకుండా విద్యుత్ భారాలు మోపాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదనపు లోడు, పీక్ డిమాండ్ పేరిట ప్రజలపై దొడ్డిదారిన విద్యుత్ భారాలు వేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కనెక్టెడ్ లోడ్ కన్నా ఎక్కువ వినియోగిస్తే ఆ మేరకు అదనంగా చార్జీలు వసూలు చేయాలని, డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో విద్యుత్ వినియోగిస్తే 20 శాతం అధికంగా చార్జీలు వసూలు చేయాలని కేంద్రం ఆదేశించిందని తెలిపారు. ఈ మేరకు తీసుకొచ్చిన ఎలక్ట్రిసిటీ (రైట్ ఆఫ్ కన్స్యూమర్) సవరణ రూల్స్–2023 ముసాయిదాపై ఏప్రిల్ 14 లోపు అభిప్రాయాలు చెప్పాలని రాష్ట్రాలను కోరిందని పేర్కొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో రూ.6.18 కోట్లతో సీసీ కెమెరాలు

- నిరంతర విద్యుత్‌కు రూ.65 కోట్లతో సోలార్ ప్యానల్స్
- గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాలు పెంపునకు ఆమోదం
- బీవోజీ సమావేశంలో మంత్రి నాగార్జున వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులాల్లో విద్యార్థుల భద్రత కోసం రూ.6.18 కోట్ల వ్యయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు, గురుకులాల్లో నిరంతర విద్యుత్ సరఫరా కోసం రూ.65.8 కోట్ల వ్యయంతో సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తాడేపల్లిలోని గురుకులాల సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన 71వ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్(బీవోజీ) సమావేశంలో మంత్రి నాగార్జున మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలు సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. గురుకులాల్లో పని చేస్తున్న జూనియర్ లెక్చరర్లు, పీజీటీలు, టీజీటీలు, స్టాఫ్‌నర్స్, హెల్త్ సూపర్‌వైజర్, పీడీ, పీఈటీలు మొత్తం 1,697 మంది ఉన్నారని, వారికి ఒక్కొక్కరికీ వేతనాలను రూ.4,550 నుంచి రూ.8,050 వరకు పెంచేందుకు బోర్డు సమావేశం ఆమోదించినట్టు మంత్రి తెలిపారు. ఈ వేతనాల పెంపుతో సంస్థపై రూ.కోటి భారం పడుతుందన్నారు. గురుకుల విద్యార్థులు దురదృష్టవశాత్తు మరణించిన పక్షంలో సొసైటీ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న మొత్తాలను రెట్టింపు చెయ్యాలన్న ప్రతిపాదనను సమావేశం ఆమోదించిందని మంత్రి చెప్పారు. ఐఐటీ, నీట్, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గురుకుల విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ ద్వారా ఎక్కువ సీట్లు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, డైరెక్టర్ కె.హర్షవర్ధన్, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.పావనమూర్తి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో శాశ్వత మౌలిక సదుపాయాలు

- రూ.32వేల కోట్లు ఖర్చుచేస్తున్న ప్రభుత్వం
- గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దొరబాబు


మాట్లాడుతున్న చైర్మన్ దొరబాబు

సాక్షి, అమరావతి: పేదల కోసం ఇళ్లు నిర్మిస్తున్న వైఎస్సార్, జగనన్న కాలనీల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.32వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని ఏపీ గృహనిర్మాణ సంస్థ చైర్మన్ డి.దొరబాబు తెలిపారు. ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఏపీ గృహనిర్మాణ సంస్థ పాలకమండలి సమావేశం సోమవారం విజయవాడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. దొరబాబు మాట్లాడుతూ వైఎస్సార్, జగనన్న కాలనీల్లో రహదారుల నిర్మాణానికి రూ.10,408 కోట్లు, డ్రైనేజ్‌లకు రూ.5,237 కోట్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ కోసం రూ.798 కోట్లు, మంచినీటి సరఫరాకు రూ.2,980 కోట్లు, విద్యుత్ సరఫరా కోసం రూ.4,560 కోట్లు, ఇంటర్నెట్ సదుపాయానికి రూ.707.48 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే 3,485 కాలనీల్లో విద్యుత్ సరఫరా పనులు పూర్తికాగా, 5,363 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు నిర్మాణం పూర్తయిన 2,37,701 ఇళ్లకు విద్యుత్, 2.31లక్షల ఇళ్లకు మంచినీటి సరఫరా పనులు పూర్తి చేశామన్నారు. 1,127 కాలనీలకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెండు దశల్లో 18.63 లక్షల ఇళ్లను నిర్మిస్తుండగా, వీటిని 2024 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు గృహనిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా తెలిపారు. ఈ మేరకు ఇళ్ల నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. గృహనిర్మాణ సంస్థ జేఎండీ శివప్రసాద్, సీఈ జీవీ ప్రసాద్, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

విజయవాడ డివిజన్‌కు రికార్డు స్థాయిలో రూ.5,244 కోట్ల ఆదాయం


రైళ్లలో సరుకు లోడింగ్ చేస్తున్న కార్మికులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పది రోజులు మిగిలి ఉండగానే రూ.5,244.34 కోట్ల ఆదాయం సమకూరింది. 2018–19లో రూ.5,136.44 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ ఆదాయం రూ.5,300 కోట్లను దాటుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇది గత ఆదాయ రికార్డును అధిగమిస్తుంది. సవరించిన సరుకు వార్షిక లోడింగ్, 33 మిలియన్ టన్నుల సరుకు రవాణ తదితర లక్ష్యాలతో ముందుకు వెళ్లడంతో డివిజన్ వార్షిక ఆదాయం గణనీయంగా పెరిగిందని అధికారులు పేర్కొన్నారు. డివిజన్ అత్యధిక ఆదాయం నమోదు చేయడంలో కృష్ణపట్నం, కాకినాడ పోర్టులు ముఖ్య ఆదాయ వనరులుగా ఉన్నాయి. రికార్డు స్థాయిలో డివిజన్ అత్యధిక ఆదాయం నమోదు చేయడంలో కృషి చేసిన సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబుతో పాటు కమర్షియల్ విభాగం అధికారులను డీఆర్‌ఎం షివేంద్రమోహన్ ప్రత్యేకంగా అభినందించారు.

44 కిలోల బంగారం.. రూ.14.5 కోట్ల విలువైన ఫారిన్ సిగరెట్ల సీజ్

- కస్టమ్స్ చరిత్రలోనే అత్యధికం
- విశాఖపట్నం కస్టమ్స్ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్

తిరుపతి రూరల్(తిరుపతి జిల్లా): బంగారం, ఫారిన్ సిగరెట్ల స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపుతున్నట్లు విశాఖపట్నం కస్టమ్స్ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ కె.ఇంజనీరు తెలిపారు. కస్టమ్స్ విభాగం చరిత్రలోనే అత్యధికంగా ఈ ఏడాదిలో 44 కిలోల బంగారం, 11.5 కోట్ల ఫారిన్ సిగరెట్లను సీజ్ చేసినట్టు చెప్పారు. తిరుపతిలోని సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కస్టమ్స్ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల దాడులు నిర్వహించినట్టు తెలిపారు. అందులో రూ.23.60 కోట్లు విలువ చేసే 44 కిలోల బంగారాన్ని సీజ్ చేసినట్టు చెప్పారు. మయన్మార్ నుంచి అక్రమంగా దేశంలోకి వస్తున్న నాణ్యతలేని తక్కువ ధరలో లభించే దాదాపు 11.5 కోట్ల ఫారిన్ బ్రాండ్ సిగరెట్లనూ సీజ్ చేశామని, వీటి విలువ రూ.14.5 కోట్లు ఉంటుందని, 13 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

ఏకకాలంలో 13.5 కిలోల బంగారం సీజ్

చెన్నై నుంచి కిలోలకొద్దీ బంగారం స్మగ్లింగ్ జరుగుతున్నట్లు గుర్తించి ఫిబ్రవరిలో 40 మంది కస్టమ్స్ అధికారులు సమన్వయంతో సూళ్లూరుపేట, తడ, విజయవాడ, గొల్లపల్లి టోల్‌ప్లాజా ఏరియాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి 13.5 కిలోల బంగారాన్ని సీజ్ చేశామని, దీని విలువ రూ.7.7 కోట్లు ఉంటుందని కె.ఇంజనీరు వెల్లడించారు. నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వీల్స్ ఇండియాలో 261 మందికి ఉద్యోగాలు

- విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్
- హాజరైన 335 మంది చివరి సంవత్సరం విద్యార్థులు
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్


నియామక పత్రాలు అందుకున్న పాలిటెక్నిక్ విద్యార్థులతో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ విద్యార్థులకు తక్షణం ఉపాధి చూపాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా చేపడుతున్న ప్రత్యేక జాబ్ మేళాలు మంచి ఫలితాలిస్తున్నాయని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి వీల్స్ ఇండియా సంస్థలో ఉద్యోగాలు పొందిన 261 మంది విద్యార్థులకు సోమవారం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగరాణి మాట్లాడుతూ పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారెవ్వరూ నిరుద్యోగులుగా మిగలరాదన్న సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సాంకేతిక విద్యా శాఖలో ఉపాధి కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్టు తెలిపారు. మూడు దశల్లో విద్యార్థులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కోసం కళాశాల యూనిట్‌గా తొలి దశ, క్లస్టర్ స్థాయిలో మలి దశ, రాష్ట్ర స్థాయిలో తుది దశ విభాగాలు పని చేస్తున్నాయన్నారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మొత్తం 335 మంది చివరి సంవత్సరం విద్యార్థులు హాజరు కాగా, 261 మంది రూ. 2.32 లక్షల వేతనంతో ఎంపికయినట్టు తెలిపారు. వీల్స్ ఇండియాతో పాటు ప్రతిష్టాత్మక టాటా ప్రాజెక్ట్స్‌కు మరో 11 మంది ఎంపికయ్యారు.

హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియాలో 19 మందికి అవకాశం

మరోవైపు హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియాలో 19 మందికి అవకాశం లభించింది. ఉత్తీర్ణత సాధించిన డిప్లొమా విద్యార్థులు ఈ సంస్థలో టెక్నీషియన్ అప్రెంటీస్‌లుగా ఎంపికయ్యారు. ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఇటీవల సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన జాబ్ మేళాలో ఈ ఎంపికలు జరిగాయి.

ఏఎన్‌యూతో ఏపీ ప్రెస్ అకాడమీ ఎంఓయూ

- ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిజం డిప్లొమా కోర్సులు

ఏఎన్‌యూ/మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మధ్య ఎంఓయూ (అవగాహనా ఒప్పందం) కుదిరింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సోమవారం ఎంఓయూ పత్రాలను ఏఎన్‌యూ, ప్రెస్ అకాడమీ ప్రతినిధులు మార్చుకున్నారు. ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పలు అంశాలపై ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్‌తో చర్చించారు. ప్రెస్ అకాడమీ సెక్రటరీ ఎం.బాలగంగాధర్ తిలక్, నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.కరుణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఎంఓయూలో భాగంగా ఏపీ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏఎన్‌యూలో జర్నలిజం డిప్లొమా కోర్సులు నిర్వహిస్తారు. జర్నలిజం డిప్లొమా కోర్సుల ప్రవేశాలు, తరగతులు, పరీక్షల నిర్వహణ, సర్టిఫికెట్ అందజేత వంటి చర్యలను ఏఎన్‌యూ సహకారంతో ప్రెస్ అకాడమీ చేపడుతుంది. పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయకుమార్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత, ఐఎస్‌సీ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా..

కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే విరూపాక్షప్ప అరెస్ట్



తుమకూరు: కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్(కేఎస్‌డీఎల్)కు సంబంధించిన లంచం కేసులో బీజేపీ ఎమ్మెల్యే ఎం.విరూపాక్షప్పను లోకాయుక్త పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అంతకుముందు, ఆయన పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది. తుమకూరు నుంచి బెంగళూరు వస్తుండగా మార్గమధ్యంలోనే విరూపాక్షను అదుపులోకి తీసుకున్నట్లు లోకాయుక్త ఐజీ తెలిపారు. విరూపాక్ష కుమారుడు ప్రశాంత్ మార్చి 2న ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.40 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. విరూపాక్ష నివాసంపై జరిపిన దాడుల్లో మరో రూ.8.23 కోట్లు దొరికాయి. అనంతరం కోర్టు ప్రభుత్వ రంగ కేఎస్‌డీఎల్‌కు చైర్మన్‌గా కూడా ఉన్న విరూపాక్షకు బెయిలిచ్చింది. అయితే, ప్రధాన ముద్దాయిగా ఉన్న విరూపాక్షప్ప కేసు విచారణలో సహకరించడం లేదంటూ లోకాయుక్త పిటిషన్ వేయగా కోర్టు బెయిల్‌ను రద్దు చేసింది. అసెంబ్లీ ఎన్నికల వేళ చోటుచేసుకున్న ఈ పరిణామం బీజేపీకి ఇబ్బందికరంగా మారింది.

ఆడ చీతా సాషా మృతి



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో నమీబియా నుంచి తీసుకొచ్చిన చీతాల్లో ఒకటి సోమవారం మృతి చెందింది. ఐదున్నరేళ్ల వయసున్న సాషా అనే ఆడ చీతా మరణించినట్లు అధికారులు వెల్లడించారు. జనవరిలో అది అనారోగ్యం బారినపడింది. రాష్ట్ర వైద్య బృందానికి తోడు నమీబియా డాక్టర్లనూ రప్పించారు. అది డీహైడ్రేషన్‌తోపాటు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. కోలుకున్నట్టే కన్పించినా సోమవారం హఠాత్తుగా మరణించింది.

చీతాల్లో కిడ్నీ వ్యాధులు మామూలే

సాషాతో సహా మొత్తం 8 చీతాలను గత సెప్టెంబర్‌లో నమీబియా నుంచి తెప్పించడం తెలిసిందే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీటిని స్వయంగా కునో పార్కులోకి వదిలారు. అక్కడి వాతావరణానికి అవి బాగానే అలవాటుపడ్డాయి. అయితే చీతాల్లో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు తలెత్తడం సాధారణమేనని నిపుణులు చెబుతున్నారు. నమీబియా నుంచి తీసుకొచ్చినప్పటి నుంచే సాషా బలహీనంగా ఉందని అటవీ శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. అన్ని ప్రయత్నాలూ చేశామని, అయినా కాపాడలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

సంస్కరణం

చట్టంపై ఉక్కుపాదం.. ప్రభుత్వంపై నిరసన గళం
ఇజ్రాయెల్ న్యాయవ్యవస్థలో భారీ మార్పులు
ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా సుప్రీంకోర్టు!
ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ ప్రతిపాదనలు వ్యతిరేకిస్తున్న ప్రజలు.. నిరసనలు, ఆందోళనలు ఉధృతం
పదవి కాపాడుకోవడానికే నెతన్యాహూ డ్రామాలంటున్న ప్రత్యర్థులు

నిరసనలు, ఆందోళనలు, సమ్మెలతో గత మూడు నెలలుగా ఇజ్రాయెల్ అట్టుడికిపోతోంది. దేశవ్యాప్తంగా వేలాది మంది జనం నిత్యం వీధుల్లోకి వస్తున్నారు. బెంజమిన్ నెతన్యాహూ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరుబాట పట్టారు. కార్మికులు సమ్మె ప్రారంభించారు. న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడమే ఇందుకు కారణం. ఇవి గొప్ప సంస్కరణలని నెతన్యాహూ అనుకూల వర్గాలు ఊదరగొడుతున్నప్పటికీ ప్రజలు విశ్వసించడం లేదు. న్యాయ వ్యవస్థలో ప్రభుత్వం తలపెట్టిన మార్పులు దేశ ప్రజాస్వామ్య పునాదులను కదిలిస్తాయని, తాము హక్కులు కోల్పోతామని వారు ఆరోపిస్తున్నారు. మార్పులకు వ్యతిరేకంగా గళమెత్తిన ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోయావ్ గల్లాంట్‌ను ఆదివారం హఠాత్తుగా పదవి నుంచి తొలగించడం మరింత అగ్గి రాజేస్తోంది. నెతన్యాహూ సర్కారు నియంతృత్వ ధోరణిపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ న్యాయ వ్యవస్థలో ప్రభుత్వం తలపెట్టిన మార్పులు, వాటిపై ప్రజల భయాందోళన వెనుక ఉన్న కారణాలు ఏమిటో తెలుసుకుందాం..

– సాక్షి, నేషనల్ డెస్క్



న్యాయవ్యవస్థలో మార్పులను వ్యతిరేకిస్తూ జెరూసలేంలో ప్రజల ఆందోళన

ఏమిటీ సంస్కరణలు

- 1948లో ఆవిర్భవించిన ఇజ్రాయెల్‌లో లిఖిత రాజ్యాంగం లేదు.
- నోటిమాటగా కొన్ని రాజ్యాంగ ప్రాథమిక చట్టాలు అమలవుతూ వస్తున్నాయి. ఈ చట్టాల ప్రకారం ఇజ్రాయెల్‌లో సుప్రీంకోర్టే శక్తివంతం.
- ఇజ్రాయెల్ పార్లమెంట్ అయిన 'నెస్సెట్'పై నియంత్రణ అధికారం సుప్రీంకోర్టుకే ఉంది.
- నెతన్యాహూ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కొత్త సంస్కరణల ప్రకారం మొత్తం న్యాయ వ్యవస్థపై పార్లమెంట్‌కే అధికారాలు ఉంటాయి. అంటే అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలదే అసలు పెత్తనం.
- న్యాయమూర్తులను ఎలా నియమించాలి? ఎలాంటి చట్టాలు తీసుకురావాలి? అనేది పార్లమెంటే నిర్ణయిస్తుంది. అంతేకాదు సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాలల్లో మార్పులు చేసే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.
- ఇజ్రాయెల్ జ్యుడీషియరీలో ఇలాంటి భారీ మార్పులను ప్రతిపాదిస్తుండడం ఇదే మొదటిసారి.
- సుప్రీంకోర్టు అనేది ఇజ్రాయెల్ ప్రజలకు సంబంధం లేని గ్రూప్‌గా మారిపోయిందని నెతన్యాహూ మద్దతుదారులు వాదిస్తున్నారు. న్యాయస్థానం పరిధి మీరి వ్యవహరిస్తోందని, సంబంధం లేని వ్యవహారాల్లో తలదూరుస్తోందని విమర్శిస్తున్నారు.
- ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రభుత్వంలో న్యాయస్థానం జోక్యం ఏమిటని వారు మండిపడుతున్నారు.
- అమెరికా లాంటి దేశాల్లో జడ్జీల నియామక వ్యవస్థను రాజకీయ నాయకులే నియంత్రిస్తారని నెతన్యాహూ గుర్తుచేస్తున్నారు. తద్వారా తన చర్యలను సమర్థించుకుంటున్నారు.
- ఇజ్రాయెల్‌లో జడ్జీలను నియమించే తొమ్మిది మంది సభ్యుల కమిటీలో మెజార్టీ సభ్యులు ప్రభుత్వ ప్రతినిధులే ఉండేలా ఆయన ఒక బిల్లును తీసుకొచ్చారు.
- పార్లమెంట్ చేసిన కొన్ని చట్టాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు గతంలో తీర్పులు వెలువరించింది. అలాంటి చట్టాలను మళ్లీ ఆమోదించే అధికారం పార్లమెంట్‌కు ఉండాలని(ఓవర్‌రైడ్ క్లాజ్) నెతన్యాహూ ప్రతిపాదిస్తున్నారు.
- పదవిలో ఉన్న ప్రధానమంత్రిని కుర్చీ నుంచి దించేయాలంటే మంత్రివర్గంలో మూడింట రెండొంతుల మంది మద్దతు తప్పనిసరిగా ఉండాలన్నది మరో కీలక ప్రతిపాదన.
- శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా లేకపోతేనే ప్రధానమంత్రిని తొలగించాలని, ఇతర కారణాలతో కాదని ఇంకో ప్రతిపాదన చేశారు.

నెతన్యాహూకు ప్రయోజనమేంటి?

- ప్రధానమంత్రి నెతన్యాహూపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. వాటిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఆయనపై మోసం, లంచం తీసుకోవడం, విశ్వాస ఘాతుకానికి పాల్పడడం వంటి ఆరోపణలు ఉన్నాయి.



- తాను ఏ తప్పూ చేయలేదని నెతన్యాహూ చెబుతున్నప్పటికీ ఆయన పదవి నుంచి దిగిపోవాల్సిందేనని ప్రత్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.
- పదవిని కాపాడుకోవడానికే న్యాయ వ్యవస్థలో సంస్కరణల పేరుతో కొత్త డ్రామాకు తెరతీశారని ఆరోపిస్తున్నారు.
- అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్న నెతన్యాహూ సుప్రీంకోర్టుతో ఓ ఒప్పందానికి వచ్చి ప్రధానమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఆయన ప్రభుత్వం తీసుకొనే విధానపరమైన నిర్ణయాల్లో భాగస్వామి కాకూడదు. కానీ, న్యాయ వ్యవస్థలో సంస్కరణలంటూ విధానపరమైన నిర్ణయంతో ఒప్పందాన్ని ఉల్లంఘించినందున ప్రధానిగా ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలంటూ ఇజ్రాయెల్ అటార్నీ జనరల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



ప్రత్యర్థుల అభ్యంతరాలు

జడ్జీలను నియమించే అధికారం నెతన్యాహూ, ఆయన మిత్రుల చేతుల్లో ఉంటే ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు తప్పదని ప్రత్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుకూలంగా పనిచేసే జడ్జీలను నియమించుకొని, అవినీతికి సంబంధించిన కేసుల నుంచి బయటపడి, అధికారంలో సుదీర్ఘ కాలం కొనసాగాలన్నదే నెతన్యాహూ ఎత్తుగడ అని ఆరోపిస్తున్నారు. న్యాయ వ్యవస్థ సర్వ స్వతంత్రంగా పనిచేయాలని, అందులో ఇతరుల పాత్ర ఉండరాదని నెతన్యాహూ గతంలో గట్టిగా వాదించారు. ఇండిపెండెంట్ జ్యుడీషియరీకి మద్దతు పలికారు. ఇప్పుడు స్వప్రయోజనాల కోసం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ప్రత్యర్థులు ఆక్షేపిస్తున్నారు. స్వతంత్ర న్యాయ వ్యవస్థ అంటే హద్దుల్లేని, నియంత్రణ లేని న్యాయ వ్యవస్థ కాదని నెతన్యాహూ తాజాగా వ్యాఖ్యానించడం గమనార్హం.

ప్రజలకు నష్టమే!



ఇజ్రాయెల్ న్యాయ వ్యవస్థ బలహీనపడితే కేవలం ఇజ్రాయెల్ పౌరులకే కాదు, పాలస్తీనా ప్రజలకు సైతం నష్టమేనని నిపుణులు చెబుతున్నారు. ఇజ్రాయెల్ ఆక్రమించుకున్న వెస్ట్‌బ్యాంక్‌లో పెద్ద సంఖ్యలో పాలస్తీనా పౌరులు ఉన్నారు. వారికి రెసిడెన్సీ కార్డులు ఉన్నాయి. హక్కులకు విఘాతం కలిగినప్పుడు, ప్రభుత్వం నుంచి వేధింపులు పెరిగినప్పుడు, ప్రమాదంలో ఉన్నామని భావించినప్పుడు ప్రజలు ఇకపై కోర్టులను ఆశ్రయించలేరని, ఒకవేళ కోర్టుకెళ్లినా న్యాయం జరుగుతుందన్న భరోసా ఉండదని నిపుణులు అంటున్నారు. ప్రభుత్వం చెప్పినట్లే కోర్టులు ఆడాల్సి ఉంటుందని, అవి ప్రజలకు రక్షణ కల్పించలేవని అభిప్రాయపడుతున్నారు. కోర్టులపై రాజకీయ నాయకుల పెత్తనం మొదలైతే ఇజ్రాయెల్‌లోని మైనార్టీల హక్కులకు, జీవితాలకు రక్షణ ఉండదని అంచనా వేస్తున్నారు.

తదుపరి ఏం జరగొచ్చు?

జ్యుడీషియరీలో మార్పుల ప్రతిపాదనలను ప్రభుత్వం పూర్తిగా వెనక్కి తీసుకొనేదాకా పోరాటం ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రజలు తేల్చిచెబుతున్నారు. పోరాటం మరింత ఉధృతం చేస్తామని అంటున్నారు. ప్రజలు తమను ఎన్నుకున్నది చట్టాలు చేయడానికేనని ప్రభుత్వం చెబుతుండడం ఆసక్తికరంగా మారింది. న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు ప్రజామోదం లభించిందని నెతన్యాహూ అనుచరులు పేర్కొంటున్నారు. అయితే జనాందోళనకు తలొగ్గి, సంస్కరణలను నెలపాటు వాయిదా వేస్తున్నట్టు నెతన్యాహూ తాజాగా ప్రకటించారు. మరోవైపు ఈ ఉదంతంతో రాజ్యాంగ సంక్షోభం తలెత్తే ప్రమాదం కనిపిస్తోందని ప్రజాస్వామ్యవాదులు ఆందోళన చెందుతున్నారు. అంతర్గత సంఘర్షణ నెలకొనే ప్రమాదమూ లేకపోలేదంటున్నారు.

సంస్కరణలు నెలపాటు వాయిదా

నిరసనలకు తలొగ్గిన ప్రధాని నెతన్యాహూ

జెరూసలేం: ప్రజాగ్రహానికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తలొగ్గారు. న్యాయ వ్యవస్థలో సంస్కరణల ప్రణాళికను నెల పాటు వాయిదా వేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ''ఇజ్రాయెల్‌ను చీల్చడానికి శత్రువులు ప్రయత్నిస్తున్నారు. వారికి అవకాశం ఇవ్వొద్దు. ఆందోళనలు విరమించండి. హింసకు దూరంగా ఉండండి'' అని ప్రజలకు సూచించారు. పార్లమెంట్ వేసవి సమావేశాలు ఏప్రిల్ 30న పునఃప్రారంభం కానున్నాయి. సంస్కరణలపై బిల్లును వాటిలో ప్రవేశపెట్టాలని నెతన్యాహూ నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. అయితే సంస్కరణలను శాశ్వతంగా పక్కన పెట్టాలని నిరసనకారులు తేల్చిచెప్పారు. అప్పటిదాకా పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. సోమవారం వేలాదిగా పార్లమెంట్ ముట్టడికి ప్రయత్నించారు. సంస్కరణలపై పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించాలన్నదే నెతన్యాహూ ఉద్దేశమని తెలుస్తోంది.

అమెరికా గురుద్వారాలో కాల్పులు.. ఇద్దరికి గాయాలు

న్యూయార్క్: అమెరికాలో శాక్రమెంటోలోని గురుద్వారాలో కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఇది విద్వేష నేరం కాదని భారత సంతతికి చెందిన సార్జంట్ అమర్ గాంధీ స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం గురుద్వారాలో మతపరమైన నగర్ కీర్తన్ జరుగుతుండగా ఆవరణలో ఇద్దరు వ్యక్తులు ఓ విషయమై ఘర్షణ పడ్డారు. వారిలో ఒకరి స్నేహితుడు ఘర్షణ పడుతున్న వ్యక్తిపై తుపాకీతో కాల్చాడు. ఈ కాల్పుల్లో గాయపడిన ఆ వ్యక్తి తిరిగి కాల్పులు జరపగా ప్రత్యర్థి గాయపడ్డాడు. క్షతగాత్రులిద్దరూ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఎలాంటి ప్రాణహాని లేదని సార్జంట్ గాంధీ తెలిపారు. ఇది విద్వేషపూరిత నేరం కాదని, బాధితులు ఒకరికొకరు పరిచయమున్న భారతీయులేనని ఆయన పేర్కొన్నారు. మరో ఘటనలో అర్కన్సాస్‌లోని లిటిల్ రాక్‌లో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా మరో ఐదుగురు గాయాలపాలయ్యారు.

కాల్పుల్లో ముగ్గురు చిన్నారుల మృతి

నాష్‌విల్లే: అమెరికాలోని నాష్‌విల్లేలోని ఓ ప్రెస్బిటేరియన్ పాఠశాలలో సోమవారం దుండగుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులతో జరిగిన కాల్పుల్లో దుండగుడు హతమయ్యాడు.

కరోనా కొత్త కేసులు 1,805

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ మళ్లీ విజృంభిస్తోంది. 24 గంటల వ్యవధిలో కొత్తగా 1,805 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్రం సోమవారం తెలిపింది. అదే సమయంలో, యాక్టివ్ కేసులు 134 రోజుల తర్వాత 10 వేల మార్కు దాటాయంది. రోజువారీ పాజిటివిటీ రేట్ 3.19%, వీక్లీ పాజిటివిటీ రేట్ 1.39 శాతంగా ఉంది. యాక్టివ్ కేసులు 10,300కు పెరిగినట్లు వెల్లడించింది. చండీగఢ్, గుజరాత్, హిమాచల్, యూపీ, కేరళల్లో ఆరుగురు చనిపోయారు.

అట్టుడికిన పార్లమెంటు

'రాహుల్, అదానీ'పై విపక్షాల ఆందోళన ● ఉభయ సభలూ వాయిదా ● నల్ల దుస్తులతో సభ్యుల నిరసన



రాహుల్‌పై అనర్హత వేటును నిరసిస్తూ సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో ఆందోళనల్లో కాంగ్రెస్‌తో పాటు పాల్గొన్న బీఆర్‌ఎస్ తదితర విపక్షాల పార్టీల సభ్యులు

మోదీకి ఎందుకంత భయం?

''ప్రధాని మోదీ జీ! ప్రజల రిటైర్మెంట్ నిధులను అదానీ గ్రూప్‌లో ఎందుకు పెట్టుబడులుగా పెట్టాల్సి వచ్చిందన్న విపక్షాల ప్రశ్నలకు మీ నుంచి సమాధానం లేదు. అదానీ గ్రూప్ అవకతవకలపై విచారణ లేదు. మీకెందుకంత భయం?'' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ''మోదీ–అదానీ బంధం బయటపడ్డాక కూడా ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ, ఈపీఎఫ్‌ఓ పెట్టుబడులన్నింటినీ అదానీ సంస్థల్లో ఎందుకు పెట్టాల్సి వచ్చింది?'' అంటూ సోమవారం ఆయన ట్వీట్ చేశారు.

న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు మొదలుకుని పలు అంశాలపై పార్లమెంటు సోమవారం అట్టుడికిపోయింది. విపక్ష సభ్యుల ఆందోళనలు, డిమాండ్లు, నినాదాలతో ఉభయ సభలూ దద్దరిల్లాయి. పెద్దగా ఎలాంటి కార్యకలాపాలూ చేపట్టకుండానే మరోసారి వాయిదాపడ్డాయి. ఇటు లోక్‌సభ, అటు రాజ్యసభ ఉదయం సమావేశమవుతూనే కాంగ్రెస్, విపక్ష సభ్యులు మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. ప్లకార్డులు చేబూని నినాదాలతో హోరెత్తించారు. అదానీ అవకతవకలపై జేపీసీ దర్యాప్తు కోరుతూ వెల్‌లోకి దూసుకెళ్లారు. లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులు స్పీకర్ కుర్చీపైకి కాగితాలు విసిరారు! సభాధ్యక్షులు ఎంత ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దాంతో ఉభయ సభలూ మధ్యాహ్నం రెండింటి దాకా వాయిదా పడ్డాయి. తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు రాకపోవడంతో మంగళవారానికి వాయిదా పడ్డాయి. రాహుల్‌పై వేటును నిరసిస్తూ కాంగ్రెస్‌తో పాటు విపక్ష సభ్యులంతా నల్ల దుస్తులు ధరించి సభలకు హాజరయ్యారు. అంతకుముందు ఈ అంశంపై వ్యూహరచనకు కాంగ్రెస్ సారథ్యంలో విపక్షాలన్నీ సమావేశమై చర్చించాయి.

ఆర్థిక బిల్లుకు రాజ్యసభ ఆమోదం

ఎలాంటి చర్చలూ చేపట్టకుండానే ఆర్థిక బిల్లు–2023ను, జమ్మూ కశ్మీర్ బడ్జెట్, పలు ఇతర బిల్లులను రాజ్యసభ సోమవారం మూజువాణి ఓటుతో ఆమోదించి లోక్‌సభకు తిప్పి పంపింది. సభలో విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వీటిపై చర్చకు 10 గంటల సమయాన్ని సభ్యులు వినియోగించుకోలేదంటూ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆవేదన వెలిబుచ్చారు. గత వారం లోక్‌సభ కూడా ఈ బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించడం తెలిసిందే.

కాంగ్రెస్‌కు తృణమూల్ బాసట

కొన్నాళ్లుగా కాంగ్రెస్‌తో ఉప్పూనిప్పుగా ఉంటున్న మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సోమవారం ఆ పార్టీకి సంఘీభావం ప్రకటించింది. లోక్‌సభ నుంచి రాహుల్‌ను అనర్హునిగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన వ్యూహరచన భేటీలోనూ, అదానీ ఉదంతంపై జరిగిన నిరసనల్లోనూ పాల్గొంది. తృణమూల్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, శివసేన (యూబీటీ)తో సహా మొత్తం 16 విపక్షాలు వీటిలో పాల్గొన్నాయి. తమ మద్దతు కేవలం రాహుల్ అంశానికే పరిమితమని అనంతరం తృణమూల్ స్పష్టత ఇచ్చింది. ''పార్లమెంటును, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు జరిపే ఆందోళనల్లో కాంగ్రెస్‌తో పాటు అన్ని పార్టీలతోనూ మేం కలిసి సాగుతాం. అదే సమయంలో పలు అంశాలపై కాంగ్రెస్‌తో తమ అభిప్రాయ భేదాల్లో ఏ మార్పూ లేదు'' అని పేర్కొంది. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమికి తృణమూల్ కొంతకాలంగా దూరంగా ఉంటుండటం తెలిసిందే.

బంగ్లా ఖాళీ చేయండి

లోక్‌సభ సభ్యత్వం రద్దయిన నేపథ్యంలో అధికారిక బంగ్లాను ఖాళీ చేయాలంటూ రాహుల్‌గాంధీకి తాఖీదులందాయి. ఎంపీ హోదాలో 12, తుగ్లక్ లేన్‌లో ఆయనకు కేటాయించిన బంగ్లాను ఏప్రిల్ 22కల్లా ఖాళీ చేయాలని లోక్‌సభ హౌజింగ్ కమిటీ పేర్కొంది. అనర్హత వేటు పడ్డ ఎంపీలు నెల లోపు అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుందని సీనియర్ అధికారి ఒకరు గుర్తు చేశారు. బంగ్లాలో మరింతకాలం ఉండాలనుకుంటే కమిటీకి రాహుల్ లేఖ రాయవచ్చన్నారు.

దుస్తులు విప్పించి సోదాలు!

బ్రిటన్లో నల్లజాతి పిల్లలపై పోలీసుల దాష్టీకం

లండన్: బ్రిటన్ పోలీసులు నల్లజాతి చిన్నారుల పట్ల జాతి వివక్షతో వ్యవహరిస్తున్నారని ఓ నివేదిక పేర్కొంది. తరచూ వారినే ఎక్కువగా దుస్తులు విప్పించి సోదాలు చేస్తున్నట్లు వెల్లడించింది. ''2018–2022 మధ్య ఇలా 3 వేల మంది పిల్లలను సోదాలు చేశారు. వీరిలో మూడొంతులు నల్లజాతి పిల్లలే. అంతా చూస్తుండగానే ఎనిమిదేళ్ల పిల్లలను కూడా బట్టలిప్పి తనిఖీలు చేయడం ఘోరం. అమ్మాయిలను తనిఖీ చేసేటప్పుడు పురుష అధికారులు, అబ్బాయిలకైతే మహిళా అధికారులు ఉండటం మరీ శోచనీయం'' అని చిల్డ్రన్స్ కమిషనర్ రాచెల్ డిసౌజా అన్నారు. ''2020లో లండన్‌లోని ఓ స్కూల్‌లో 15 ఏళ్ల నల్లజాతి బాలికను డ్రగ్స్ ఉన్నాయంటూ మహిళా అధికారులు దుస్తులు విప్పి సోదాలు జరిపారు. ఎలాంటి డ్రగ్స్ దొరకలేదు. దీనికి జాతి వివక్షే కారణమని భావిస్తున్నాం'' అని తెలిపారు.

అరుణాచల్ జీ20 సదస్సుకు చైనా డుమ్మా

బీజింగ్/న్యూఢిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో ఆదివారం జరిగిన జీ20 సన్నాహక సదస్సుకు చైనా గైర్హాజరైందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పరిశోధనలు, ఆవిష్కరణల థీమ్‌తో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం జరిపిన ఈ సదస్సుకు చైనా మినహా ఇతర జీ20 సభ్యదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అరుణాచల్ తమదని చైనా వాదిస్తుండటం, దాన్ని భారత్ తిప్పికొడుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ సదస్సుపై అసంతృప్తితోనే చైనా తమ ప్రతినిధులను పంపలేదంటున్నారు. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ దీన్ని ఖండించారు. జరిగిందో తెలుసుకుంటానన్నారు.

భావోద్వేగరహితంగా విచారణ

బిల్కిస్ పిటిషన్ల విచారణపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో కేసులో దోషుల ముందస్తు విడుదల ఇతర కేసుల్లో మాదిరిగా నిబంధనలకు లోబడే జరిగిందా అని సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. సంబంధిత రికార్డులన్నింటినీ ఏప్రిల్ 18న తదుపరి విచారణ సందర్భంగా తమ ముందుంచాలని కేంద్రం, గుజరాత్ ప్రభుత్వాలను ఆదేశించింది. ''హేయమైన ఈ నేరానికి సంబంధించి భావోద్వేగాలతో కాకుండా సమతూకంతో వ్యవహరించాలి. ఈ కేసును చట్టానికి లోబడి విచారించాల్సిన అవసరముంది'' అని న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నల ధర్మాసనం పేర్కొంది.

యడియూరప్ప ఇంటిపై రాళ్ల దాడి

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గిరిజన వర్గాల ఆందోళన ఉద్రిక్తం

శివమొగ్గ/చిక్‌బళ్లాపుర: కర్ణాటక బీజేపీ అగ్ర నేత, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప ఇంటిపై సోమవారం రాళ్ల దాడి జరిగింది. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ఎస్సీ, ఎస్టీల్లో రిజర్వేషన్లను పెంచడంతో పాటు పలు రిజర్వేషన్లను కొన్ని ఉన్నత వర్గాలకు అనుకూలంగా మార్చింది. దీంతో తమకు అన్యాయం జరిగిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంజారాలు, మరికొన్ని గిరిజన వర్గాలు శికారిపురలో ఆందోళన చేశారు. భారీగా ర్యాలీ నిర్వహించి యడియూరప్ప, సీఎం బసవరాజ బొమ్మైలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దిష్టిబొమ్మలను, చీరలను దహనం చేశారు. శివమొగ్గ జిల్లా శికారిపురలోని యడియూరప్ప నివాసంపైకి రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. రిజర్వేషన్లపై రాజకీయాలతో సమాజాన్ని కాంగ్రెస్ విడదీయజూస్తోందని బొమ్మై ఆరోపించారు.

మారనున్న ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్

న్యూఢిల్లీ: నూతన జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ) ప్రకారం 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల సిలబస్‌ను సవరించనున్నట్లు కేంద్రం సోమవారం పేర్కొంది. కొత్త సిలబస్‌తో పుస్తకాలు డిజిటల్ ఫార్మాట్‌లోనూ అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఎన్ఈపీ–2020 ప్రకారం చిన్నారులు ప్రాథమిక దశలో ఐదేళ్లు, సన్నద్ధత, మధ్య దశల్లో మూడేసి ఏళ్లు, సెకండరీ స్టేజీలో నాలుగేళ్లు గడపాల్సి ఉంటుందన్నారు.

గుర్రాల రేసుకు గాడిదను...

రాహుల్‌పై కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి వ్యాఖ్యలు

బీజేపీ కుసంస్కారానికి నిదర్శనం: కాంగ్రెస్ | 'కంచర గాడిద' అసలు రంగు తెరపైకి: ఖేరా



న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీ కేంద్రంగా బీజేపీ, కాంగ్రెస్ విమర్శలు, ప్రతి విమర్శల పర్వం శ్రుతి మించుతోంది. సావర్కర్‌పై రాహుల్ విమర్శలను తప్పుబడుతూ కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి సోమవారం ఆయనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''రాహుల్ స్వయంకృతాపరాధాలకు రామాయణ, మహాభారత వృత్తాంతాలతో ముడి పెడుతూ కాంగ్రెస్ విచిత్ర విన్యాసాలు చేస్తోంది. అసలు సావర్కర్ వంటి మహనీయుల త్యాగాల గురించి రాహుల్‌కు ఏం తెలుసు? కాంగ్రెస్ వాళ్లు ఓ గాడిదను గుర్రాల రేసులో నిలబెడుతున్నారు'' అన్నారు! కేంద్ర మంత్రులు, బీజేపీ నేతల దిగజారుడు వ్యక్తిత్వానికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయంటూ కాంగ్రెస్ దుయ్యబట్టింది. ''బీజేపీ వాళ్లు ఓ గాడిదకు కంచర గాడిదలా రంగులేశారు. దాని అసలు రంగే మిటో ఇప్పుడు బయట పడుతోంది'' అంటూ ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ మీడియా విభాగం చీఫ్ పవన్ ఖేరా కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పురివి దిగజారుడు మాటలంటూ ఆ పార్టీ నేత జైరాం రమేశ్ కూడా విమర్శించారు.

ప్రియాంకది అహంకారం | రాముని వంశంతో మీకు పోలికా: ఠాకూర్

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీది అహంకారమంటూ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు. అందుకే తమ కుటుంబాన్ని రాముని వంశంతో పోల్చుకున్నారంటూ మండిపడ్డారు. ''దేవుడా! దేశానికి చివరికి ఎలాంటి రోజును చూడాల్సిన గతి పట్టింది! దేశ ప్రజాస్వామ్యానికి తాము అతీతులమని నమ్మే ఓ కుటుంబం ఏకంగా రామునితోనే పోల్చుకుంటోంది. ఈ అన్నాచెల్లెళ్ల అహంకారాన్ని దేశమంతా చూస్తోంది'' అన్నారు. ''బ్రిటిష్ వారిపై సావర్కర్ పోరాటానికి స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంటుందంటూ ఇందిరాగాంధీ కొనియాడారు. మనవడేమో ఇలా అవమానించే ప్రయత్నం చేస్తున్నారు'' అని ఎద్దేవా చేశారు.

సావర్కర్‌ను అవమానించొద్దు

లేదంటే కూటమికి బీటలే ● రాహుల్‌కు ఉద్ధవ్ హెచ్చరిక



ముంబై: సావర్కర్‌పై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను మహారాష్ట్రలో కాంగ్రెస్ భాగస్వామ్య పార్టీ శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తీవ్రంగా తప్పుబట్టారు. ''ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్‌తో విపక్షాలన్నీ చేతులు కలుపుతాం. కానీ సావర్కర్ మా దేవుడు. ఆయనపై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా సహించేది లేదు. సావర్కర్‌పై వ్యాఖ్యలను రాహుల్ కట్టిపెట్టకపోతే కాంగ్రెస్‌తో మా బంధానికి బీటలు తప్పవు'' అని హెచ్చరించారు. రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా ఢిల్లీలో కాంగ్రెస్ విందు సమావేశానికి హాజరు కాబోనని ప్రకటించారు. ''నా పేరు సావర్కర్ కాదు, గాంధీ. క్షమాపణలు చెప్పను'' అని రాహుల్ శనివారం పేర్కొనడం తెలిసిందే. సావర్కర్‌పై చాలాకాలంగా ఆయన విమర్శలు చేస్తున్నారు. సావర్కర్‌పై విమర్శలు మానకపోతే అనర్హత వేటు నేపథ్యంలో ప్రజల్లో వచ్చిన సానుభూతినీ రాహుల్ పోగొట్టుకుంటారని పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయంలో ఉద్ధవ్ హెచ్చరించారు.



సోమవారం కోల్‌కతాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగత సత్కారం సందర్భంగా గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ. రాజ్యాంగబద్ధ దేశాధినేతగా దేశం 'విపత్తు' బారిన పడకుండా కాపాడాలంటూ ఈ సందర్భంగా ముర్మును మమత కోరారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, అర్చకులు అమ్మవారి ప్రసాదాలను బహూకరించారు.



నేటి నుంచి క్రీడా పోటీలు

గుడ్లవల్లేరు: జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ ఆధ్వర్యంలో సెంట్రల్ జోన్ పోటీలు మంగళ, బుధ వారాల్లో జరగనున్నాయి. ఇందుకు శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ వేదిక కానుంది.



త్వరలో భక్తజన దర్బార్

ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో భక్తజన దర్బార్‌ను త్వరలో నిర్వహించనున్నట్లు దేవస్థాన పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. పాలక మండలి సమావేశం సోమవారం జరిగింది.



న్యూస్‌రీల్

తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.55.55 లక్షలు



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): శ్రీతిరుపతమ్మవారి ఆలయ హుండీల ద్వారా రూ.55,55,807 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్ తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో జరిగిన లెక్కింపులో పై ఆదాయంతో పాటు విదేశీ నగదు 41 డాలర్లు, బంగారం 109 గ్రాములు, వెండి 710 గ్రాములు వచ్చిందన్నారు. 23 రోజులకు గాను భక్తుల నుంచి కానుకల రూపంలో వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలక వర్గ సభ్యులు, గ్రూప్ టెంపుల్స్ ఈఓ వాసిరెడ్డి భూపాల్, ఆలయ సిబ్బంది, సేవాసమితి వారు పాల్గొన్నారు.

భద్రాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు భద్రాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.ఏ సుదానం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నడుపుతున్న 30 షెడ్యూల్ బస్సులతో పాటు అదనంగా జిల్లాలోని పలు డిపోల నుంచి 90 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. 29, 30వ తేదీల్లో నడిపే ఈ ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరాన్ని బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. భక్తులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. కృష్ణాజిల్లా పామర్రు మండలం పెదమద్దాలికి చెందిన ఎన్‌టీ. రామకృష్ణ కుటుంబం, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కొత్తవలస గాయత్రి కుటుంబం నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు బహూకరించారు.

రేపు పార్థీనియం మొక్కల నివారణ కార్యక్రమం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సామూహిక పార్థీనియం మొక్కల నివారణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు కోరారు. ఈనెల 29వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన పార్థీనియం(వయ్యారి భామ) మొక్కల నిర్మూలన కార్యక్రమంపై కలెక్టరేట్‌లోని పింగళివెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'పార్థీనియం కలుపు మొక్కను నిర్మూలిద్దాం.. ఆరోగ్యాన్ని సంరక్షిద్దాం.. పంటలను పరిరక్షిద్దాం..' అనే నినాదాలతో కూడిన అవగాహన పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ శ్రీవాస్ నుపూర్, డీఆర్వో కె. మోహన్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి జె. సునీత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. నాగమణమ్మ, గ్రామ వార్డు సచివాయల ప్రత్యేక అధికారి కె. అనురాధ, ప్రకృతి వ్యవసాయ అధికారి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యానికి గ్రీన్ లైట్!

గిజాగిజాడుగులా మారుతున్న విజయవాడ రోడ్లు



విజయవాడ బందరు రోడ్డులో వాహనాల రద్దీ

- నగరంలో విపరీతంగా పెరిగిన వ్యక్తిగత వాహనాలు
- ఎక్కడికక్కడ స్తంభించిపోతున్న ట్రాఫిక్
- రోజూ ట్రాఫిక్‌లో ప్రయాణంతో ఆరోగ్య సమస్యలు
- రక్తపోటు అధికమవుతుందంటున్న వైద్యులు
- యాంగ్జయిటీ, నిద్రలేమి సమస్యలూ ఎక్కువే

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో వ్యక్తిగత వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. మధ్యతరగతి వర్గాల ప్రజలు సైతం కార్లు వినియోగిస్తున్నారు. పబ్లిక్ వాహనాల కంటే వ్యక్తిగత వాహనాలనే ఎక్కువగా వాడటంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతోంది. ఆ ట్రాఫిక్‌లో డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండటంతో అనేక ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. రద్దీగా ఉన్న రోడ్లపై డ్రైవింగ్ చేసే వారికి కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. రివ్వున దూసుకుపోయే కుర్రకారు స్పోర్ట్స్‌బైక్‌లు, అటో..ఇటో తెలియకుండా నడిపే సర్వీసు ఆటోలు, వేగంగా దూసుకొచ్చే సిటీ బస్ సర్వీసుల నడుమ డ్రైవింగ్ చేస్తూ తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు.

ఇవే నిదర్శనం..

- నిడమానూరుకు చెందిన ఉద్యోగి గొల్లపూడిలోని కార్యాలయంలో పనిచేస్తుంటాడు. అక్కడి నుంచి కార్యాలయానికి 18 కిలోమీటర్లు దూరం ఉంటుంది. కానీ ఆయన వెళ్లేందుకు 40 నిమిషాలకు పైగా పడుతుంది. ఇలా రోజూ ట్రాఫిక్ లో వెళ్తుండటంతో ఆయన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ లో ఆఫీసుకు వెళ్లిన తర్వాత చాలా సమయం వరకూ పనిపై దృష్టి పెట్టలేకపోతుండటంతో వైద్యులను ఆశ్రయించారు.
- లబ్బీపేటకు చెందిన ఉద్యోగి గన్నవరంలో పనిచేస్తుంటారు. ప్రతిరోజూ తమ కుమార్తెను బెంజిసర్కిల్ వద్ద కళాశాలలో దించి కార్యాలయానికి వెళ్తుంటాడు. ఇలా ప్రతిరోజూ కళాశాలకు, కార్యాలయానికి సమయానికి వెళ్లే క్రమంలో బాగా టెన్షన్‌కు లోనవుతున్నారు. దీంతో తక్కువ వయస్సులోనే హైపర్ టెన్షన్ బారిన పడ్డారు. ఇలా నగరంలోని ట్రాఫిక్‌తో చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారు.

ట్రాఫిక్‌లో డ్రైవింగ్‌తో సమస్యలు..



ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు డ్రైవింగ్ చేయడం ద్వారా కొందరు యాంగ్జయిటీకి గురవుతారు. దీని ఫలితంగా వారిలో చిరాకు పెరిగి రాష్ డ్రైవింగ్ చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ఇది ప్రమాదాలకు కారణమవుతోంది. కొంతమంది నిద్రలేమి, హైపర్‌టెన్షన్ బారినపడుతున్న వారు ఉంటున్నారు. ముఖ్యంగా కాలుష్యం ప్రభావంతో రక్తం చిక్కపడి బ్రెయిన్‌స్ట్రోక్, హార్ట్‌స్ట్రోక్‌కు దారితీయొచ్చు. వెన్నెముక సమస్యలతో బాధపడుతున్న వారు కూడా మా వద్దకు వస్తున్నారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును వినియోగించడం మేలు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి.

– డాక్టర్ డి. అనిల్‌కుమార్, న్యూరాలజిస్ట్, విజయవాడ

వైద్యులు గుర్తించిన సమస్యలివే..

- ట్రాఫిక్‌లో ప్రయాణించే వారు యాంగ్జయిటీకి గురవుతున్నారు. అప్పటికే యాంగ్జయిటీ ఉన్న వారు తీవ్రమైన ఒత్తిళ్లకు గురవుతున్నారు.
- యాంగ్జయిటీకి గురయ్యే వారు కార్యాలయానికి వెళ్లినా పనిపై దృష్టి పెట్టలేకపోతున్నారు.
- నిత్యం ట్రాఫిక్‌లో డ్రైవింగ్ చేసే వారు పొల్యూషన్‌కు రక్తం చిక్కపడి గుండెపోటు, మెదడు పోటు వచ్చే అవకాశం ఉంది.
- నిత్యం ట్రాఫిక్‌లో డ్రైవింగ్ చేసే వారు చిన్న వయస్సులోనే హైపర్‌టెన్షన్ బారిన పడే అవకాశం ఉంది.
- ట్రాఫిక్‌లో ప్రయాణంతో నిద్రలేమి సమస్యలు తలెత్తుతున్నాయి.
- ఎక్కువ సేపు డ్రైవింగ్ చేసే వారిలో స్పైన్ సమస్యలు వస్తున్నాయి.
- ట్రాఫిక్ చిక్కులతో కోపం, ఆవేశం, చిరాకు పెరుగుతోంది.

ఇవి పాటించాలి..

- మనం వెళ్లే ప్రాంతం దగ్గరలో ఉన్నా.. నిర్దేశిత సమయానికి కంటే కొద్దిగా ముందుగానే బయలుదేరాలి. అప్పుడు ట్రాఫిక్ ఉన్నా ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.
- వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించి, పబ్లిక్ వాహనాల్లో ప్రయాణిస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.
- ఎక్కువగా ప్రయాణాలు చేసే వారు యోగా, మెడిటేషన్ చేయాలి.
- కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.

అర్జీ రీ ఓపెన్ అయితే కఠిన చర్యలు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- స్పందనలో 107 అర్జీల స్వీకరణ



అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో జేసీ శ్రీవాస్ నుపూర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ ఎస్ నుపూర్ అజయ్, డీఆర్ఓ కె. మోహన్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ రీ ఓపెన్ కాకూడదన్నారు. అలా కాని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఎక్కువ అర్జీలు నమోదు అవుతున్నాయని వీటిపై డివిజన్ మండల సచివాలయ స్థాయిలో వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోనే సమస్యలకు పరిష్కారం చూపడంపై అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. స్థానికంగానే సమస్యలకు పరిష్కరిస్తే జిల్లా స్థాయిలో అర్జీలను సమర్పించే అవకాశం ఉండదన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందనతో పాటు ఆఫ్ లైన్, ఆన్ లైన్లోను అర్జీలు నమోదు అవుతాయని వీటిపై కూడా సంబంధిత శాఖల అధికారులుదృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. 1902 కాల్ సెంటర్, స్పందన మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా అర్జీలు నమోదు అవుతాయని అధికారులు ప్రతి రోజు ఆయా శాఖలకు సంబంధించి అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించుకుని పెండింగ్ లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. స్పందనలో మొత్తం 107 అర్జీలను ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు. జిల్లాలోని డివిజనల్ అధికారులు ఆయా మండలాల ఎండీఓలు, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్‌లతో వర్చువల్‌గా మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. డీఎస్ఓ కోమలి పద్మ, ఐసీడీఎస్ పీడీ జీ ఉమాదేవి, డీఎంహెచ్‌వో మాచర్ల సుహాసిని, డ్వామా పీడీ జె. సునీత, పశుసంవర్ధకశాఖ జేడీ కె. విద్యాసాగర్, డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాసరావు, డీసీఓ సీహెచ్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు ద్వారావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన వితరణ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ద్వారావతి ఫౌండేషన్ చైర్మన్ జి. సంతోషకుమార్‌సాయి, గౌరవాధ్యక్షుడు చలువాది మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు లక్షణాలపై అవగాహన కల్పిద్దాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుండెపోటు లక్షణాలపై ప్రజలలో అవగాహన కల్పించి మరణాలను నివారించడంలో జిల్లా అధికారులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. గుండెపోటు మరణాలను నివారించేందుకు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్సపై సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రముఖ వైద్య నిపుణుడు డా. పి.విజయశేఖర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలపై ప్రజలలో అవగాహన కల్పించి ప్రథమ చికిత్స ద్వారా మరణాలను నివారించవచ్చన్నారు. గుండెపోటుకు గురైన 10 నిమిషాలలోపు ప్రథమ చికిత్స అందించి, తక్షణమే వైద్య సహాయం అందించగలిగితే ప్రాణాలు నిలుస్తాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులకు గుండెపోటు ముందస్తు లక్షణాలను అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇందులో అధికారుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు.

ప్రథమ చికిత్సే ఆయుధం..

వైద్య నిపుణులు పోలా విజయశేఖర్ మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వారి ప్రాణాలను కాపాడటంలో ప్రథమ చికిత్స ఏకైక ఆయుధం అన్నారు. గుండెపోటు లక్షణాలు, ప్రథమ చికిత్సపై డా. విజయశేఖర్ ప్రదర్శన (డెమో)ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. జేసీ ఎస్. నుపూర్ అజయ్, డీఆర్ఓ కె. మోహన్ కుమార్ పాల్గొన్నారు.

కార్తికేయుని హుండీ ఆదాయం రూ. 91.09 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు రూ. 91,09,398 వచ్చాయి. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు వివరాలు చెబుతూ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో కానుకలు సోమవారం లెక్కించినట్లు తెలిపారు. నగదు రూపంలో రూ. 83,54,850, కాయిన్స్ రూపంలో రూ. 3,39,016, అన్నదానం హుండీలో రూ.4,15,532 మొత్తం రూ. 91,09,398 వచ్చినట్లు తెలిపారు. అలాగే బంగారం 118 గ్రాములు, వెండి 3 కిలోల 138 గ్రాములు లభించాయన్నారు. 92 రోజులకు గాను ఈ కానుకలుగా ఆదాయం వచ్చినట్లు ఆలయ ఏసీ వివరించారు.

29న పెదకళ్లేపల్లిలో..

పెదకళ్లేపల్లి శ్రీదుర్గానాగేశ్వరస్వామివారి కానుకల హుండీ ఆదాయం ఈనెల 29వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.

ఈపీఎఫ్ సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే..

గన్నవరం రూరల్: ఈపీఎఫ్ సేవలన్నీ ఆన్‌లైన్‌లో లభిస్తాయని, ఉద్యోగులు, పెన్షనర్‌లు గమనించాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. సోమవారం మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో 'మీ సమీపంలో భవిష్య నిధి' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆన్‌లైన్‌లో ప్రావిడెంట్ ఫండ్ నిల్వలను చూసుకోవచ్చని, అధిక వేతనం ఉద్యోగులు పెన్షన్ పొందేందుకు ఏ విధంగా అర్హులు అవుతారో వివరించారు. వైద్య, దంత కళాశాలల ఉద్యోగులు పాల్గొన్న సభలో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శేఖర్ శర్మ ఉద్యోగుల సందేహాలకు సమాధానం చెప్పారు. మెడికల్ కళాశాల ఏవోలు టీవీ సుబ్బారావు, కె.నవీన్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

టోల్ గేట్ నిర్వహణ టెండరు ఖరారు



సీల్డ్ టెండర్ బాక్స్‌ను తెరుస్తున్న ఆలయ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం టోల్‌గేట్ టెండర్ రూ. 1.58,99,999కు వీఎల్‌డీ ఏజెన్సీ అండ్ కాంట్రాక్టర్స్ దక్కించుకున్నారు. ఈ ఏడాది టెండర్ ప్రక్రియలో దుర్గగుడి ఘాట్‌రోడ్డు, కనకదుర్గ నగర్ టోల్‌గేట్ నిర్వహణకు దేవస్థానం టెండర్లు ఆహ్వానించింది. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఆన్‌లైన్ విధానం ద్వారా దేవస్థానం టెండర్లు ఆహ్వానించింది. అయితే బహిరంగ వేలంలో ముగ్గురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. దేవస్థానం ఏడాదికి రూ. 1.45 కోట్లుగా నిర్ణయించి పాటను ప్రారంభించింది. రూ. 10 లక్షలు డిపాజిట్ చెల్లించిన కాంట్రాక్టర్లు దేవస్థానం నిర్ణయించిన మొత్తం అధికంగా ఉందని పాటలో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో దేవస్థానం పాటను రూ. 1.35 కోట్లుగా నిర్ణయించి పాటను తిరిగి ప్రారంభించింది. దీంతో సాయి అశ్విత పాటను పెంచుతూ రూ. 1.36 కోట్లుగా పేర్కొన్నారు. అయితే మిగిలిన కాంట్రాక్టర్లు బహిరంగం వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో దేవస్థానం సీల్డ్ టెండర్లు తెరవగా, వీఎల్‌డీ ఏజెన్సీ అండ్ కాంట్రాక్టర్స్ పేరిట విజయలక్ష్మీదేవి రూ. 1,58,99,999లకు టెండరు దాఖలు చేశారు. దీంతో టెండర్ వీఎల్‌డీ ఏజెన్సీకి దక్కిందని ప్రకటించారు. దేవస్థాన ఈవో, కమిషనర్ ఆమోదం పొందిన తర్వాతే టెండరు కేటాయిస్తామని ఆలయ అధికారులు పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియను ఏఈవో వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ అమృతరావు, లక్ష్మీ ప్రసన్న, శ్రీనివాసరావు, బానోత్ నాగేశ్వరరావు, దేవదాయ శాఖ తరఫున ఈవో రావూరి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

పుష్పార్చన.. పులకింత

దుర్గమ్మకు మల్లెలు, జాజులు, మరువంతో అర్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆరో రోజైన సోమవారం అమ్మవారికి కాగడా మల్లెలు, జాజులు, మరువంతో అర్చన నిర్వహించారు. విశేష పుష్పార్చన నిమిత్తం తీసుకువచ్చిన పుష్పాలతో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబలు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పుష్పార్చన వేదిక వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి నిర్వహించిన విశేష పుష్పార్చనలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పుష్పార్చనను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం పుష్పాలను భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేశారు. కాగా మంగళవారం అమ్మవారికి ఎర్ర తామరలు, ఎర్ర గన్నేరు పూలు, సన్న జాజులతో అర్చన జరుగుతుంది.

పేదలకు చేరువగా కార్పొరేట్ వైద్యం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- జిల్లాకు కేటాయించిన 7 నూతన 104 వాహనాలు ప్రారంభం



104 వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే మహోన్నత ఆశయంతో 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో గడప వద్దకే వైద్యసేవలను అందిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. జిల్లాకు కేటాయించిన ఏడు నూతన 104 వాహనాలను కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎన్నో విప్లవాత్మకమైన కార్యక్రమాలను ప్రవేశపెట్టారన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గ్రామాలలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని గుర్తించి మెరుగైన వైద్య సహాయం అందిస్తామన్నారు. అనారోగ్య కారణంగా ఆస్పత్రులలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన రోగులను పరీక్షించి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని ఎప్పటికప్పుడు తగు సూచనలు అందించేందుకు 104 వాహనం వైద్యబృందం కృషి చేస్తుందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా తొమ్మిది రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరాన్ని బట్టి మందులను అందజేస్తున్నామన్నారు. కిశోర బాలికలలో రక్తహీనత ఉన్నవారిని గుర్తించి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రజారోగ్యానికి భరోసా..

ఏపీ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి భరోసా కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం. సుహాసిని, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు టి. శ్రీకాంత్, ఎం. శివరామకృష్ణ, కె. గీతాంజలిదేవి, అరబిందో ఫార్మా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే ఆసరా

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ఓసీ కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడవ విడత మంజూరయిన రుణ మాఫీ చెక్కులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలానే జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరాతో అక్కాచెల్లెమ్మలకు జగనన్న అండగా నిలిచారని చెప్పారు. ప్రజా సంకల్పయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు గతంలో రెండు విడతలుగా రుణమాఫీ నగదు అందించామని, మూడో విడత సైతం పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళల జీవన ప్రమాణాలు మార్చాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. కుల, మతాలు, పార్టీలకతీతంగా డ్వాక్రా మహిళలందరికీ ఆసరా పథకం ద్వారా రుణ మాఫీ చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా మహిళల బకాయిలు రద్దు చేస్తామని చెప్పి మోసం చేశాడని గుర్తుచేశారు. టీడీపీ నేతలు నిజమైన సైకోలుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.


కంచికచర్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

జిల్లాలో రూ.850 కోట్లు రుణమాఫీ...

మహిళలను మహారాణులుగా చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఆదుకుంటున్నారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మండలంలో 18 వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.40 కోట్లు రుణమాఫీ అయిందని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు ఆసరా కింద రూ.850 కోట్ల రుణమాఫీ చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, సర్పంచ్ వేల్పుల సునీత, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ వి.రాజకుమారి, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఏపీఎం కోట భాస్కరరావు, మండల సమాఖ్య సంఘ అధ్యక్షులు కంచర్ల పద్మావతి, డ్వాక్రా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపుల కేసులో నలుగురు అరెస్టు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆటోలో ఎక్కిన ఓ వ్యక్తిని బెదిరించి డబ్బులు కాజేసిన నలుగురు యువకులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వాంబేకాలనీకి చెందిన హడారి దుర్గారావు బావాజీపేటలో బైండింగ్ వర్క్స్ చేస్తుంటాడు. ఈ నెల 25వ తేదీన షాపులో పని ముగించుకొని వాంబేకాలనీలోని తన ఇంటికి వెళ్లేందుకు సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో ఆటో ఎక్కాడు. అక్కడి నుంచి వాంబేకాలనీ వైపుగా వెళ్లాల్సిన ఆటో ఎంబీ స్టేడియం వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా వివేకానంద స్కూల్ వైపునకు తిప్పేసి, చీకటిగా ఉన్న ప్రదేశంలో ఆటోను ఆపేశారు. ఆటోలో డ్రైవర్‌తో పాటు ఉన్న మరో ముగ్గురు యువకులు దుర్గారావును చంపేస్తామని బెదిరించి అతని జేబులో ఉన్న నాలుగు వేల రూపాయలను లాక్కొని ఉడాయించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా వారు సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించారు. దుర్గారావును బెదిరించింది వాంబేకాలనీకి చెందిన గుంజ విజయకుమార్, గుంజ అజయ్‌కుమార్, దుమ్ము శ్రీనివాసరావు, పాము కోటేశ్వరరావులుగా గుర్తించి కేసు నమోదుచేసి అరెస్ట్‌చేశారు. కోర్టు ఎదుట నిందితులను హాజరుపరచగా కోర్టు వారికి 14 రోజుల పాటు రిమాండ్ విధించింది.

స్నేహపూర్వకంగా అలవాట్లను మాన్పించాలి

జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ మాదక ద్రవ్యాలకు బానిసలైన వారికి విముక్తి కల్పించాలని జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ ఎడిక్షన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన నాషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించే కార్యక్రమాన్ని జిల్లా అధికారులకు కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎక్కువగా యువత, మురికివాడల్లో జీవిస్తున్న వారు మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డారని చెప్పారు. వారిని కోపంగా మాట్లాడకుండా స్నేహపూర్వకంగా వారికి ఉన్న అలవాట్లను మాన్పించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులు వెళ్లే పాఠశాలలు, కళాశాలల వద్ద మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించి అమ్మకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు గ్రామదర్శిని కార్యక్రమానికి వెళ్లినప్పుడు ఆయా గ్రామాల్లో మాదకద్రవ్యాలు వినియోగిస్తే ఏవిధమైన సమస్యలు వస్తాయో వివరించాలన్నారు. వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ బి.రామకుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగించే అనుమానితుల పట్ల వారితో మమేకమై అలవాటును మాన్పించేలా కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైతే మాదకద్రవ్యాలు లభ్యమవుతున్నాయో ఆ ప్రాంతాలకు వెళ్లకుండా నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. డీఆర్వో ఎం వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఐ కిషోర్, కెఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ అపరాజితసింగ్, చిత్రంలో అధికారులు

మోసగాళ్ల మాటలు నమ్మవద్దు

- బాధితులకు తప్పక న్యాయం చేస్తా
- స్పందనలో ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్: ఉద్యోగాల కోసం జనం మోసగాళ్ల మాటలు నమ్మి మోసపోకూడదని జిల్లా ఎస్పీ పి.జాషువ తెలిపారు. అలాగే నిరుద్యోగులను చేసి మోసం చేసే ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తేలేదని హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పాల్గొన్న ఎస్పీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను టార్గెట్ చేసి మోసాలకు పాల్పడే మాయగాళ్లపై పోలీసుల నిఘా పెంచేందుకు సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాంటి మోసగాళ్లు పట్టుబడితే ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. ఉద్యోగాల పేరుతో మోసపోయిన వారందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అర్జీలు..

- గుడివాడకు చెందిన సరిత అనే బాధితురాలు స్పందనలో ఎస్పీని కలిసి తనకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేసింది. బంధువుల ద్వారా పరిచయం అయిన వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి ఐదు లక్షల వరకు వసూలు చేశాడని తెలిపింది. ఉద్యోగం ఇప్పించకపోగా ఇచ్చిన డబ్బు అడుగుతుంటే చంపేస్తానంటూ తనను బెదిరిస్తున్నాడని ఆందోళన చెందింది. తనకు న్యాయం చేయాలని కోరింది. అర్జీలపై స్పందించిన ఎస్పీ చట్టపరిధిలో విచారణ జరిపించి సత్వరమే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.
- అవనిగడ్డకు చెందిన నాగేశ్వరరావు అనే బాధితుడు ఊళ్లో వ్యక్తి దగ్గర చిట్టీ వేసి పాడుకోగా ఎంత కాలం అయినా చిట్టీ డబ్బులు ఇవ్వటంలేదని వాపోయాడు. డబ్బు అడుగుతుంటే తనపై దాడికి దిగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయనపై చర్యలు తీసుకుని తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరాడు.


స్పందనలో ఓ బాధితురాలి ఆవేదన ఆలకిస్తున్న ఎస్పీ పి.జాషువ

15 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులకు ఎంపిక చేసిన 15 మంది అభ్యర్థులకు సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టుల భర్తీతో మరింత మెరుగైన విద్యాబోధన అందుతుందని చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 15 మందిని తీసుకున్నామని తెలిపారు. కొండపల్లి, మైలవరం, నందిగామ, విస్సన్నపేట (కొడపర్వ) గిరిజన గురుకుల బాలికల పాఠశాలల్లో ఉపాధ్యాయులు, జగ్గయ్యపేట, విస్సన్నపేట, ఆరు గిరిజన గురుకుల బాలుర పాఠశాలతో పాటు విస్సన్నపేట (కొడపర్వ) ప్రతిభా కళాశాలలో అధ్యాపక పోస్టులను భర్తీ చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్వో కె. మోహన్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమం అధికారి యం.రుక్మాంగదయ్య పాల్గొన్నారు.


నియామక పత్రాలు పంపిణీ చేస్తున్న ఢిల్లీరావు

అసెంబ్లీలో తీర్మానం హర్షణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల మాసిదోనియా గాస్పెల్ మినిస్ట్రీలో ఎన్‌సీసీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ హనోక్ అధ్యక్షతన సోమవారం జిల్లా నాయకులు నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ పాల్గొన్నారు. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జార్జి ముల్లర్ మాట్లాడుతూ 17 విభాగాల ద్వారా ఎన్‌సీసీ తన సేవలను విస్తృతం చేస్తుందన్నారు. ఎస్సీ విభాగపు రాష్ట్ర అధ్యక్షురాలు జస్వంత రాణి మాట్లాడుతూ దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేరుస్తూ ఇటీవల అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.


ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు జార్జి ముల్లర్‌ను సత్కరిస్తున్న కోగంటి సత్యం తదితరులు

ఇద్దరు విద్యార్థులు డిబార్

చిలకలపూడి(మచిలీపట్నం): ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం ఫిజిక్స్ పరీక్షలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆర్‌ఐవో పి. రవికుమార్ తెలిపారు. మొవ్వ జూనియర్ కళాశాలలో స్లిప్‌లతో పరీక్ష రాస్తుండగా సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉన్న ఆర్‌ఐవో కార్యాలయం నుంచి చూడటంతో దగ్గరలో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సమాచారం అందించటంతో ఆ బృందం వెళ్లి విద్యార్థినిని పరిశీలించి డిబార్ చేశారన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థి మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా సమాచారం రావటంతో సిట్టింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించి ఆ విద్యార్థిని డిబార్ చేసిందని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన పరీక్షకు సంబంధించి కృష్ణా జిల్లాలో 16,863 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 16,489 మంది హాజరయ్యారని, 374 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. అలానే ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 31,338 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 30,626 మంది విద్యార్థులు హాజరయ్యారు. 712 మంది విద్యార్థులు హాజరుకాలేదని ఆర్‌ఐవో రవికుమార్ తెలిపారు.

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది


డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ

గన్నవరం రూరల్: వైద్య వృతి ఎంతో పవిత్రమైనదని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జీ చెప్పారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో వైద్య విద్య పూర్తి చేసిన వారికి సోమవారం ఎంబీబీఎస్ డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ డాక్టర్లుగా ఎదిగిన వారంతా సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఎంతో మంది నిష్ణాతులైన వైద్యులకు డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల చిరునామాగా ఉందని పేర్కొన్నారు. ప్రతి రోగిని టీచర్‌గా చూడాలని, వారి నుంచి ఎన్నో పాఠాలు మనం నిరంతరం నేర్చుకోవాలన్నారు. చిరునవ్వుతో, మంచి మనస్సుతో సేవ చేసిన వారు ఎనలేని ప్రతిష్ట సంపాదిస్తారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో డైరెక్టర్ జనరల్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచం గర్వించే వైద్యులుగా ఎదగాలంటే చేతులతో, మనస్సుతో వైద్యం చేయాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన డాక్టర్ బాబ్జీ 17వ బ్యాచ్ ఎంబీబీఎస్ 146 మంది, 12వ బ్యాచ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ 73 మంది, 3వ బ్యాచ్ సూపర్‌స్పెషాలిటీ ముగ్గురు విద్యార్థులకు డిగ్రీలు పంపిణీ చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, ఏవోలు టీవీ సుబ్బారావు, కె.నవీన్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.


డిగ్రీలు ప్రదానం చేస్తున్న డాక్టర్ బాబ్జీ

పోలీసుస్టేషన్‌కు చేరిన పది ప్రశ్నపత్రాలు

కంకిపాడు: పదో తరగతి ప్రశ్నపత్రాలు సోమవారం పోలీసుస్టేషన్‌కు చేరుకున్నాయి. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కృష్ణా జిల్లా వ్యాప్తంగా 143 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 19935 మంది రెగ్యులర్, 2501 మంది సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర పరీక్షా సామగ్రిని జిల్లా వ్యాప్తంగా ఉన్న 29 స్టోరేజ్ యూనిట్‌లకు (పోలీసుస్టేషన్) చేర్చారు. పరీక్షా సామగ్రిని కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో ట్రంకు పెట్టెల్లో పెట్టి పోలీసుస్టేషన్‌లలో భద్రపరిచారు. డీఈఓ తాహెరా సుల్తానా పర్యవేక్షణలో మచిలీపట్నం నుంచి పరీక్షా సామగ్రిని ప్రత్యేకంగా నియమించిన తొమ్మిది మంది రూట్ ఆఫీసర్లు, 10 మంది అదనపు రూట్ ఆఫీసర్లు స్టోరేజ్ యూనిట్‌లకు తరలించారు.


ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రిని భద్రం చేస్తున్న రూట్ ఆఫీసర్ కనకమహాలక్ష్మి

చల్లపల్లిని సందర్శించిన సర్పంచుల బృందం

చల్లపల్లి: అన్నమయ్య జిల్లా మదనపల్లి డివిజన్‌కు చెందిన 13 మంది మహిళా సర్పంచుల బృందం గ్రామంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమాలను సోమవారం సందర్శించారు. ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీస్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించారు. మన కోసం మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ, సుందర చల్లపల్లి వేదికగా డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించారు. గ్రామంలోని ఘన వ్యర్థాల నుంచి సంపద ఉత్పత్తి కేంద్రం, శ్మశానవాటిక, బహిరంగ మరుగుదొడ్లు, రహదారి వనాలు, పంచాయతీ పార్కు, డంపింగ్ యార్డ్ గార్డెన్, మహాత్మా గాంధీ స్మృతివనం పరిశీలించారు. ప్రకృతి వనరుల పరిరక్షణ అధ్యయనం కోసం వచ్చామని చెప్పారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈఓ పడమట సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామాన్ని సందర్శిస్తున్న అన్నమయ్య జిల్లా సర్పంచులు

చిన్నారిని ఎత్తుకెళ్లిన మతిస్థిమితం లేని యువతి

గంట వ్యవధిలోనే గుర్తించిన పోలీసులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మతిస్థిమితం సరిగా లేని ఓ యువతి మూడేళ్ల చిన్నారిని ఇంటి నుంచి తీసుకొని వెళ్లిపోయిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణలంక ప్రాంతానికి చెందిన బాకి ప్రియాంక, శ్రీనివాసరావు దంపతులకు బిందుశ్రీ (3) అనే పాప ఉంది. ప్రియాంక సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లో ఉంటున్న తన తల్లిని చూసేందుకు సోమవారం ఉదయం వచ్చింది. తన తల్లితో ఇంట్లో మాట్లాడుతుండగా మతిస్థిమితం సరిగా లేని ప్రియాంక అక్క గొల్లపల్లి భారతి తన చెల్లి కూతురైన బిందును ఆడిపిస్తానని ఎత్తుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే ఎంతసేపు అయినా భారతి తన పిల్లను తీసుకొని రాకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె వెంటనే బయటకు వచ్చి చూడగా ఎక్కడా కనిపించలేదు. తన బంధువుల సాయంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఆమె వెంటనే సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరచగా నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు విజయవాడ పశ్చిమ డీసీపీ, నార్త్ జోన్ ఏసీపీ సీహెచ్ రవికాంత్ ఉత్తర్వులు ప్రకారం రెండు బృందాలుగా ఏర్పడి, దిశ వెహికల్స్ సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయోధ్యనగర్ శివాలయం వద్ద చిన్నారి బిందుశ్రీని సీఐ లక్ష్మీనారాయణ గుర్తించారు. పాపను తీసుకువెళ్లిన భారతిని కూడా రామకృష్ణాపురం ఆర్‌యూబీ వెంబడి ఉన్న రైల్వేట్రాక్ వద్ద గమనించి అదుపులోకి తీసుకున్నారు. నార్త్‌జోన్ ఏసీపీ రవికాంత్ సమక్షంలో బాలికను, మతిస్థిమితం లేని యువతిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు సకాలంలో స్పందించి, ఫిర్యాదు అందిన కేవలం గంట వ్యవధిలోనే ఇద్దరిని గుర్తించి తమకు అప్పగించడంపై బాలిక, యువతి తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేశారు. రెండు బృందాలుగా ఏర్పడి వారిని పట్టుకున్న సీఐ లక్ష్మీనారాయణ, ఉమెన్ ఎస్సై ఎ.దుర్గాదేవి, ఏఎస్ఐ సుబ్బారావు, కానిస్టేబుల్ హరికృష్ణలను సీపీ, ఏసీపీలు ప్రత్యేకంగా అభినందించారు.


చిన్నారిని, యువతిని అప్పగిస్తున్న ఏసీపీ రవికాంత్, సీఐ లక్ష్మీనారాయణ

ఆసుపత్రి భవనం పై నుంచి కిందపడి వ్యక్తి మృతి

ఉంగుటూరు: పిన్నమనేని సిద్దార్థ ఆసుపత్రిలో మూడవ అంతస్తు నుంచి దూకి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన కొఠారి రాజా (33) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతున్న రాజా సోమవారం రాత్రి ఆసుపత్రి భవనం మూడవ అంతస్తు నుంచి కిందపడి మృతి చెందాడు. జ్యూస్ తాగితే వాంతి వస్తుందని కిటికి వద్దకు వెళ్లగా, తాను ఫ్యాన్ ఆపేందుకు వెళ్లానని ఇంతలో కాలు జారి భవనం పైనుంచి కిందపడి మృతి చెందాడని భార్య హైమావతి చెప్పింది. ఆత్మహత్యకు పాల్పడ్డాడా, ప్రమాదవశాత్తు మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు రాజా

బీరు సీసాతో భార్యపై దాడి

నందిగామ: బీరు సీసాతో భార్యపై భర్త విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన సోమవారం నందిగామ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపిన సమాచారం ప్రకారం... పట్టణానికి చెందిన పల్లెపు ఆంజనేయులు, శ్రీలక్ష్మి భార్యాభర్తలు. వీరిద్దరి మధ్య వివాదం చోటు చేసుకోవడంతో శ్రీలక్ష్మి కొంతకాలంగా పట్టణంలోని బీసీ కాలనీలో భర్తకి దూరంగా నివాసం ఉంటుంది. ఈ తరుణంలో ఆమె భర్త ఆంజనేయులు సోమవారం ఉదయం శ్రీ లక్ష్మిపై బీరు సీసాతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హెచ్ ఓ తెలిపారు. భర్త చేతిలో తీవ్రంగా గాయపడ్డ ఆ మహిళ రక్తపు మడుగులోనే పడి ఉంది. సమాచారం తెలుసుకున్న ఎస్‌హెచ్‌ఓ సతీష్ వెంటనే ఘటన స్థలానికి వెళ్లి బాధితురాలిని 108 వాహనంలో స్వయంగా ఎక్కించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రైవేటు అంబులెన్స్ లో మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు.


గాయాల పాలైన మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత



కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లో డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆటోనగర్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఏప్రిల్ 4వ తేదీ రాత్రి 8 గంటలకు ఆటోనగర్ నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. అదే బస్సు రాత్రి 9 గంటలకు పీఎన్‌బీఎస్ నుంచి బయలుదేరుతుందని చెప్పారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శిస్తారన్నారు. 6వ తేదీ ఉదయం 5 గంటలకు అరుణాచలం చేరి తరువాత గిరి ప్రదర్శన అనంతరం అదే రోజు సాయంత్రం అరుణాచలం నుంచి బయలు దేరి 7వ తేదీ ఉదయం 7 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. రాను పోను ఒక్కొక్క టికెట్‌కు సూపర్ లగ్జరీ బస్సుకు రూ.2,500లుగా చార్జి నిర్ణయించామని చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73828 99266 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దాసాంజనేయుడి హుండీ ఆదాయం రూ.8 లక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ. 8.83లక్షలు వచ్చాయి. మాచవరం, శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో సోమవారం ధర్మకర్తల మండలి సమక్షంలో శ్రీ గుంటూరు సీతారామయ్య అన్న సత్రం, కార్యనిర్వహణాధికారి బి. సుబ్బారెడ్డి, దాసాంజనేయస్వామివారి దేవాలయం కార్యనిర్వహణాధికారి నాగినేని పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో పై ఆదాయంతో పాటు 101 అమెరికన్ డాలర్లు కూడా వచ్చాయి. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి సన్మానం

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడకు ఎంపికైన సాయి అన్వితను కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి అభినందించారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. దక్షిణ కొరియాలోని సియోల్‌లో ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు ఆసియా కప్ మహిళా సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు విజయవాడ రాజీవ్ నగర్‌కు చెందిన టెక్కం సాయి అన్విత ఎంపికైంది. భారత జట్టుకు రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారిణి సాయి అన్విత ఆంధ్రప్రదేశ్ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో పెంపొందించాలని అడపా శేషు ఆకాంక్షించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్ బాల్ కోచ్ రాయన సురేష్, అన్విత తండ్రి టెక్కం కృష్ణలను శేషు సన్మానించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్ బాల్ అధ్యక్ష కార్యదర్శులు కాకర్ల పవన్కుమార్, గమిడి సాంబశివరావు పాల్గొన్నారు.

కార్పెంటర్లకు ప్రభుత్వం అండగా ఉంటుంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వబ్రాహ్మణ సామాజికవర్గ కుల వృత్తుల్లో ఒకటైన కార్పెంటర్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. సోమవారం కార్పెంటర్ డే సందర్భంగా గొల్లపూడి పరిధిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన కార్యాలయంలో సీనియర్ కార్పెంటర్ సంగోజు రామాచారికి చిరు సత్కారం చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కార్పెంటర్లందరూ ఆధునిక యంత్రాలపై శిక్షణ పొంది వృత్తిలో రాణించాలని కోరారు. జగనన్న తోడు పథకం ద్వారా కార్పెంటర్లకు రుణాలను అందిస్తుందని, తద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు.

ఫుడ్ కోర్ట్.. ఘుమఘుమలు

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సమీపంలో ఉన్న ఈట్ స్ట్రీట్ నగర వాసులను ఆకర్షిస్తోంది. ప్రతి రోజు రాత్రి 9 గంటల నుంచి నిర్వహించే ఈ ఫుడ్ కోర్టులో వివిధ రకాలైన వెజ్, నాన్ వెజ్ బిర్యానీలు, ఫలుదాలతో పాటు చైనీస్ వంటకాలు ఘుమఘుమలాడుతుండడంతో భోజన ప్రియులు బారులు తీరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.











30న శ్రీరామచంద్రునికి స్వరనీరాజనం



మాట్లాడుతున్న కాకరపర్తి కృష్ణమోహన్, వేదికమీద చిట్టిబాబు, శ్యాంప్రసాద్

విజయవాడకల్చరల్: శ్రీ రామనవమి సందర్భంగా గాంధీనగర్ జింఖానా క్లబ్‌లో తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో 30వ తేదీ సాయంత్రం భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జింఖానా క్లబ్ ప్రతినిధి కాకరపర్తి కృష్ణమోహన్ తెలిపారు. జింఖానా క్లబ్ ఆవరణలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్లబ్ ద్వారా కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయనీ గాయకులు పాల్గొంటారన్నారు. సమావేశంలో గాయకుడు శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



రామలింగేశ్వరనగర్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న దేవినేని అవినాష్, బెల్లం దుర్గ తదితరులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కొన్నేళ్లుగా రేషన్ కార్డు లేక నానా ఇబ్బందులు పడ్డాను.. గత కొద్ది రోజుల క్రితం రేషన్ కార్డు మంజూరు చేశారు. భర్త లేకపోయినప్పటికీ కార్డు రావడం చాలా సంతోషంగా ఉందని వాసన సుజాత అన్నారు. మరో మహిళ రత్నమయకు జగనన్న కాలనీలో ఇల్లు... పింఛన్‌తో పాటు జగనన్న చేయూత వచ్చిందని, దీని ద్వారా చిన్న చిన్న అప్పులు తీర్చుకున్నా.. ఈ విధంగా ప్రతి మహిళ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు ఎవ్వరి సిఫార్సు లేకుండా అందాయని లబ్ధిదారులు చెబుతున్నారు. రామలింగేశ్వరనగర్ 15వ డివిజన్ 71వ సచివాలయం పరిధి అయ్యప్ప రోడ్డు, ఎస్ఆర్‌కెఎం, చెల్లారావు రోడ్డు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవరత్నాలు అమలు తీరును మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటికి వెళ్లినా పథకాలు అందని వారు లేరు. అంతే కాకుండా మా జీవితాలు మారాయని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి

దేవినేని అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లో రూ.కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. గత 8 రోజులుగా డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఇక్కడి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. గత టీడీపీ హయాంలో డివిజన్‌ను అభివృద్ధి చేయకపోగా స్థానికులను ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. అధికారం కోసం టీడీపీ పగటి కలలు కంటుందని, ఆ పార్టీని స్థానికులు ఛీదరించుకుంటున్నారని చెప్పారు. చుక్క మంచినీరు ఇవ్వకుండా ప్రజలను నానా అవస్థలకు గురిచేశారని.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేశారన్నారు. సమస్య ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి ప్రజలతో మాట్లాడి.. సమస్యను పరిష్కరించే విధంగా అడుగులు ముందుకు వేశామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏ.చెల్లారావు, డాక్టర్ ఎంఎస్ రాజు, ఎం.దాసు, చంటి, రెహమాన్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న దేవినేని అవినాష్, అధికారులు, నాయకులు

గుణదల(విజయవాడతూర్పు): మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 4వ డివిజన్ పరిధిలోని ఓ కల్యాణ మంటపంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అవినాష్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఆయన రూపొందించి అమలు పరిచే సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అమ్మ ఒడి, కాపు నేస్తం, సున్నా వడ్డీ రుణాలు ఇలా అన్ని పథకాల్లో మహిళలకు సీఎం వైఎస్ జగన్ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం పురోగమి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. వైఎస్సార్ ఆసరా మూడవ విడత నిధులు విడుదలయ్యాయని తెలిపారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని 4, 11 డివిజన్లకు చెందిన 246 గ్రూపులకు గాను 2 కోట్ల 61 లక్ష 39 వేల రూపాయలు మంజూరయ్యాయన్నారు. మహిళలకు నమూన చెక్కును అందజేశారు. వీఎంసీ జోనల్ కమిషనర్ కృష్ణ, 4, 11వ డివిజన్ల ఇన్‌చార్జిలు గల్లా పద్మావతి, పర్వతనేని పవన్, నాయకులు ఉమ్మడి ధనరాజు, రాజ్ కమల్ పాల్గొన్నారు.

వాస్తవ సంఘటనలకు అద్దంపట్టిన ప్రదర్శనలు



గురజాడ అంతర్వేదన ప్రహసంలో నటిస్తున్న డాక్టర్ ఎంసీ దాస్, సీహెచ్ రిషిక్

విజయవాడకల్చరల్: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా దృశ్యవేదిక, సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో సోమవారం ప్రదర్శించారు. సాంఘిక నాటికలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి. దుర్గా మల్లేశ్వరి మహిళా కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన ఐంతేనా నాటకం వాస్తవ జీవితాలను దర్పణంగా నిలిచింది. రచన ఎస్ఎస్ నారాయణబాబు, దర్శకత్వం డాక్టర్ ఎం.సరళాదేవి, నటీమణులు షేక్ పర్వీన్, యూ.నాగమణి, కె.జయనందిని, ఆర్ అఖిల, ఓ.సాత్విక, కె.సుప్రియ, టి.లోహిత, బి.సాయిదీపిక, కె.లక్ష్మి, ఎస్.సాయిధరణి, కె.జాహ్నవి, రెండో నాటికగా భాస్కర చంద్ర రచించిన అంతేగా హాస్యప్రహసనం, గురజాడ అంతర్వేదన ప్రహసంలో డాక్టర్ ఎంసీ దాస్, సీహెచ్ రిషిక్ సాయి నటించారు. నాటక రంగంలోని వివిధ శాఖలకు చెందిన వారికి, నాటక రంగ ప్రముఖులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. దృశ్య వేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్, సుమధుర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి భాస్కర శర్మ పాల్గొన్నారు.

ఎన్‌ఈపీతో పేదలకు విద్య దూరం

ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వి.పి.సాను



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వి.పి.సాను

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం -2020(ఎన్ఈపీ)ను తీసుకొచ్చి పేదలకు విద్యను దూరం చేసిందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వి.పి.సాను విమర్శించారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ అధ్యక్షతన 'నూతన జాతీయ విద్యా విధానం - విద్యారంగంపై ప్రభావం, ప్రత్యామ్నాయ విద్యావిధానం' అంశంపై సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తీసుకొచ్చిన ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని సాను ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాల పరిధిలో ఉన్న విద్యను ఇందిరాగాంధీ ఉమ్మడి జాబితాలో చేరిస్తే ప్రధాని మోదీ ఎన్ఈపీతో కేంద్రం చేతుల్లోకి లాక్కుందన్నారు. దీంతో రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. ఎన్ఈపీ అమలు తర్వాత పాఠ్యాంశాలలో అశాస్త్రీయ భావాజాలాన్ని, చరిత్రను వక్రీకరిస్తున్నారని వాపోయారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం, ఒకే సంస్కృతి చివరికి ఒకే పార్టీ, ఒకే నాయకుడు అనే నినాదం వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర దాగి ఉందని, ఇది ప్రజాస్వామానికి తీవ్ర విఘాతం అని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్ఈపీని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టంచేశారు. ఎన్ఈపీకి ప్రత్యామ్నాయంగా అందరికీ అందుబాటులో ఉండే శాస్త్రీయ విద్యా విధానంపై అఖిల భారత మహాసభలో డ్రాఫ్ట్ తయారుచేశామని తెలిపారు. ఈ డ్రాఫ్ట్ ఎస్ఎఫ్ఐ సీఈసీ వెబ్‌సైట్ అందుబాటులో ఉందని, అందరూ చదివి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ, కాషాయికరణ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. అందరూ ముక్త కంఠంతో ఎన్ఈపీని వ్యతిరేకించాలని, ఎస్ఎఫ్ఐ తీసుకొచ్చిన ప్రత్యామ్నాయ విద్యా విధానం అమలుకు కృషి చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, సీహెచ్ ప్రణీత, రాజ్‌కుమార్, మధన్, ప్రశాంత్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీతీర్థ స్వామి జన్మదిన వేడుకలు



శివరామకృష్ణ క్షేత్రంలో గురువందనం చేస్తున్న రుత్వికులు

విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థస్వామి 73 జన్మదిన వేడుకలను దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రుత్వికులు లోక కల్యాణార్థం గురువందనంతో ప్రారంభించి శ్రీ సూర్యనారాయణ స్వామివారికి అర్చన, మహాసౌరం, అరుణ పారాయణ, సూర్య నమస్కారాలు, సౌరష్టాక్షరీ మంత్రజపం, ఆయుష్యహోమం, మృత్యుంజయ హోమం వైభవంగా నిర్వహించారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ.. శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి వారి ఆదేశంతో జనవరి 16వ తేదీన వైదిక కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. 73 రోజులుగా నిర్వహిస్తున్నామని, 29వ తేదీ బుధవారం అరుణ హోమంతో కార్యక్రమాలు ముగిస్తాయన్నారు. వేద ధర్మరక్షణకు శృంగేరీ పీఠం కృషి చేయడంతో పాటు వేద పాఠశాలను నిర్వహస్తున్నట్లు తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రం పాలక మండలి సభ్యుడు గండూరి చంద్రమౌళీశ్వర శర్మ పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో బ్లాక్ డే



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజస్థాన్‌లో వైద్యులపై పోలీసులు లాఠీఛార్జిని నిరసిస్తూ ఐఎంఏ దేశ వ్యాప్తంగా నిరసనలకు పిలుపునివ్వడంతో విజయవాడ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్యులు నల్ల బ్యాడ్జిలు ధరించి బ్లాక్ డే పాటిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలు వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎంఏ రెహమాన్, డాక్టర్ దుర్గారాణిలతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రెహ్మాన్ మాట్లాడుతూ.. సరైన నియమ నిబంధనలు రూపొందించకుండా, రాజస్థాన్ ప్రభుత్వం ఆరోగ్య హక్కు చట్టం తీసుకు వచ్చి, ప్రైవేటు ఆస్పత్రిల్లో అత్యవసర వైద్యం అందరికీ అందించాలని పొందుపరిచారన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చు ఎక్కడి నుంచి ఇస్తారు, ఎవరు ఇస్తారు అనేది స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. అప్రజాస్వామిక, నిరంకుశ చట్టాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఐఎంఏ బ్లాక్ డేను పాటిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

● కాలి బాటపై గాఢ నిద్ర



విజయవాడ నగరంలో మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఫుట్‌పాత్ యాచకుల గాఢ నిద్రకు కేరాఫ్‌గా మారింది. రాత్రి వేళల్లో పెద్ద సంఖ్యలో యాచకులు ఫుట్ పాత్‌పై నిద్రిస్తున్న దృశ్యాన్ని సాక్షి 'క్లిక్'మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్‌షిప్ అందజేస్తున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అభయ హ్యూమన్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్‌లోని బడేటి ధర్మారావు భవనంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా అభయ హ్యూమన్ సర్వీసెస్ సొసైటీ వారు సామాజిక బాధ్యతగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అందులో భాగంగా 30 మంది పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. దాతలు అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జీవీ రమేష్‌రావు, కోట్ల శివశంకర్‌రావు, కొండలరావు, హరికుమార్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట బంగారయ్య కొట్టు బూస్టర్ సమీపంలోని శ్రీ శివనాగ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన శివనాగ మందిరంలో విఘ్నేశ్వర, షణ్ముఖ, అయ్యప్ప స్వామి, ఆంజనేయ స్వామి, మహాలక్ష్మి, దుర్గా మల్లేశ్వర స్వామి, జంట నాగులు, షిర్డి సాయి బాబా విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. మందిర గురుస్వామి బెవర రాము ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు దేవి లక్ష్మీ నారాయణాచార్యుల శిష్య బృందం విగ్రహ ప్రతిష్ఠ జరిపించారు. ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, కార్పొరేటర్లు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, బుల్లా విజయ్‌కుమార్, గోదావరి గంగ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు బెవర రాము, సామా వెంకట స్వామి, అయితా కృష్ణకిశోర్, రాయన రాము, బెవర వెంకట్రావు, కోళ్ల నాగేశ్వరరావు, పిల్లా సూరిబాబు, అద్దూరి రాము, పేర్ని కృష్ణ పర్యవేక్షించారు.

నవమి వేడుకలకు అంకురార్పణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలో వేం చేసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి వారి శ్రీరామనవమి వేడుకలకు సోమవారం అంకురార్పణ చేశారు. స్వామి వారికి వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి రామ నగరేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానంలో శ్రీ రామనవమి ఉత్సవాలకు ప్రత్యేక వైదిక కార్యక్రమాలతో శ్రీకారం చుట్టారు. ఉదయం స్వామి వారి మూలమూర్తులకు ప్రత్యేక తిరుమంజనం చేశారు. అందులో భాగంగా సీతా, లక్ష్మణ సమేత కోదండరామస్వామివారికి వివిధ సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అర్చన జరిపారు. అనంతరం స్వామి వారిని పెండ్లికుమారునిగా, సీతమ్మను పెండ్లి కుమార్తెగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం వైదిక కార్యక్రమాల్లో భాగంగా విష్వక్సేనారాధనతో పూజలకు శ్రీకారం చుట్టారు. అనంతరం పుణ్యాహవాచనం, అజస్రదీపారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అదేవిధంగా రక్షాబంధనం, ఋత్విగ్వరణ తదితర కార్యక్రమాలను జరిపారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. వచ్చే నెల 7వ తేదీ వరకూ స్వామి వారి నవమి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ తెలిపింది.

జీ–20 సదస్సుకు సర్వ సన్నద్ధం

విశాఖ వేదికగా నేటి నుంచి నాలుగు రోజులపాటు సమావేశాలు







జీ-20 సదస్సుకు ముస్తాబైన విశాఖపట్నం

సాక్షి, విశాఖపట్నం : విశాఖ మహా నగరం మరో ప్రతిష్టాత్మక సదస్సుకు ఆతిథ్యమిస్తోంది. ఇప్పటికే ఈనెల 3, 4 తేదీల్లో విశాఖ వేదికగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను (జీఐఎస్) ఘనంగా నిర్వహించి దేశ, విదేశాల దృష్టిని ఆకర్షించగా, తాజాగా.. మంగళవారం నుంచి జీ-20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యూజీ) సమావేశాలు జరగనున్నాయి. ఈ సదస్సు వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ, వన్ ఫ్యూచర్ అనే థీమ్‌తో 28, 29, 30, 31 తేదీల్లో విశాఖలో జరగనుంది. నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో నాలుగు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు జీ-20 దేశాలతో పాటు యూరోపియన్ దేశాలకు చెందిన 57 మంది ప్రతినిధులు విశాఖ చేరుకున్నారు. వీరికి అవసరమైన రవాణా, వసతి, భద్రతా ఏర్పాట్లు వంటివి అధికారులు పూర్తిచేశారు. అతిథులను స్వాగతించడానికి ప్రత్యేక సాంస్కృతిక బృందాలను సిద్ధంచేశారు.

పూణే, కడియంల నుంచి తెచ్చిన పూలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

విద్యుత్ స్తంభాలకు విద్యుద్దీపాలను అలంకరించారు. ఇలా.. విశాఖ నగరం మునుపెన్నడూ లేని రీతిలో ఎటు చూసినా ఎంతో సుందరంగా కనిపిస్తోంది.
ఇక జీ-20 సదస్సుపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆదివారం వైఎంసీఏ నుంచి ఆర్కే బీచ్ వరకు వైజాగ్ కార్నివాల్, ఆర్కే బీచ్ నుంచి 3కే, 5కే, 10 మారథాన్, పారా మోటార్ ఎయిర్ సఫారీ కూడా నిర్వహించారు. గత కొన్నిరోజులుగా మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, విడదల రజని, ఆదిమూలపు సురేష్ తదితరులు ఈ సదస్సు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

2,500 మందితో భద్రతా ఏర్పాట్లు

జీ-20 సదస్సు నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. సుమారు 2,500 మంది పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేశారు. బందోబస్తుకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల నుంచి కూడా సిబ్బందిని రప్పించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పటిష్ట ఏర్పాట్లుచేశారు.

జీ-20 దేశాలివీ..

అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, భారత్, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, టర్కీ, యూకే, అమెరికా, యూరోపియన్ యూనియన్.

సదస్సు షెడ్యూలు ఇలా..

- ▲ 28 ఉదయం రాడిసన్ బ్లూ హోటల్‌లో అల్పాహారం తర్వాత ప్రధాన సమావేశం హోటల్‌లోని కన్వెన్షన్ హాలులో జరుగుతుంది. సా.3.30 నుంచి 6.30 వరకు మూడు రకాల సమావేశాలు నిర్వహిస్తారు. రాత్రి 7.30 నుంచి 9.30 వరకు హోటల్ సమీపంలోని బీచ్‌లో గాలా డిన్నర్ ఉంటుంది. దీనికి సీఎం వైఎస్ జగన్ హాజరవుతారు. ముఖ్యమంత్రి ప్రసంగం కూడా ఉంటుంది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి.
- ▲ 29న హోటల్ సమీపంలోని బీచ్‌లో యోగా, మెడిటేషన్, పౌష్టికాహార వినియోగంపై నిపుణులతో అవగాహన కార్యక్రమాలుంటాయి. ఆ రోజంతా మౌలిక సదుపాయాల కల్పన అనే అంశంపై ప్రధాన సమావేశం ఉంటుంది.
- ▲ 30న ఉ.10 నుంచి మ.1.30 గంటల వరకు కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపు ఉంటుంది. అనంతరం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ముడసర్లోవ, కాపులుప్పాడ ప్రాంతాల్లో విదేశీయులు పర్యటిస్తారు. స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, మెగా ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ పనితీరు, జిందాల్ కంపెనీ పరిధిలో నిర్వహించే వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎనర్జీ తయారీ యూనిట్ పనితీరు గురించి అధికారులు వివరిస్తారు.
- ▲ 31న దేశవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లతో పట్టణీకరణ, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సింగపూర్, దక్షిణ కొరియా ప్రతినిధులతో చర్చిస్తారు. జన్‌భాగీదారీ కార్యక్రమం కింద స్థానిక నిపుణులతో వివిధ అంశాలపై చర్చా సమావేశాలు జరుగుతాయి. అనంతరం.. విదేశీ ప్రతినిధులు తిరుగు ప్రయాణమవుతారు.

నేడు సదస్సు ప్రారంభం.. హాజరుకానున్న సీఎం జగన్

జీ-20 సదస్సు తొలిరోజు సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరవుతారు. సదస్సులోని ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడి అనంతరం గాలా డిన్నర్‌లో పాల్గొంటారు. రాత్రికి ముఖ్యమంత్రి తిరిగి తాడేపల్లికి పయనమవుతారు. మరోవైపు.. జీ-20 దేశాల ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి రాష్ట్ర సమాచారాన్ని అందజేస్తారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను వివరిస్తారు. ఈ సదస్సు ద్వారా విశాఖకు ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుందని భావిస్తున్నారు.

రూ.157 కోట్లతో నగర సుందరీకరణ

జీ-20 సమావేశాలు పురస్కరించుకుని రూ.157 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన నగరం సర్వాంగ సుందరంగా తయారైంది. నగరంలో ఏ మూల చూసినా విద్యుద్దీపాలతో ధగధగలాడుతోంది. విదేశీ ప్రతినిధులు పర్యటించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేశారు. రహదారులన్నీ మిలమిల మెరిసిపోతున్నాయి.

- ▲ 46 కి.మీల మేర రోడ్డు పనులు, 24 కి.మీల మేర పెయింటింగు పనులు, 10 కి.మీల మేర ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు.
- ▲ రూ.2.39 కోట్లతో సీతకొండపై బీచ్ వైఎస్సార్ వ్యూ పాయింట్‌ను ఆధునీకరించారు. ఐ లవ్ వైజాగ్ సెల్ఫీ పాయింట్, సోలార్ ట్రీ ఏర్పాటుచేశారు.
- ▲ సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, జోడుగుళ్లపాలెం బీచ్‌లను అభివృద్ధి చేశారు. రూ.1.31 కోట్లతో కైలాసగిరి రోప్‌వే నుంచి తిమ్మాపురం వరకు 11 కి.మీల మేర ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేసి టెర్రాకోట్ వేశారు.
- ▲ రోడ్ల పక్కన గోడలకు, కల్వర్టులకు విశాఖ, ఏపీ సంస్కృతిని ప్రతిబింబించే అందమైన చిత్రాలు కనువిందు చేస్తున్నాయి. అందాల కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి.
- ▲ ఎయిర్‌పోర్టు నుంచి బీచ్‌రోడ్డులో సదస్సు జరిగే రాడిసన్ బ్లూ హోటల్ వరకు ఇరువైపులా వివిధ రకాలతో వైఎస్సార్ జిల్లా మేదర నిపుణులు రూపొందించిన వెదురు ఆకృతులపై పూలమొక్కలను అమర్చారు. రోడ్ల మధ్యనున్న డివైడర్లు పచ్చని మొక్కలతో అలరిస్తున్నాయి.

ఇక పరిశ్రమలకు అనుమతులన్నీ ఒకేచోట

వైఎస్సార్ ఏపీ వన్ యాప్, వెబ్‌సైట్‌ని ప్రారంభించిన ప్రభుత్వం

- 21 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు
- 96 క్లియరెన్స్‌లన్నీ ఒకే యాప్ పరిధిలోకి
- ఇకపై అనుమతుల కోసం 23 వెబ్‌సైట్లకు వెళ్లనవసరం లేదు
- విశాఖలో వైఎస్సార్ ఏపీ వన్ ప్రధాన కేంద్రం ఏర్పాటు
- అన్ని జిల్లాల్లో సబ్ సెంటర్లకు ప్రభుత్వం ప్రణాళికలు
- రాష్ట్ర ప్రభుత్వం మరో విప్లవాత్మక నిర్ణయం

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న పారిశ్రామికవేత్తలు ఇకపై అనుమతుల కోసం శ్రమించాల్సిన అవసరం లేదు. కేవలం ఒకే యాప్, వెబ్‌పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులు పొందొచ్చు. ఈ మేరకు సరికొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వైఎస్సార్ ఏపీ వన్ యాప్ ద్వారా 23 రకాల అనుమతులకు ఒకేచోట దరఖాస్తు చేసుకునే వెసులుబాటుని పారిశ్రామికవేత్తలకు కల్పించింది. విశాఖపట్నంలో వైఎస్సార్ ఏపీ వన్ ప్రధాన కేంద్రం ఏర్పాటు చేస్తారు. అలాగే అన్ని జిల్లాల్లో పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉండేలా సబ్ సెంటర్లను నెలకొల్పుతారు. యాప్, పోర్టల్‌ను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం విశాఖలో లాంఛనంగా ప్రారంభించారు.



వెబ్‌పోర్టల్‌ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

96 క్లియరెన్స్‌లన్నీ ఒక్కచోటే..

పారిశ్రామిక రంగంలో ఇప్పటికే విభిన్న సంస్కరణలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ పద్ధతిని కూడా అమల్లోకి తీసుకొచ్చింది. దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోనే పరిశ్రమలకు అన్ని అనుమతులు మంజూరు చేయనుంది. మూడు వారాల్లో పరిశ్రమలకు అవసరమైన భూములు కేటాయించనుంది. వైఎస్సార్ ఏపీ వన్ పోర్టల్ ద్వారా 23 విభాగాలకు సంబంధించిన 96 క్లియరెన్సులన్నీ ఒకే చోట పొందొచ్చు. దీని వల్ల వివిధ శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం, వివిధ విభాగాల వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాల్సిన పని లేకుండా పరిశ్రమలకు అనుమతులు లభించనున్నాయి. ఈ ప్రక్రియను కూడా 21 రోజుల్లోనే పూర్తి చేస్తారు.

గతంలో ఇలా..

గతంలో రాష్ట్రంలో ఎవరైనా ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకుంటే ముందుగా రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 23 అనుమతులు తీసుకోవాల్సి వచ్చేది. వీటికోసం ఆయా విభాగాల వెబ్‌సైట్‌లకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. ఇది చాలా ప్రయాసతో కూడుకుని ఉండటం.. గత టీడీపీ ప్రభుత్వం దీనిపై దృష్టిసారించకపోవడంతో పారిశ్రామికవేత్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఇబ్బందుల్ని తొలగించేలా.. అనుమతులన్నీ సులువుగా పొందేలా సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలని అధికారుల్ని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో అధికారులు ప్రత్యేకంగా వైఎస్సార్ ఏపీ వన్ అనే వెబ్ పోర్టల్‌తో పాటు యాప్‌ని కూడా రూపొందించారు.

పట్టణీకరణపైనే జీ–20 సదస్సు ఫోకస్

మౌలిక సదుపాయాలు కల్పన

- సవాళ్లను ఎదుర్కోవడంపై వర్కింగ్ గ్రూప్‌లో చర్చ
- కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి ఆరోఖ్యరాజ్



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నంలో మంగళవారం నుంచి జరగనున్న జీ-20 సదస్సులో పట్టణీకరణపైనే ప్రధానంగా ఫోకస్ ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ తెలిపారు. జీ-20 సదస్సు జరిగే రాడిసన్ బ్లూ హోటల్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా జనాభాలో 50 శాతం పట్టణాల్లోనే ఉంటున్నారని, 80 శాతం జీడీపీ వీటినుంచే వస్తోందని చెప్పారు. 2050 నాటికి పట్టణాల్లో నివాసం ఉండే జనాభా 75 శాతానికి చేరుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పట్టణాలు/నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనను విస్తృతం చేయాల్సి ఉందని, ఇందుకు పెట్టుబడులు అవసరం ఉందని తెలిపారు. దీనిపై ఎదురయ్యే సవాళ్లపై జీ-20 సదస్సు వర్కింగ్ గ్రూప్ మీటింగ్‌లో ఆయా దేశాల ప్రతినిధులు చర్చిస్తారన్నారు. సదస్సుకు 63 దేశాల ప్రతినిధులు రావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 57 మంది వచ్చారని చెప్పారు. వీరిలో జీ-20 దేశాలతో పాటు మరికొన్ని ఆహ్వాన దేశాల నుంచి ప్రతినిధులు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ప్రపంచ బ్యాంకుల నుంచి మరికొందరు హాజరవుతారన్నారు. సదస్సులో మొదటి రోజు నాలుగు, రెండో రోజు నాలుగు చొప్పున 8 సెషన్లు జరుగుతాయన్నారు. మంగళవారం వర్క్‌షాప్ అయ్యాక అతిథులకు గాలా డిన్నర్ ఉంటుందని, దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. 30న జీ-20 దేశాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఇందులో దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల ఆర్థికరంగ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. తమ దేశాల్లో విజయవంతమైన ప్రణాళికలు, ప్రాజెక్టులను వివరిస్తారన్నారు. 31న దేశంలోని వివిధ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల కమిషనర్లతో సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి వారితో పాటు విశాఖలోని యూనివర్సిటీల వీసీలు, ప్రొఫెసర్లు, విద్యార్థులు కూడా పాల్గొంటారని చెప్పారు.

పారిశ్రామిక అభివృద్ధిలో నూతన విప్లవం

2023-27 నూతన పారిశ్రామిక విధానం ఆవిష్కరణ

తొలిసారిగా పాతపాలసీ గడువు ముగియకముందే కొత్త విధానం ప్రకటన

- పారిశ్రామికవేత్తల సమక్షంలో ఆవిష్కరించిన మంత్రి
- పీపీపీ విధానంలో ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి
- ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు
- పరిశోధనలకు చేయూత, అంకుర పరిశ్రమలకు ప్రోత్సాహం
- పెట్టుబడిదారులకు పలు రాయితీలు
- ఎలాంటి ఆంక్షలు లేని పెట్టుబడుల వాతావరణం
- దుబాయ్ తరహాలో బెస్ట్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి
- తయారీ, పరిశ్రమల అనుబంధ రంగానికి భారీగా రాయితీలు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో నూతన విప్లవానికి తెరతీస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. 2023-27 సంవత్సరాలకు రూపొందించిన ఈ పాలసీని పారిశ్రామికవేత్తల సమక్షంలో ఆవిష్కరించడం విశేషం. పాత పాలసీ గడువు ముగియకముందే కొత్త పాలసీని ప్రకటించడం కూడా ఇదే తొలిసారి. సోమవారం విశాఖలో పారిశ్రామికవేత్తలతో కూడిన సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నూతన పారిశ్రామిక విధానాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా నిర్మాణాత్మక ఇండస్ట్రియల్ పాలసీని ప్రభుత్వం రూపొందించింది. నూతన విధానం పారిశ్రామికాభివృద్ధిలో విప్లవాన్ని సృష్టిస్తుందని పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 31తో పాత విధానం ముగియనుండటంతో ఏప్రిల్ 1 నుంచి నూతన పారిశ్రామిక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ సలహాదారు శ్రీధర్, ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవన్, జేడీ రామలింగరాజు, డైరెక్టర్ డా.జి. సృజన, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, సీఐఐ ఏపీ చాప్టర్ వైస్ చైర్మన్ డా.మురళీకృష్ణ, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

నంబర్ వన్ ఇండస్ట్రియల్ రాష్ట్రంగా ఏపీ : మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా, నంబర్ వన్ ఇండస్ట్రియల్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ముందడుగు వేస్తోంది. సాధారణంగా ప్రభుత్వాలు పాలసీ కాల పరిమితి పూర్తయినప్పటికీ కూడా కొత్త పాలసీని తేవడానికి కొంత సమయం తీసుకుంటాయి. దీనివలన పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపై ఈ పరిస్థితి ఉండకూడదని, పాత పాలసీ ముగియకముందే కొత్తది అమలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. నూతన విధానం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పనపై తనకున్న నిబద్ధతను సీఎం జగన్ చాటుకున్నారు. కొత్త పాలసీ రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తుంది. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన రంగాలకు పెద్దపీట వేశాం. పారిశ్రామిక రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్, వైద్య పరికరాల తయారీ, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధనవనరుల రంగాల్లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రానున్నాయి. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లో రూ.15 వేల కోట్ల జాయింట్ వెంచర్ ప్రారంభిస్తున్నాం. రాష్ట్రంలోని 974 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో పాటు, వీటిని ఆనుకుని సుమారు 48 వేల ఎకరాలలో పోర్టు ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారు. జల రవాణాను కూడా ప్రోత్సహిస్తున్నాం. పీపీపీ కింద ఇండస్ట్రియల్ పార్కులతో పాటు ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కుల్ని ఏర్పాటు చేస్తున్నాం. వాక్ టు వర్క్ కాన్సెప్ట్‌ని అన్ని పరిశ్రమలకు తీసుకొస్తాం. ఇన్నోవేషన్ రంగాన్ని ప్రోత్సహించేందుకు విశాఖలో ఐ స్పేస్ పేరుతో ఐకానిక్ టవర్ నిర్మించనున్నాం. నూతన పారిశ్రామిక విధానాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి తోడ్పడాలి.

నూతన విధానంలో ప్రధానాంశాలు..

- ▲ ప్లగ్ అండ్ ప్లే విధానానికి అనుగుణంగా పాలసీ
- ▲ వనరుల ఆధారంగా అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన
- ▲ వ్యాపారాన్ని సులభతరం చేయడం, పెద్ద ఎత్తున ఉపాధి కల్పన లక్ష్యం
- ▲ పరిశోధనలకు చేయూత, అంకుర పరిశ్రమలకు ప్రోత్సాహం
- ▲ తయారీ, అనుబంధ రంగాలు సహా అన్ని రకాల పరిశ్రమల పెట్టుబడిదారులకు పలు రాయితీలు
- ▲ ఎర్లీబర్డ్ పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు
- ▲ ఎలాంటి ఆంక్షలు లేని పెట్టుబడుల వాతావరణం
- ▲ లో కాస్ట్, లో రిస్క్ బిజినెస్
- ▲ పీపీపీ విధానంలో ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి
- ▲ ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు
- ▲ అంతర్జాతీయ కనెక్టివిటీ, తయారీ రంగంలో ఎకో సిస్టమ్
- ▲ దుబాయ్ తరహాలో బెస్ట్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి
- ▲ పర్యావరణ పరిరక్షణ, అన్ని జిల్లాల్లోనూ పారిశ్రామిక వికేంద్రీకరణ
- ▲ తొలిసారిగా ఆపరేషనల్ గైడ్‌లైన్స్‌లో భూ కేటాయింపులు, రద్దు మొదలైనవి

దుబాయ్ తరహాలో ఇండస్ట్రియల్ పార్క్ : స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవన్

ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడుల్ని ఆకర్షించడంతో పాటు అన్ని వర్గాల పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించే అత్యుత్తమ పారిశ్రామిక విధానమిది. పరిశ్రమల్ని ఏపీలోనే ఎందుకు ఏర్పాటు చేయాలి, ఇక్కడి ప్రత్యేకతలు, వనరులు మొదలైన అంశాలన్నీ తెలిసేలా నూతన విధానాన్ని రూపొందించాం. కొత్త పాలసీ ద్వారా వైజాగ్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఆవిష్కరణల్ని, స్టార్టప్‌లకు చేయూతనందిస్తాం. ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో ఆర్ అండ్ డీ సెంటర్స్‌ని ప్రోత్సహిస్తాం.

పాలసీ అద్భుతంగా ఉంది: సీఐఐ ఏపీ చాప్టర్ వైస్ చైర్మన్ డా.మురళీకృష్ణ

ప్రస్తుత పాలసీకంటే అద్భుతంగా కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. ఒక పారిశ్రామికవేత్త ఏం కోరుకుంటారో వాటన్నింటినీ ఇందులో పొందుపరిచారు.

లాజిస్టిక్స్ రంగానికి ప్రాధాన్యమివ్వడం అద్భుతం : శ్రవణ్ షిప్పింగ్ ఎండీ సాంబశివరావు

2023-27 పారిశ్రామిక విధానంలో అనేక నూతన అవకాశాలు, వనరులు, ప్రోత్సాహకాలు అందించారు. ఇది పారిశ్రామిక రంగానికి కొత్త ఊపిరి పోసినట్లే. దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్‌కు పరిశ్రమ హోదా ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం.

ఎంఎస్ఎంఈలకు పెద్ద పీట : ఏపీ చాంబర్స్ ప్రెసిడెంట్ పైడా కృష్ణప్రసాద్

నూతన విధానం అత్యధిక మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రోత్సహించేలా రూపొందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వడంతోపాటు ఎస్‌జీఎస్టీ 100 శాతం రీయింబర్స్‌మెంట్ మంచి సంకేతం.

పరిశ్రమలకు కావాల్సింది మౌలిక వసతులే: ఫ్యాప్సీ అధ్యక్షుడు కరుణేంద్ర

పరిశ్రమలు ఆర్థిక రాయితీలకంటే మౌలిక వసతుల కల్పనకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయి. దీనికి అనుగుణంగా నూతన పాలసీలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పారిశ్రామిక మౌలిక వసతులు, సులభతర వాణిజ్యంకు పెద్ద పీట వేయడాన్ని స్వాగతిస్తున్నాం.

పరిశ్రమలకు ఊతమిచ్చే పాలసీ : సీఐఐ ఏపీ చాప్టర్ చైర్మన్ ఎం.లక్ష్మీ ప్రసాద్

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చే విధంగా నూతన పారిశ్రామిక విధానం ఉంది. భారీ పరిశ్రమల నుంచి ఎంఎస్ఎంఈల వరకు పెట్టుబడులను ఆకర్షించే విధంగా పలు ప్రోత్సాహకాలను ప్రకటించారు. పరిశ్రమలకు చెందిన 96 అనుమతులు ఒకే చోట లభించేలా వైఎస్సార్ ఏపీ వన్ యాప్‌ను తేవడం హర్షణీయం. పోర్టు ఆధారిత వ్యాపారాభివృద్ధి, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రెడీ టు బిల్డ్ ఫ్యాక్టరీల నిర్మాణం, ప్రైవేటు రంగంలో పారిశ్రామిక పార్కుల అభివృద్ధి, స్టార్టప్‌ల కోసం ఐ-స్పేస్ పేరుతో టవర్ నిర్మాణం వృద్ధికి దోహదం చేస్తాయి.

క్లుప్తంగా...

టెన్నిస్, బాక్సింగ్ చాంపియన్లకు గవర్నర్ అభినందనలు

సాక్షి, అమరావతి: టెన్నిస్, బాక్సింగ్ చాంపియన్లను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభినందించారు. స్విస్ ఓపెన్-2023 పురుషుల డబుల్స్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ, ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాల విజేతలు నిఖత్ జరీన్(50 కేజీల విభాగం), స్వీటీ బూరా (81 కేజీల విభాగం), నీతు ఘంఘాస్, లవ్లీనా బోర్గోహైన్ (75 కేజీల విభాగం)లను గవర్నర్ ప్రశంసించారు. వీరు దేశ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేశారని గవర్నర్ కొనియాడినట్లు రాజ్‌భవన్ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు



ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ని కలిసిన సోము వీర్రాజు తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నేతృత్వంలోని ఆ పార్టీ నేతల బృందం సోమవారం కలిసింది. భేటీ అనంతరం సోము వీర్రాజు విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా నిరాకరించడం సరికాదంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానం ఉపసంహరింపజేసేలా ఆదేశించాలని గవర్నర్‌ను కోరినట్టు చెప్పారు. రాజకీయ దురుద్దేశంతోనే ఈ తీర్మానం చేసినట్లు ఉందని ఆరోపించారు.

సీజేకి సందేశాలు, ఈ మెయిల్స్ పంపితే చర్యలు

- అలా పంపినవారిని అనర్హులుగా ప్రకటిస్తాం
- ఉద్యోగ అభ్యర్థులకు హైకోర్టు హెచ్చరిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ జిల్లా కోర్టుల్లో పలు పోస్టుల భర్తీకి జారీచేసిన నోటిఫికేషన్లకు సంబంధించిన ఫలితాల విషయంలో కొందరు అభ్యర్థులు నేరుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)కి సందేశాలు, ఈ మెయిల్స్ పంపుతుండటంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. అలాంటి సందేశాలు, ఈ మెయిల్స్ పంపే అభ్యర్థులను పోస్టుల భర్తీకి పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది. అలాంటివారిని అనర్హులుగా ప్రకటిస్తామని హైకోర్టు రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) ఎస్.కమలాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త కోర్టుల ఏర్పాటు నేపథ్యంలో భర్తీచేసే పోస్టుల సంఖ్య పెరిగిందని, పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ కుదేలు: యనమల

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో సమస్యలను సృష్టించడమే కాకుండా ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసిందని టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అప్పు రూ.12.50 లక్షల కోట్లకు దాటిపోయిందని చెప్పారు. ప్రతి పౌరుడిపై సగటున రూ.5.50 లక్షల అప్పు భారాన్ని ప్రభుత్వం మోపిందన్నారు. అప్పులు భారీగా చేయడం వల్ల రెవెన్యూ వ్యయం పెరిగిపోతోందన్నారు. రాబోయే రోజుల్లో కేవలం వడ్డీల రూపంలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేయాల్సి రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వ సలహాదారుల జీతాలకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. వలంటీర్లకు ప్రజాధనం ఖర్చు చేయడం వలన ప్రభుత్వంపై అధికంగా రెవెన్యూ భారం పడుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా దెబ్బతిన్న ఈ సమయంలో కేంద్రం కలగజేసుకుని పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా సర్వనాశనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

మేం అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తాం: లోకేశ్

గోరంట్ల: టీడీపీ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చెప్పారు. ఆయన చేపట్టిన పాదయాత్ర సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని రెడ్డిచెరువుకట్ట, చలమయ్యగారిపల్లి, గోరంట్ల, గుమ్మయ్యగారిపల్లి గ్రామాల్లో కొనసాగింది. గుమ్మయ్యగారిపల్లి వద్ద బహిరంగసభలో లోకేశ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని ప్రజలు ఆదరించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు 2.3 లక్షల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగులను ఆదుకుంటానని హామీ ఇచ్చారని, గద్దెనెక్కిన తర్వాత ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదని ఆరోపించారు. పదో తరగతి ఫెయిలైన ముఖ్యమంత్రి పరిశ్రమలు ఎలా తెస్తాడని అన్నారు. వైఎస్సార్‌సీపీలో రాజారెడ్డి మార్కుతో కూడిన వర్గంతోపాటు ప్రజాస్వామ్యవాద లక్షణాలు ఉన్న ఎమ్మెల్యేలు ఉన్నారని, ఉండవల్లి శ్రీదేవి రెండో కోవకు చెందుతారని అన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో శంకరనారాయణ కుటుంబపాలన సాగిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

‘ఓటుకు కోట్లు 2.0’ ప్రకంపనలు

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు చేసిన ఓటుకు కోట్లు 2.0 కుంభకోణం ప్రకంపనలు రేపుతోంది. తననూ టీడీపీ నేతలు ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారని సోమవారం గుంటూరు (పశ్చిమ) ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కూడా వెల్లడించడం సంచలనం సృష్టించింది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటేయాలని.. టీడీపీ అగ్రనేతతో మాట్లాడిస్తామంటూ స్థానిక నేతలు తనను సంప్రదించారని మద్దాళి గిరిధర్ చెప్పారు. స్థానిక నేతలకు తాను స్పందించకపోవడంతో మాజీ ఎమ్మెల్సీ, చంద్రబాబు సన్నిహితుడు టీడీ జనార్దన్ ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించారని.. కానీ, తాను ఫోన్ లిఫ్ట్ చేయలేదన్నారు. కుట్రలు, కుతంత్రాలు, విలువల్లేని రాజకీయాలు చేసే చంద్రబాబు వైఖరి నచ్చక.. సీఎం వైఎస్ జగన్ సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన చూసి టీడీపీ వీడానని ఆయన స్పష్టంచేశారు. టీడీపీ అగ్రనేతల



మద్దాళి గిరిధర్‌కు ఫోన్ చేసిన టీడీ జనార్దన్ కాల్ లిస్ట్

నుంచి తనకు వచ్చిన ఫోన్‌కాల్ లిస్ట్‌ను ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ బహిర్గతం చేయడంతో టీడీపీ ప్రలోభాల పర్వం మరోసారి బట్టబయలైంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటేస్తే రూ.పది కోట్లు ఇస్తామంటూ తనను ప్రలోభపెట్టేందుకు ఉండి ఎమ్మెల్యే రామరాజు ప్రయత్నించారని ఎమ్మెల్యే రాపాక ఇప్పటికే వెల్లడించడం.. ఓటును అమ్ముకుంటే వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్లేనని భావించి ఆ ప్రతిపాదనను తిరస్కరించానని స్పష్టం చేసిన విషయం విదితమే. టీడీపీ ప్రలోభాలకు లొంగే ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిలు టీడీపీ అభ్యర్థికి క్రాస్ ఓటు చేశారన్నది స్పష్టమవుతోంది. గెలిచే బలం లేకున్నప్పటికీ.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించడాన్ని బట్టి చూస్తుంటే.. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలోనే ఓటుకు రూ.కోట్లు ఎరవేసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి చంద్రబాబు వ్యూహం రచించారని ఆదిలోనే వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఆ పార్టీ నేతలు చెప్పారు. టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధకు 23 ఓట్లు రావడాన్ని బట్టి చూస్తే.. ఆ పార్టీకి ఉన్న 19 మంది ఎమ్మెల్యేల కంటే అదనంగా నలుగురు ఓట్లేసినట్లు స్పష్టమవుతోంది. ఆ నలుగురికి ఒక్కొక్కరికి రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లు ఇచ్చి కొనుగోలు చేసినట్లు సజ్జల ఇప్పటికే స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రలోభాల పర్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రలోభాలు, కుట్రలు, కుతంత్రాలు బాబు నైజం..

ప్రజలకు మంచి చేసి.. వారి ఆశీస్సులతో అధికారంలోకి రావాలని చంద్రబాబు ఎప్పుడూ ఆలోచించరని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి.. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రలోభాల పర్వాన్నే ఆయన ఎంచుకున్నారని గుర్తుచేస్తున్నారు. కుట్రలు, కుతంత్రాల ద్వారానే అధికారంలోకి రావడంపైనే చంద్రబాబు ఆలోచన చేస్తారని వారు స్పష్టంచేస్తున్నారు. తెలంగాణలో 2015 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు కోట్లు ఎరవేసి ఎమ్మెల్యేను కొనుగోలు చేస్తూ.. ఆడియో వీడియో టేపులతో ఆ రాష్ట్ర ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చంద్రబాబు దొరికిపోవడాన్ని వారు గుర్తుచేస్తున్నారు.

కొనడం, అమ్మడమే ‘చంద్రబాబు’ రాజకీయం

- శ్రీదేవివి స్వార్థ రాజకీయాలు
- మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి,అమరావతి: చంద్రబాబు రాజకీయమంతా ఎమ్మెల్యేలను ‘కొనడం.. అమ్మడం’ అని, ఇది తప్పితే బాబు రాజకీయ జీవితంలో కనిపించిందేమీ లేదని మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజమెత్తారు. నయవంచన, నమ్మకద్రోహం, నటించడం, వెన్నుపోటే చంద్రబాబు గుణాలు అని మండిపడ్డారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ‘ఓటుకు కోట్లు’ రాజకీయంతో నాడు తెలంగాణలో ఎమ్మెల్యేలను కొంటూ అడ్డంగా దొరికారని, ఏపీలోనూ గతంలో 23 మందిని, ఇప్పుడు నలుగురు ఎమ్మెల్యేల్ని కొన్నారని, సంతలో పశువుల్లా కొనడమే ఆయన అవలక్షణం అని దుయ్యబట్టారు. ఓటుకు కోట్లు కేసులో దొరికిపోయి రాత్రికి రాత్రి విజయవాడకు వచ్చి కృష్ణానది గట్టున దాక్కున్నారని అన్నారు. ఆయన ఏనాడూ సొంతంగా పోటీ చేసి గెలవలేని అసమర్థుడని, 2004, 2019 ఎన్నికల పరాభవమే ఇందుకు నిదర్శనమని చెప్పారు.

ఉండవల్లి శ్రీదేవి నోటివెంట ‘బాబు’ చిలకపలుకులు

ఉండవల్లి శ్రీదేవివి స్వార్థ రాజకీయాలని నాని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో సీటు లేదని ఉండవల్లి శ్రీదేవికి ఏడాదిన్నర ముందే చెబితే అవమానంగా భావించారనటం హాస్యాస్పదమన్నారు. 2019 ఎన్నికల వరకు తాడికొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బాధ్యతలు నిర్వర్తించింది కత్తెర క్రిస్టినా అని, అభ్యర్థిగా శ్రీదేవిని నిలబెడదామని సీఎం జగన్ చెబితే, ఆయనపై ఉన్న అభిమానం, నమ్మకంతో క్రిస్టినా వెనక్కుతగ్గారని తెలిపారు. ఆ ఎన్నికల్లో క్రిస్టినా అన్ని రకాలుగా కష్టపడి శ్రీదేవిని గెలిపించారని, అందువల్లే ఆమెకు గౌరవప్రదంగా గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి దక్కిందని చెప్పారు.



పార్టీ జెండా కూడా మోయకుండా ఎన్నికలకు ముందు పార్టీలోకొచ్చి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ‘పాపం క్రిస్టినాని ఎంత అవమానించాను’ అని శ్రీదేవి ఆనాడు అనలేదేమని ప్రశ్నించారు. సీటు తనకొద్దని, క్రిస్టినాకి ఇవ్వమని ఎందుకు అనలేదని నిలదీశారు. ఏడాది ముందు నియోజకవర్గ ఇన్‌చార్జిని మారిస్తే ఎమ్మెల్యేను అవమానించినట్లా అని అన్నారు. తాడికొండ ఇన్‌చార్జిని మార్చి ఆర్నెల్లయిందని, ఇన్నాళ్లు శ్రీదేవి పార్టీ మీటింగుల్లో ఎమ్మెల్యేగా మొదటి వరసలోనే కూర్చొన్నారని చెప్పారు. పార్టీలో, కార్యకర్తల్లో ఆమె కాస్త బలహీనపడ్డారని సీఎం జగన్ నిజాయితీగా చెప్పడం తప్పనిపించిందా అని అన్నారు. చివరిదాకా అభ్యర్థి పరిస్థితేంటో చెప్పకుండా దొడ్డిదారిన వేరొకరికి బీ ఫారాలు ఇచ్చే చంద్రబాబు మాత్రమే శ్రీదేవికి సమర్థుడా అని ప్రశ్నించారు. ఈరోజు భయమేస్తుందని శ్రీదేవి అనడం చంద్రబాబు చెప్పిన చిలకపలుకులని విమర్శించారు.

కులాన్ని కాదు.. జనాన్ని నమ్ముకున్న వ్యక్తి సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏ ఒక్క కులాన్నీ నమ్ముకోలేదని, ప్రజల్ని మాత్రమే నమ్ముకున్నారని చెప్పారు. చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొన్నా, కొత్త నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోవడంలో ఓ పోరాటయోధుడిగా సీఎం జగన్ నిఖార్సైన రాజకీయం నడుపుతారన్నారు. యూనిక్ సీక్వెన్స్ ఓటింగ్‌తోనే క్రాస్ ఓటింగ్ దొంగలు దొరికారని చెప్పారు. టీడీపీ సభ్యులు పోలింగ్‌లో మూడు నుంచి ఏడో ప్రాధాన్యత వరకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఎందుకు ఓట్లేశారని అన్నారు. ఓటేయమని ఎవరూ అడగలేదని ఆనం రామనారాయణరెడ్డి అనటం పచ్చి అబద్ధమన్నారు. చీఫ్ విప్ ప్రసాద్ రాజును పిలిచి ఆనం మాట్లాడారని, తానే ప్రత్యక్ష సాక్షినని చెప్పారు.

ఎమ్మెల్యేల కొనుగోలు బాబుకు వెన్నతో పెట్టిన విద్య


మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు నారాయణస్వామి, రజని, రోజా, జయరాం, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వైనం అందరికీ తెలుసు
- మంత్రులు నారాయణస్వామి, రజిని, రోజా, జయరాం, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

చిలకలూరిపేట/విజయనగరం/శ్రీరంగరాజపురం (చిత్తూరు జిల్లా)/కర్నూలు(రాజ్‌విహార్)/పుత్తూరు రూరల్ (తిరుపతి జిల్లా): ఎమ్మెల్యేల కొనుగోలు, వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకు కొత్తేమీ కాదని, అవి ఆయనకు వెన్నతో పెట్టిన విద్యని మంత్రులు నారాయణస్వామి, విడదల రజిని, ఆర్కే రోజా, గుమ్మనూరు జయరాం, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మండిపడ్డారు. సోమవారం ఈ నేతలంతా వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. గతంలో ఎన్టీఆర్‌కు చంద్రబాబు ఎలా వెన్నుపోటు పొడిచారో అందరికీ తెలుసన్నారు. అలాగే ఓటుకు కోట్లు కేసును రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు చూశారని గుర్తు చేశారు. జగనన్న ఇచ్చిన అవకాశంతో ఉండవల్లి శ్రీదేవి ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ఆమె కరోనా బారినపడ్డప్పుడు సీఎం వైఎస్ జగన్ స్వయంగా శ్రీదేవి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించారని గుర్తు చేశారు. సీఎంవో అధికారులు కూడా నిరంతరం ఆమె ఆరోగ్యం పట్ల చొరవ తీసుకున్నారన్నారు. అలాంటి వ్యక్తిపై నిందలు వేయడం ఎంతవరకు సబబో శ్రీదేవి ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరారు. సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలు పశ్చాత్తాపం చెందకుండా పార్టీపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. శ్రీదేవి స్వలాభం కోసం అవినీతి, అక్రమాలకు పాల్పడుతుండటంతో తాడికొండ నియోజకవర్గ బాధ్యతలను వేరే వ్యక్తికి పార్టీ అధిష్టానం అప్పగించిందని తెలిపారు. పదవీ వ్యామోహంతో పార్టీలు మారే ఆనం రామనారాయణరెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు తన బినామీల కోసం యువత భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ పేరుతో కోట్లాది రూపాయల మోసానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. తాత్కాలిక సచివాలయ నిర్మాణ పనుల్లోనూ కమీషన్ల రూపంలో రూ.145 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు రూ.10 కోట్లు చొప్పున చంద్రబాబు ఆఫర్ ఇచ్చారన్నారు. అందుకు ఆకర్షితులైన నలుగురు ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లాగా కొనుగోలు చేశారని నిప్పులు చెరిగారు. చంద్రబాబు అమరావతిలో తాత్కాలిక రాజధాని పేరుతో రూ.500 కోట్లు దండుకున్నారని ఆరోపించారు. అలాగే నిరుద్యోగులకు శిక్షణ పేరుతో డమ్మీ కంపెనీ పెట్టించి రూ.371 కోట్లు తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్నారన్నారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఇంటర్వ్యూతో బాబు బండారం బయటపడిందని చెప్పారు. చంద్రబాబు డబ్బులకు అమ్ముడుపోయిన ఆ నలుగురికి నిజంగా విలువలు, దమ్ము ఉంటే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ విసిరారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ఏపీలో కేంద్ర ప్రాజెక్టులకు 52.36 శాతం పెరిగిన అంచనా వ్యయం

- రూ.53 వేల కోట్ల అదనపు భారం
- విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో కేంద్రం చేపట్టిన 56 ప్రాజెక్టుల అంచనా వ్యయం 52.36 శాతం పెరిగిందని కేంద్ర సహాయమంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్ తెలిపారు. తద్వారా అదనంగా రూ.53 వేల కోట్ల భారం పడిందని చెప్పారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రాజెక్టుల్ని అమలు చేసే కేంద్రసంస్థలు ఆన్‌లైన్ కంప్యూటరైజ్డ్ మానిటరింగ్ వ్యవస్థలో ఆయా ప్రాజెక్టుల నిర్మాణ పురోగతిని తెలిపే వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుంటాయని తెలిపారు. 2023 ఫిబ్రవరి నాటికి అందిన ఫ్లాష్ రిపోర్ట్ ప్రకారం ఏపీలో రూ.1,01,272 కోట్ల వాస్తవ అంచనా విలువతో ప్రారంభించిన 56 ప్రాజెక్టు పనుల అంచనా విలువ రూ.1,54,300 కోట్లకు పెరిగిందని చెప్పారు. వీటిలో 24 ప్రాజెక్టుల నిర్మాణం గడువులోగా పూర్తికాలేదన్నారు. ప్రాజెక్టులను గడువులోగా పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలవరం అంచనా వ్యయం పెరిగింది పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.10,151 కోట్ల నుంచి రూ.55,548 కోట్లకు పెరిగిందని మంత్రి చెప్పారు. ఫిబ్రవరి 2009లో రూ.10,151 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ప్రాజెక్టు పూర్తికావడానికి 2014 ధరలకు అనుగుణంగా సవరించిన అంచనాల ప్రకారం రూ.55,548 కోట్లు వ్యయం చేయాల్సి ఉందన్నారు. అంటే 2009లో నిర్ణయించిన అంచనా వ్యయం కంటే రూ.45,397 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉన్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో విశాఖ రిఫైనరీ ఆధునికీకరణ ప్రాజెక్టుకు రూ.20,928 కోట్లు వ్యయం అవుతుందని 2020 జూలైలో అంచనా వేయగా సవరించిన అంచనా వ్యయం రూ.26,264 కోట్లకు చేరిందని, రూ.5,336 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ప్రాజెక్టును రూ.2,500 కోట్ల అంచనా వ్యయంతో 2027 మార్చి నాటికి పూర్తిచేసేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోందని మంత్రి తెలిపారు.

ఏపీలో 15 ఆశావహ మండలాలు

కేంద్రం ప్రవేశపెట్టిన ఆశావహ మండలాల అభివృద్ధి కార్యక్రమం కింద ఏపీలో 7 జిల్లాల పరిధిలో 15 మండలాలను ఎంపిక చేసినట్లు రావ్ ఇందర్‌జిత్ సింగ్ తెలిపారు. కర్నూలు జిల్లాలోని చిప్పగిరి, మద్దికెర, హోళగుంద, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై.రామవరం, మారేడుమిల్లి, గంగవరం, అన్నమయ్య జిల్లాలోని కురబలకోట, లక్కిరెడ్డిపల్లె, కోడూరు, వైఎస్సార్ జిల్లాలోని చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు, ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు, ప్రకాశం జిల్లాలోని ఎర్రగ్రొండపాలెం, పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని మండలాల్లో ఆశావహ మండలాల అభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు.

అనంతపురంలో బంగారుగనులు

అనంతపురంలోని బొక్సంపల్లిలో బంగారు గనుల్ని గుర్తించినట్లు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఏపీలోని బొక్సంపల్లి (బంగారం), అద్దంకివారిపాలెం ఐరన్ ఓర్ బ్లాక్, లక్ష్మక్కపల్లె సౌత్ ఐరన్ ఓర్, లక్ష్మక్కపల్లె నార్త్ ఐరన్‌ఓర్ ఖనిజ నిక్షేపాలను తాజాగా గుర్తించామని వివరించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు జవాబిచ్చారు. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా ఖాదీ ఉత్పత్తుల అమ్మకాలు 2017-18లో రూ.2,510.21 కోట్లు ఉండగా 2021-22 నాటికి రూ.5,051.72 కోట్లకు చేరాయని కేంద్ర సహాయమంత్రి భానుప్రతాప్‌సింగ్ వర్మ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

లోక్‌సభ

ఏపీలో 23 జిల్లా స్కిల్ కమిటీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో 23 జిల్లా స్కిల్‌కమిటీలు ఉన్నాయని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. లోక్‌సభలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు చింతా అనూరాధ, సంజీవ్‌కుమార్ ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

కోవిడ్-19 ప్రభావంపై అధ్యయనం

దేశ ఆర్థికపరిస్థితిపై కోవిడ్-19 ప్రభావంపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. తద్వారా ఆర్థిక పరిస్థితి పెంపునకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీలు వంగా గీతావిశ్వనాథ్, ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

నకిలీ కరెన్సీ సీజ్

నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం 2017లో రూ.28.10 కోట్లు, 2020లో రూ.92.18 కోట్లు నకిలీ కరెన్సీ సీజ్ చేసినట్లు కేంద్ర మంత్రి పంకజ్ చౌధరి.. ఎంపీ బి.వి.సత్యవతి ప్రశ్నకు జవాబిచ్చారు. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ ఇన్‌స్క్రిప్షన్ ప్రాసెస్‌లో ముందస్తు షరతులో భాగంగా లేపాక్షి దేవాలయాన్ని 2022 తాత్కాలిక జాబితాలో చేర్చినట్లు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

జిల్లా వార్తలు

త్వరలో భక్తజన దర్బార్


దుర్గగుడి పాలక మండలి సమావేశం వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు

- భక్తులు నేరుగా దుర్గగుడి చైర్మన్‌ను కలిసే అవకాశం
- ఆలయంలోని వివిధ ప్రాంతాల్లో సలహాల బాక్స్‌లు
- నెలకో దఫా భక్తుల సూచనలపై ఈఓతో చర్చ
- పలు అంశాలకు పాలక మండలి ఆమోదం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో కల్పించాల్సిన సదుపాలపై భక్తులు తమ అభిప్రాయాలను పంచుకునేందుకు త్వరలో భక్తజన దర్బార్ నిర్వహించనున్నట్లు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వారానికి ఒక దఫా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాలక మండలి సమావేశం మహా మండపం నాలుగో అంతస్తులోని బోర్డు మీటింగ్ హాల్‌లో సోమవారం జరిగింది. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. కొన్ని అంశాలకు పాలక మండలి ఆమోదం తెలిపింది. ఇంకొన్నింటిని వాయిదా వేయడంతో పాటు మరి కొన్నింటిని పరిశీలన నిమిత్తం పెండింగ్‌లో ఉంచింది. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ సమావేశం అనంతరం చైర్మన్ రాంబాబు మీడియాతో మాట్లాడారు. అమ్మవారి ఆలయంలోని పలు కీలక ప్రాంతాల్లో భక్తుల నుంచి సూచలు, సలహాలు స్వీకరించేందుకు ప్రత్యేకంగా బాక్సులు ఏర్పాటు చేస్తామన్నారు. కేశఖండన శాల, నిత్యాన్నదానం, కనకదుర్గనగర్ ప్రసాదాల కౌంటర్, పాలక మండలి చైర్మన్ కార్యాలయం ఎదుట ఈ బాక్స్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ బాక్సుల్లో భక్తులు ఎవరైనా తమ సూచనలు, సలహాలను నమోదు చేసిన చీటీలను వేయొచ్చని సూచించారు. వీటిపై నెలకోసారి ఈఓ, చైర్మన్ సంయుక్తంగా చర్చించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. వారానికి ఒక సారి భక్తులు నేరుగా చైర్మన్‌ను కలిసి ఇబ్బందులు, మెరుగైన సదుపాయాల కల్పన గురించి వివరించే అవకాశాన్ని భక్తజన దర్బార్‌లో కల్పిస్తామని తెలిపారు. పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీ కృష్ణ, కేసరి నాగమణి, దేవిశెట్టి బాలకృష్ణ, నంబూరి రవి, చింకా శ్రీనివాస్, నిడమానూరి కల్యాణి, కొలుకలూరి రామసీత, అనుమోలు ఉదయలక్ష్మి, అల్లూరి కృష్ణవేణి, తొత్తడి వేద కుమారి, బుద్దా రాంబాబు, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమా, ఏఈఓ ఎన్.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యాంశాలు ఇవీ..

- దేవస్థానంలో కొత్త లడ్డూ పోటు భవనాన్ని జీ+4 పద్ధతిలో రూ.27 కోట్ల అంచనాతో నిర్మించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది.
- రూ.3.80 లక్షల అంచనాలతో కేశఖండన శాలలో మరమ్మతులకు ఆమోదం తెలిపింది.
- అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొనే ఉభయదాతలకు ఒక లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించాలన్న అంశాన్ని పాలక వర్గం ఆమోదించింది.
- అమ్మవారి లడ్డూ ప్రసాదం దిట్టం, ధర పెంపుపై దేవదాయ శాఖ మంత్రితో సంప్రదించిన అనంతరం చర్చించాలని నిర్ణయం తీసుకుంది.
- కొండపైన, దిగువన కెనరా బ్యాంక్ ఏటీఎంలు ఏర్పాటు చేసే అంశాన్ని పాలక వర్గం వాయిదా వేసింది.
- కొండ దిగువన అన్నదానం భవనం నిర్మాణం టెండరుపై నిర్ణయాన్ని వాయిదా వేసింది.
- దుర్గాఘాట్‌లో చెప్పుల స్టాండ్, క్లోక్‌రూమ్, దుస్తులు మార్చుకునేందుకు గదుల నిర్మాణ పనుల్లో తక్కువ రేటుకు దాఖలైన టెండర్ ఖరారుకు పాలక వర్గం ఆమోదం తెలిపింది.
- అమ్మవారి ప్రధాన ఆలయంలో పాటు దత్తత ఆలయాల్లో తాత్కాలిక విద్యుత్ అలంకరణ పనుల ఆమోదం అంశాన్ని పాలకవర్గం వాయిదా వేసింది.
- అమ్మవారి ఆలయ స్థల పురాణంపై డాక్యుమెంటరీ నిర్మించేందుకు రూ.3 లక్షలు కేటాయిస్తూ పాలక వర్గం ఆమోదం తెలిపింది.
- అమ్మవారి ఉత్సవ మూర్తులకు బంగారపు మకర తోరణం తయారు చేయించేందుకు అజెండాలో పొందుపరచగా ఆమోదించింది.
- నూతన వధూవరులు పెళ్లి బట్టలపై అమ్మవారి దర్శనానికి వస్తే ఉచితంగా అంతరాలయ దర్శనం కల్పించాలని పాలక వర్గం నిర్ణయించింది.
- కనకదుర్గనగర్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటుకు పాలక వర్గం ఆమోదం తెలిపింది.
- అన్ని క్యూలైన్ల ప్రారంభం వద్ద భక్తులను తనిఖీ చేసేందుకు మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.
- భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో దేశీయ, పాశ్చాత్య పద్ధతుల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.
- కేశఖండనశాలపై పర్యవేక్షణ ఉండేలా ఏఈఓను నియమించడంతో పాటు సూపరింటెండెంట్ స్థాయి అధికారి ఒకరు, పాలక వర్గం నుంచి ఒక సభ్యుడు, సీసీ కెమెరా విభాగం నుంచి ఓ సభ్యుడితో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది.
- దుర్గగుడి సిబ్బంది అందరికీ డ్రెస్‌కోడ్ తప్పనిసరి చేసి, దేవస్థానం తరపున రెండు జతల యూనిఫాం ఉచితంగా ఇవ్వాలన్న నిర్ణయానికి ఆమోదం తెలిపింది.
- కనకదుర్గనగర్‌లోని దుకాణదారులు చెల్లించాల్సిన బకాయిలను జమచేస్తే వారి ఇబ్బందులపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది.

30న భవానీ ద్వీపంలో శ్రీరామ నవమి వేడుకలు

సాక్షి, అమరావతి: విజయవాడలోని భవానీద్వీపంలో ఈ నెల 30వ తేదీన శ్రీరామనవమి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆ రోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీతారాముల కల్యాణం, సాయంత్రం ఐదు గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొంది. భక్తులు ఎటువంటి అదనపు రుసుం చెల్లించకుండా సాధారణ బోటింగ్ టికెట్ ద్వారానే ఈ వేడుకల్లో పాల్గొనొచ్చని సూచించింది.

వైఎస్సార్ ఐఏఎల్ సిబ్బందికి శిక్షణ


ఏఓ, ఏఈఓలకు శిక్షణ ఇస్తున్న అధికారి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోగల భూసార పరీక్ష కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ (ఐఏఎల్) సిబ్బందికి సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ డివిజన్ల పరిధిలో ఉన్న వైఎస్సార్ ఐఏఎల్‌లలో పని చేస్తున్న ఏఓ, ఏఈఓలకు భూసార, నీటి విశ్లేషణ పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా డీఏఓ ఎస్.నాగమణెమ్మ, ఏడీఏ ఎస్‌టీఎల్ (గొల్లపూడి) బి.పద్మజ పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామి ఆదాయం రూ.28 లక్షలు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రిలో వేంచేసి ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా రూ.28,32,257 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ నాగరాజు తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో మూడు నెలల 12 రోజులకు గానుపై ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ లెక్కింపులో కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్ పాల్గొన్నారు.

చోరీ నింద భరించలేక బాలిక ఆత్మహత్య

పెనమలూరు: ఇంటి యజమాని దొంగతనం నింద మోపారనే మనస్తాపంతో ఆ ఇంట్లో పనిచేసే బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కాకర్ల గ్రామంలో జరిగింది. సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు... శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం చల్లపేటరాజాం గ్రామానికి చెందిన గుంపా అప్పారావు, పెంటమ్మ దంపతులకు శ్రావణి, నాని అనే ఇద్దరు పిల్లలు. కొద్ది సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో పోషణ భారమై పెంటమ్మ రెండేళ్ల కిందట తెలిసిన వ్యక్తి రాము ద్వారా కుమార్తె శ్రావణిని పోరంకిలో కాకర్ల రామకృష్ణ ఇంట్లో పనికి పెట్టింది. ఇటీవల రామకృష్ణ తన ఇంట్లో డబ్బు పోయిందని శ్రావణి(11)ని తీవ్రంగా మందలించాడు. ఈ విషయాన్ని ఆదివారం తల్లికి చెప్పుకొని బాధపడింది. తరువాత కొద్ది సేపటికి రామకృష్ణ పెంటమ్మకు ఫోన్ చేసి శ్రావణికి ఆరోగ్యం బాగోలేదని వెంటనే రావాలని సూచించాడు. పెంటమ్మ సోమవారం రాగా శ్రావణి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఇంటి యజమాని దొంగతనం అంటకట్టి తన బిడ్డ చావుకు కారణమయ్యాడని పెంటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.


శ్రావణి మృతదేహం

నేడు కోటి రుద్రాక్ష అభిషేకం


అభిషేకానికి సిద్ధం చేసిన రుద్రాక్షలను పరిశీలిస్తున్న గౌతంరెడ్డి, గజల్ శ్రీనివాస్


ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని ముత్యాలంపాడులో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం కోటి రుద్రాక్షలతో అభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మందిరం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, గజల్ శ్రీనివాస్ ఏర్పాట్లను సోమవారం స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. కోటి రుద్రాక్షలతో అభిషేకానికి విశాఖ శ్రీ శారద పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామితో పాటు పలువురు యతీశ్వరులు, అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్, డెప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రులు జోగి రమేష్, అంబటి రాంబాబు, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొంటారని, అందుకు తగినట్లు ఏర్పాట్లు పూర్తిచేశామని గౌతంరెడ్డి తెలిపారు. కోటి రుద్రాక్ష అభిషేకం ఏర్పాట్లలో భాగంగా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. బాబాను దర్శించుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లతో పాటు ఉదయం పది గంటల నుంచి లక్ష మందికి అన్నసంతర్పణ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యే శ్రీదేవి భర్త శ్రీధర్ వేధిస్తున్నారు

- నెల్లూరు జిల్లాకు చెందిన ఆక్వా రైతు రమణయ్య ఆరోపణ

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): గుంటూరు జిల్లా తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి భర్త డాక్టర్ కమ్మెల శ్రీధర్ తనపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని నెల్లూరు జిల్లా గూడూరు పట్టణానికి చెందిన ఆక్వా రైతు రాయపనేని రమణయ్య ఆరోపించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పాలవాయి ప్రసన్నలక్ష్మి, శేషారావు దంపతులు తనకు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యారని, సెంట్రల్ వేర్‌హౌస్‌లో నామినేటెడ్ పదవి ఇప్పిస్తానంటూ నమ్మించి తన వద్ద రూ.1.5 కోట్లు తీసుకున్నారని రమణయ్య పేర్కొన్నారు. తనను నమ్మించేందుకు వారు 2017 డిసెంబర్ 27న తనను ఢిల్లీ తీసుకువెళ్లి అక్కడ కొందరితో మాట్లాడించారని చెప్పారు. అదే సమయంలో తనకు పరిచయమున్న భవానీస్వామి ఫోన్ చేసి తాను కూడా ఢిల్లీలోనే ఉన్నానని, తన స్నేహితుడు డాక్టర్ కమ్మిలి శ్రీధర్‌కు పద్మశ్రీ అవార్డు కావాలని తనను కలిశారని వివరించారు. తాను వారికి ప్రసన్నలక్ష్మి, శేషారావును పరిచయం చేశానన్నారు. ప్రసన్నలక్ష్మి, శేషారావుతో డాక్టర్ కమ్మిలి శ్రీధర్ మాట్లాడి పద్మశ్రీ అవార్డు కోసం రూ.1.5 కోట్లకు ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు. 2017 జనవరి 29న అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు ఇచ్చారని, ఆ సమయంలో ష్యూరిటీ కోసం ప్రసన్నలక్ష్మి, శేషారావు వద్ద చెక్కులు లేకపోవడంతో తాను మూడు చెక్కులను శ్రీధర్‌కు ఇచ్చానని పేర్కొన్నారు. అనంతరం ప్రసన్నలక్ష్మి చెక్కులు ఇవ్వగా వాటిని శ్రీధర్‌కు ఇచ్చి తన చెక్కులు తిరిగి ఇవ్వాలని కోరగా తరువాత ఇస్తానంటూ దాటవేశారని పేర్కొన్నారు. అదే సమయంలో ఎమ్మెల్యే శ్రీదేవి రెండు నెలల్లో తిరిగి ఇస్తానంటూ తన వద్ద రూ.12 లక్షలు చేబదులుగా తీసుకున్నారని తెలిపారు. గడువు తీరినా డబ్బులు తిరిగి ఇవ్వలేదని ఆరోపించారు. తాను డబ్బులు అడిగితే పద్మశ్రీ అవార్డు కోసం తాను పరిచయం చేసిన వ్యక్తులు మోసం చేశారంటూ సమాధానం చెప్పారని పేర్కొన్నారు. తాను ఇచ్చిన చెక్కుల్లో ఒకదానిని బ్యాంక్‌లో వేశారని, సంతకం తేడా ఉండటంతో అది రిజెక్టు అయ్యిందని చెప్పారు. తనకు జరిగిన మోసంపై గూడూరు ఒకటో పట్టణం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. దీంతో డాక్టర్ కమ్మిలి శ్రీధర్ తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు చెక్కు బౌన్స్ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. డాక్టర్ శ్రీధర్‌పై సీఐడీ విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని రమణయ్య విజ్ఞప్తిచేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమణయ్య



మళ్లీ మెరిసిన క్రిస్టియానో రొనాల్డో

యూరో–2024 క్వాలిఫయింగ్ టోర్నీలో మాజీ విజేత పోర్చుగల్ వరుసగా రెండో విజయం సాధించింది. గ్రూప్ 'జె'లో భాగంగా లక్సెంబర్గ్‌తో మ్యాచ్‌లో పోర్చుగల్ 6–0తో గెలిచింది. పోర్చుగల్ తరఫున 198వ మ్యాచ్ ఆడిన కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో (6వ, 31వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన క్రీడాకారుల జాబితాలో ప్రస్తుతం రొనాల్డో 122వ గోల్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. లిష్టెన్‌స్టయిన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనూ రొనాల్డో రెండు గోల్స్ చేశాడు.



రాజస్తాన్ రాయల్స్ జట్టులో సందీప్ శర్మ

పేస్ బౌలర్ సందీప్ శర్మకు ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆడే అవకాశం లభించింది. గాయం కారణంగా ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీకి దూరమైన రాజస్తాన్ రాయల్స్ జట్టు ప్రధాన పేసర్ ప్రసిధ్ కృష్ణ స్థానంలో సందీప్ శర్మను తీసుకున్నారు. 2013 నుంచి ఐపీఎల్ ఆడుతున్న 29 ఏళ్ల సందీప్ శర్మను ఈ సీజన్ కోసం వేలంలో ఎవరూ కొనుగోలు చేయలేదు. అయితే ప్రసిధ్ గాయంతో వైదొలగడంతో సందీప్‌కు అవకాశం దక్కింది. గతంలో పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడిన సందీప్ 104 మ్యాచ్‌ల్లో 114 వికెట్లు పడగొట్టాడు.

ఆంధ్ర టు డచ్ వయా ఆక్లాండ్...

- అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదిగిన తేజ నిడమనూరు
- నెదర్లాండ్స్ జట్టులో కీలక సభ్యుడిగా గుర్తింపు

ఆ కుర్రాడు చిన్నప్పటి నుంచి ఆటలను విపరీతంగా ఇష్టపడ్డాడు. వయసు పెరుగుతున్న కొద్దీ ఆటగాడిగా మారాలనే కోరిక కూడా పెరుగుతూ వచ్చింది. సొంత ఊరు వదిలినా, దేశాలు మారినా ఆ ఆలోచన మనసు లోంచి పోలేదు. అన్ని రకాల క్రీడలూ ప్రయత్నించిన తర్వాత క్రికెట్ వద్ద అతను ఆగాడు. అందులోనే అగ్ర స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆపై దానిని చేరుకునేందుకు అన్ని రకాలుగా శ్రమించాడు. ఆ క్రమంలో ఎన్నో అవరోధాలు ఎదురైనా ఎక్కడా ఆశ కోల్పోలేదు. చివరకు తాను పుట్టిన, పెరిగిన దేశం కాకుండా ఉపాధి కోసం వెళ్లిన మూడో దేశం తరఫున జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అంతర్జాతీయ క్రికెటర్‌గా ముద్ర వేయించుకొని సగర్వంగా నిలిచాడు. అతని పేరే అనిల్ తేజ నిడమనూరు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పుట్టి న్యూజిలాండ్‌లో పెరిగి ఇప్పుడు నెదర్లాండ్స్ జట్టుకు అంతర్జాతీయ మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహిస్తున్న తేజపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



సాక్షి, హైదరాబాద్:నెదర్లాండ్స్ క్రికెట్ టీమ్‌లో ఇప్పుడు తేజ నిడమనూరు కీలక సభ్యుడు. గత వారం జింబాబ్వేతో జరిగిన తొలి వన్డేలో అజేయ సెంచరీలతో అతను జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. గత ఏడాది మేలో తొలిసారి జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతను ఇప్పటి వరకు 11 వన్డేలు, 6 టి20లు ఆడాడు. దక్షిణాఫ్రికాతో శుక్ర, ఆదివారాల్లో జరిగే వన్డే మ్యాచ్‌లకు తేజ ప్రస్తుతం సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలో తేజ తన కెరీర్‌కు సంబంధించిన పలు విషయాలను 'సాక్షి'తో పంచుకున్నాడు. క్రికెటర్‌గా ప్రాథమికాంశాలు నేర్చుకోవడం మొదలు అవకాశాల కోసం యూరోప్ దేశం చేరడం వరకు అతని ప్రస్థానంలో అనేక మలుపులున్నాయి.

అలా మొదలైంది...

తేజ స్వస్థలం విజయవాడ. తేజ తల్లిదండ్రులు పాండురంగారావు, పద్మావతి మెరుగైన ఉపాధి అవకాశాల కోసం న్యూజిలాండ్‌కు వలస వెళ్లారు. దాంతో 2001లో ఏడేళ్ల వయసులో తేజ కొత్త జీవితం కూడా అక్కడే ప్రారంభమైంది. పాఠశాలలో చదువుతున్న సమయంలోనే భిన్నమైన ఆటల్లో తేజ రాణించాడు. ముఖ్యంగా కివీస్ అభిమాన క్రీడ రగ్బీలో కూడా అతను పట్టు సంపాదించాడు. అయితే అనుకోకుండా క్రికెట్‌పై కలిగిన ఆసక్తి పూర్తిగా ఈ క్రీడ వైపు మళ్లేలా చేసింది. ఆక్లాండ్‌లో తల్లి పని చేస్తున్న సంస్థ పక్కనే ప్రఖ్యాత 'కార్న్‌వాల్ క్రికెట్ క్లబ్' ఉంది. న్యూజిలాండ్‌లో అతి పెద్ద క్లబ్‌లలో ఒకటైన ఇక్కడే పలువురు దిగ్గజ క్రికెటర్లు మార్టిన్ క్రో, గ్రేట్‌బ్యాచ్, ఆడమ్ పరోరె తమ ఆటను మొదలు పెట్టారు. ఈ క్లబ్‌లో రోజూ క్రికెట్ చూస్తూ తేజ కూడా ఆకర్షితుడయ్యాడు. దాంతో తల్లిదండ్రులు అతడిని ఇందులో చేర్పించారు. ఆపై అతని క్రికెట్ సాధన మొదలైంది. చురుకైన ఆటతో వేగంగా పట్టు పెంచుకున్న తేజ స్థానిక లీగ్‌లలో సత్తా చాటడంతో వరుస అవకాశాలు వచ్చాయి. ఇదే క్రమంలో ఆక్లాండ్ 'ఎ' టీమ్‌లో అతను చోటు దక్కించుకున్నాడు. అక్కడా స్థానం లభించడంతో ఆక్లాండ్ సీనియర్ టీమ్‌లోకి ఎంపికయ్యాడు. 'క్రికెట్‌ను ఎంచుకున్న తర్వాత ఎక్కడా నేను ఉదాసీనతకు చోటు ఇవ్వలేదు. పూర్తి స్థాయిలో ప్రొఫెషనల్ క్రికెటర్ కావాలని గట్టిగా నిర్ణయించుకొని సుదీర్ఘ సమయాల పాటు ప్రాక్టీస్ చేస్తూ ఒకే లక్ష్యంతో సాగాను. నా ప్రదర్శనపై ప్రశంసలు రావడం, పలువురు ప్రోత్సహించడంతో భవిష్యత్తుపై స్పష్టత వచ్చింది' అని తేజ చెప్పాడు.

అవకాశాలు దక్కకపోవడంతో...

అయితే ఆటలో ఎదుగుతున్న కొద్దీ తేజకు ఊహించని పరిణామాలు ఆక్లాండ్‌లో ఎదురయ్యాయి. కేవలం అంకెలు, రికార్డులు మాత్రమే మెరుగైన అవకాశాలు కల్పించలేవని అతనికి అర్థమైంది. సీనియర్లు టీమ్‌లో పాతుకుపోవడం, వేర్వేరు కారణాల వల్ల అతనికి పూర్తి స్థాయిలో తన సత్తా చాటే అవకాశం రాలేదు. అయితే ఆటకు విరామం మాత్రం ఇవ్వరాదని పట్టుదలగా భావించడంతో మరో ప్రత్యామ్నాయం కోసం చూడాల్సి వచ్చింది. ముందుగా ఇంగ్లండ్ కౌంటీ డర్హమ్ మైనర్ లీగ్‌లలో అడుగు పెట్టిన తేజ ఆ తర్వాత నెదర్లాండ్స్‌లో లీగ్‌లు ఆడేందుకు ఆరు నెలల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే ఒప్పందం ప్రకారం నిర్ణీత సమయం ముగిసిన తర్వాత మళ్లీ కివీస్‌కు వెనక్కి వచ్చేయాల్సి వచ్చింది. ఇలాంటి స్థితిలోనూ క్రికెట్‌ను వదలకూడదనుకున్నాడు.



> అంతర్జాతీయ క్రికెటర్ కావాలనే ఏకైక లక్ష్యంతో అన్ని ప్రయత్నాలూ చేశాను. ఇందు కోసం చాలా కష్టపడ్డా. ఏదీ సునాయాసంగా దక్కలేదు. ఎన్నో అవాంతరాలు ఎదురైనా పట్టుదలగా నిలబడ్డా. న్యూజిలాండ్‌లో నా 16 ఏళ్ల వయసులోనే అమ్మానాన్న భారత్‌కు వెనక్కి వచ్చేశారు. నేను కూడా రావాల్సి ఉండగా, కెరీర్‌ను నిర్మించుకుంటున్న దశలో రాలేనని చెప్పా. అప్పటి నుంచి అన్నీ నేనే సొంతంగా చేసుకున్నా. పార్ట్‌టైమ్ జాబ్‌లు చేస్తూ క్రికెట్‌ను మాత్రం వదల్లేదు. ఎవరి అండ లేకపోయినా, డచ్ భాష రాకపోయినా మొండిగా నెదర్లాండ్స్‌లో అడుగు పెట్టా. ఇదంతా నా స్వయంకృషి. ఈ ఏడాది జూన్‌లో జరిగే వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో రాణించి మా జట్టు ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తే భారత్‌లో ఆడే అవకాశం వస్తుంది. అదే జరిగితే నా కెరీర్‌లో గొప్ప క్షణం అవుతుంది. అందు కోసం ఎదురు చూస్తున్నా
>
> –'సాక్షి'తో తేజ నిడమనూరు

సరైన దిశలో...

నెదర్లాండ్స్‌లో గతంలో ఆడిన అనుభవం సరైన సమయంలో తేజకు పనికొచ్చింది. అక్కడే ఉండి పూర్తి స్థాయిలో క్రికెట్ ఆడితే భవిష్యత్తులో పైకి ఎదగవచ్చని అర్థమైంది. అయితే అలా చేయాలంటే ముందు అక్కడ ఒక ఉద్యోగంలో చేరాలి. దాంతో తాను చేసిన స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ డిగ్రీతో ఉద్యోగ ప్రయత్నం చేశాడు. అయితే అతని అర్హత ప్రకారం కాకుండా మరో రూపంలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా 'స్టార్ట్‌ఎక్స్' కంపెనీలో ఉద్యోగం వచ్చింది. 2019 మే నెలలో తేజ నెదర్లాండ్స్ గడ్డపై చేరాడు. నిబంధన ప్రకారం జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపిక కావాలంటే కనీసం మూడేళ్లు నివాసం ఉండాలి. అయితే కొద్ది రోజులకే 'కరోనా' వచ్చి ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. ఆటను తీసి కొంత కాలం గట్టున పెట్టాల్సి వచ్చింది! ఇలాంటి స్థితిలో మరోసారి క్రికెట్ కెరీర్ సందేహంలో పడింది. అయినా సరే, తేజ వెనక్కి తగ్గలేదు. ఒకవైపు ఉద్యోగం, మరోవైపు క్రికెట్ ఆడుతూ వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. సెలక్షన్ టోర్నీల్లో సత్తా చాటి ఎట్టకేలకు జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. 2022 ఏప్రిల్‌లో మూడేళ్లు ముగియగా, మే 31న ఆమ్‌స్టెల్‌వీన్‌లో వెస్టిండీస్‌తో తొలి వన్డే ఆడటంతో అతని స్వప్నం సాకారమైంది. 51 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో అజేయంగా 58 పరుగులు చేసిన తేజ అంతర్జాతీయ కెరీర్‌ను ఘనంగా మొదలు పెట్టాడు.

శ్రీజ 'ట్రిపుల్' ధమాకా

- మహిళల సింగిల్స్, డబుల్స్, టీమ్ విభాగాల్లో టైటిల్స్ సొంతం
- జాతీయ టీటీ చాంపియన్‌షిప్



జమ్మూ: మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ జాతీయ సీనియర్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో మూడు విభాగాల్లో టైటిల్స్ సొంతం చేసుకుంది. సోమవారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తరఫున పోటీపడిన శ్రీజ మహిళల సింగిల్స్ విభాగంలో టైటిల్ నిలబెట్టుకోగా... డబుల్స్ విభాగంలో తన భాగస్వామి దియా చిటాలెతో కలిసి విజేతగా నిలిచింది. మహిళల టీమ్ ఈవెంట్‌లో శ్రీజ, దియా, అహిక ముఖర్జీలతో కూడిన ఆర్‌బీఐ జట్టు టైటిల్ సాధించింది. సింగిల్స్ ఫైనల్లో శ్రీజ 9–11, 14–12, 11–7, 13–11, 6–11, 12–10తో సుతీర్థ ముఖర్జీ (పశ్చిమ బెంగాల్)పై గెలిచి రూ. 2 లక్షల 75 వేల ప్రైజ్‌మనీని దక్కించుకుంది. డబుల్స్ ఫైనల్లో శ్రీజ–దియా ద్వయం 11–7, 11–7, 8–11, 14–12తో స్వస్తిక ఘోష్–శ్రుతి అమృతే (మహారాష్ట్ర) జోడీని ఓడించింది. టీమ్ ఫైనల్లో ఆర్‌బీఐ 3–2తో తమిళనాడును ఓడించింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో మొహమ్మద్ అలీ–వంశ్ సింఘాల్ (తెలంగాణ) జోడీ 6–11, 7–11, 6–11తో జీత్ చంద్ర–అంకుర్ భట్టాచార్య (పశ్చిమ బెంగాల్) జంట చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది.

హంపి, హారిక గేమ్‌లు 'డ్రా'





న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక వరుసగా రెండో 'డ్రా' నమోదు చేశారు. పొలీనా షువలోవా (రష్యా)తో జరిగిన గేమ్‌ను హంపి 19 ఎత్తుల్లో... జినెర్ జు (చైనా)తో జరిగిన గేమ్‌ను హారిక 52 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు.

కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా నితీశ్ రాణా

గాయంతో శ్రేయస్ అయ్యర్ దూరం!




కోల్‌కతా: మరో నాలుగు రోజుల్లో మొదలయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో రెండుసార్లు చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో బరిలోకి దిగనుంది. రెగ్యులర్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వెన్నునొప్పికి శస్త్ర చికిత్స అవసరం కానుంది. దాంతో అయ్యర్ మొత్తం ఐపీఎల్ టోర్నీకి దూరం కావడం ఖాయమైంది. ఈ నేపథ్యంలో శ్రేయస్ అయ్యర్ స్థానంలో నితీశ్ రాణా జట్టుకు నేతృత్వం వహిస్తాడని సోమవారం కేకేఆర్ ఒక ప్రకటన విడుదల చేసింది. గతంలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో ఢిల్లీ జట్టుకు నితీశ్ రాణా కెప్టెన్‌గా వ్యవహరించాడు. రాణా కెప్టెన్సీలో ఢిల్లీ జట్టు 12 మ్యాచ్‌లు ఆడి ఎనిమిదింటిలో గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. 2018 నుంచి కోల్‌కతా జట్టుకు ఆడుతున్న నితీశ్ రాణా కేకేఆర్ తరఫున 74 మ్యాచ్‌లు ఆడి 135.61 స్ట్రయిక్‌రేట్‌తో 1,744 పరుగులు సాధించాడు. ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీలో కోల్‌కతా తమ తొలి మ్యాచ్‌లో ఏప్రిల్ 1న పంజాబ్ కింగ్స్‌తో ఆడుతుంది.

సినిమా

హిట్ రిపీట్

కాంబినేషన్ రిపీట్ కావడం కామన్. అయితే హిట్ కాంబినేషన్ రిపీట్ అయినప్పుడు 'హిట్ రిపీట్' కావడం ఖాయం అనే అంచనాలు ఉంటాయి. తాజాగా మూడు కాంబినేషన్ల మీద అలాంటి అంచనాలు ఉన్నాయి. త్రివిక్రమ్–పూజా హెగ్డే, వెంకీ కుడుముల–రష్మికా మందన్నా, అట్లీ–నయనతార... ఈ ముగ్గురు డైరెక్టర్లు, ముగ్గురి హీరోయిన్ల కాంబో రిపీట్ అవుతోంది. ఆ విశేషాల్లోకి వెళదాం.

త్రివిక్రమ్ - పూజా హెగ్డే



పూజా హెగ్డే, త్రివిక్రమ్

తొలిసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో పూజా హెగ్డే కథానాయికగా నటించిన చిత్రం 'అరవింద సమేత వీర రాఘవ' (2018). ఈ సినిమాలో అందం, ఆత్మవిశ్వాసం, ప్రతిభ ఉన్న అరవింద పాత్ర చేశారు పూజా హెగ్డే. నటిగా తన టాలెంట్ నిరూపించుకోవడానికి ఈ క్యారెక్టర్ హెల్ప్ అయింది. దాంతో పాటు సినిమా కూడా ఘన విజయం సాధించడంతో పూజా కెరీర్‌కి ప్లస్ అయింది. ఆ తర్వాత రెండేళ్లకు 'అల.. వైకుంఠపురములో' సినిమా ప్లాన్ చేసి, అందులోనూ పూజా హెగ్డేని తీసుకున్నారు త్రివిక్రమ్. ఈ సినిమాలో పూజా హెగ్డే చేసిన అమూల్య క్యారెక్టర్ ఆమెకు ప్లస్ అయింది. 'అల..'తో మరో హిట్ సినిమా ఆమె ఖాతాలో పడింది. ఇప్పుడు మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ ఓ సినిమా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇందులోనూ పూజానే హీరోయిన్. ఈ సినిమాలో పూజా హెగ్డే పాత్ర ఎలా ఉంటుంది? అనేది తెలియాల్సి ఉంది.

వెంకీ కుడుముల - రష్మికా మందన్నా

ఒక మీడియమ్ బడ్జెట్ సినిమాలో చేసిన సింపుల్, హోమ్లీ క్యారెక్టర్ ఆ తర్వాత పెద్ద బడ్జెట్ సినిమాలు, గ్లామరస్ రోల్స్ చేసే రేంజ్‌కి తీసుకెళుతుందని 'ఛలో' (2018) సినిమా ఒప్పుకున్నప్పుడు రష్మికా మందన్నా ఊహించి ఉండరు. కానీ ఆ మేజిక్ జరిగింది. వెంకీ కుడుముల దర్శకత్వంలో చేసిన 'ఛలో' చిత్రం ద్వారా కన్నడ బ్యూటీ రష్మికా మందన్నా తెలుగుకి పరిచయం అయ్యారు. తొలి సినిమానే హిట్. ఆ తర్వాత పెద్ద సినిమాలు చేస్తూ వచ్చిన రష్మిక మళ్లీ రెండేళ్లకు వెంకీ కుడుముల దర్శకత్వంలో 'భీష్మ' (2020) సినిమాలో మంచి పాత్ర చేశారు. ఈ సినిమా కూడా సూపర్ హిట్. ఇప్పుడు మళ్లీ వెంకీ కుడుముల దర్శకత్వంలో రష్మిక ఓ సినిమా చేస్తున్నారు. విశేషం ఏంటంటే.. 'భీష్మ'లో నటించిన నితిన్ ఇందులో హీరో. ఆ విధంగా వెంకీ–నితిన్–రష్మికలకు ఇది రెండో సినిమా. ఈ హిట్ కాంబినేషన్ చేస్తున్న ఈ సినిమా ఇటీవలే ఆరంభమైంది.



వెంకీ కుడుముల, రష్మికా మందన్నా

అట్లీ - నయనతార



నయనతార



అట్లీ

దర్శకుడిగా అట్లీ తొలి సినిమా 'రాజా రాణి' (2013) చేస్తున్నప్పటికి నయనతార స్టార్ హీరోయిన్. ఒక కొత్త దర్శకుడు చెప్పిన కథని నమ్మి ఆమె 'రాజా రాణి' చేశారు. ఆ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. తొలి చిత్రం తర్వాత అట్లీ స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ స్టార్ డైరెక్టర్ల జాబితాలో చేరిపోయారు. ఇక మళ్లీ నయనతారను ఆయన కథానాయికగా తీసుకున్న చిత్రం 'బిగిల్' (2019). ఈ సినిమా కూడా సూపర్ హిట్. ఇప్పుడు అట్లీ దర్శకత్వంలో నయనతార ఓ సినిమా చేస్తున్నారు. అయితే ఈసారి ఈ డైరెక్టర్–హీరోయిన్ కాంబినేషన్‌లో రానున్నది హిందీ చిత్రం 'జవాన్'. షారుక్ ఖాన్ హీరోగా అట్లీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ద్వారా నయనతార బాలీవుడ్‌కి కథానాయికగా పరిచయం అవుతున్నారు. సౌత్‌లో హిట్స్ ఇచ్చిన ఈ కాంబో నార్త్‌లోనూ ఆ ఫీట్‌ని రిపీట్ చేస్తుందని ఊహించవచ్చు.

డబుల్ ధమాకా



రామ్‌చరణ్

రామ్ చరణ్ బర్త్ డే (మార్చి 27) సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం టైటిల్ వెల్లడి కావడంతో పాటు ఫస్ట్ లుక్ రిలీజైంది. ఆ విధంగా మెగా ఫ్యాన్స్‌కి డబుల్ ధమాకా లాంటి న్యూస్ ఇచ్చారు. రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'గేమ్ ఛేంజర్' టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ''రామ్ చరణ్ పాన్ ఇండియా ఇమేజ్‌కు తగ్గ పవర్‌ఫుల్ టైటిల్‌ను శంకర్ ఖరారు చేశారు'' అన్నారు 'దిల్' రాజు, శిరీష్. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత: హర్షిత్, కెమెరా: ఎస్. తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, లైన్ ప్రొడ్యూసర్స్: ఎస్.కె. జబీర్, నరసింహారావ్ .ఎన్.

వేసవిలో ఛత్రపతి



బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్ బాలీవుడ్‌లో హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఛత్రపతి'. వీవీ వినాయక్ ఈ మూవీకి దర్శకత్వం వహించారు. హీరో ప్రభాస్–డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో వచ్చిన తెలుగు 'ఛత్రపతి'కి ఇది రీమేక్. డాక్టర్ జయంతిలాల్ గడా సమర్పణలో ధవల్ జయంతిలాల్ గడా, అక్షయ్ జయంతిలాల్ గడా నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ చిత్రాన్ని మే 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ధవల్ జయంతిలాల్ గడా, అక్షయ్ జయంతిలాల్ గడా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

సింగిల్ షెడ్యూల్‌లో...



మల్లారెడ్డి, అలీ, రమణారెడ్డి, 'ఘర్షణ' శ్రీనివాస్...

నరేంద్ర, గరిమా జంటగా రమణారెడ్డి గడ్డం దర్శకత్వంలో 'సీఐ భారతి' సినిమా షురూ అయింది. 'ఘర్షణ' శ్రీనివాస్ సమర్పణలో విశాల పసునూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర మంత్రి సి. మల్లారెడ్డి స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. తొలి సీన్‌కి నటుడు అలీ క్లాప్ కొట్టారు. ''ఏప్రిల్ 10న షూటింగ్ మొదలు పెట్టి సింగిల్ షెడ్యూల్‌లో సినిమాని పూర్తి చేస్తాం'' అన్నారు రమణారెడ్డి గడ్డం. ''సీఐ భారతి' వంటి మంచి చిత్రాన్ని నేను నిర్మిస్తుండటం హ్యాపీ'' అన్నారు 'ఘర్షణ' శ్రీనివాస్. ఈ చిత్రానికి సహనిర్మాత: రేణుక కాసుల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకటేశ్వరరావు, సంగీతం: ప్రిన్స్ హెన్రీ, కెమెరా: శ్రీనివాస రెడ్డి.

దసరా కానుక



రామ్

రామ్ పోతినేని హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 20న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. ''మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది'' అని చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సంతోష్ డిటాకే.

ప్రేమకథ షురూ



ఉదయ్ శంకర్, శ్రీరామ్

ఉదయ్ శంకర్, మేఘా ఆకాశ్ జంటగా కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. ఈ చిత్రంతో మన్మోహన్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. డాక్టర్ సౌజన్య ఆర్. అట్లూరి సమర్పణలో అట్లూరి నారాయణరావు నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి దినేష్ చౌదరి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఉదయ్ శంకర్ తండ్రి శ్రీరామ్ క్లాప్ కొట్టారు. ఉదయ్ శంకర్ మాట్లాడుతూ–''రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు. ''ఫ్యామిలీ, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో పాటు ఒక చిన్న ప్రేమ కథ ఈ చిత్రంలో ఉంటుంది'' అన్నారు మన్మోహన్. ''ఏప్రిల్ మూడో వారంలో మా సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు అట్లూరి నారాయణరావు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: అనిత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: సాయి కృష్ణ, వెంకీ, కిశోర్.

మెగా యాక్షన్



మెహర్ రమేశ్, బాబీ, శ్రీ కల్యాణ్

శ్రీ కల్యాణ్, శశి జంటగా గేదెల రవిచంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మెగా పవర్'. నిర్మాత అల్లు అరవింద్ ఆశీస్సులతో అడబాల నాగబాబు, సాయి నిర్మల, ఇల్లా అభిషేక్, సత్యమూర్తి గేదెల నిర్మిస్తున్నారు. హీరో రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 'మెగా పవర్' ఫస్ట్ లుక్‌ని దర్శకులు మెహర్ రమేష్, కేఎస్ రవీంద్ర (బాబీ) విడుదల చేశారు. ''మదర్ సెంటిమెంట్‌తో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది'' అన్నారు దర్శక–నిర్మాతలు.

పరారి ఆయనకు అంకితం ఇవ్వాలి

– నక్కిన త్రినాథరావు



జీవీవీ గిరి, త్రినాథరావు, యోగేశ్వర్, మహిత్ నారాయణ్

''పరారి' పాటలు వింటుంటే చక్రిగారి సంగీతం విన్నట్టు ఉంది. గౌతమ్ రాజుగారి ఎడిటింగ్ చాలా బాగుంది. ఈ చిత్రాన్ని ఆయనకు అంకితం ఇవ్వాలి'' అని డైరెక్టర్ నక్కిన త్రినాథరావు అన్నారు. యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరారి'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ అవుతోంది. మహిత్ నారాయణ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'ఎల్ల ఎల్ల..' అనే పాటని నక్కిన త్రినాథరావు రిలీజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటని దీపక్ పాడారు.

ఏంటి ఈ డ్రామా?



మనోజ్, రియా సచ్‌దేవ, మేఘాంశ్ శ్రీహరి

మేఘాంశ్ శ్రీహరి, రియా సచ్‌దేవ జంటగా జి. భవానీ శంకర్ దర్శకత్వంలో 'మిస్టర్ బ్రహ్మ.. ఏంటి ఈ డ్రామా?' చిత్రం తెరకెక్కుతోంది. సంధ్యా రాణి, స్వరూప రాణి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలి సన్నివేశానికి కెమెరామేన్ ఛోటా కె. నాయుడు కెమెరా స్విచాన్ చేయగా, హీరో మంచు మనోజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ బాబీ కొల్లి గౌరవ దర్శకత్వం వహించారు. ''మాతో ఇంత భారీ సినిమా నిర్మిస్తున్న నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు మేఘాంశ్. ''సోషియో ఫ్యాంటసీ, మైథాలజీ, లవ్, ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు భవానీ శంకర్. ''మా తొలి ప్రయత్నాన్ని అందరూ ఆదరించాలి'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సి. రామ్ ప్రసాద్, సంగీతం: గోపీ సుందర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ముత్తినీడు గణేష్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 127	57,654
నిఫ్టీ ▲ 41	16,986

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్డాక్	11,784	▲ 35
డోజోన్స్	32,485	▲ 15
ఎఫ్టీఎస్ఈ 100	7,472	▲ 66
డాక్స్	15,128	▲ 170
షాంఘై	3,251	▼ 14
నికాయ్	27,477	▲ 92

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (24 క్యారట్)	58,892
బంగారం (22 క్యారట్)	58,657
వెండి (కిలో)	69,369

జియో కొత్త బ్రాడ్బాండ్ ప్లాన్ @ రూ.198

న్యూఢిల్లీ: ఫిక్స్డ్ బ్రాడ్బాండ్ సెగ్మెంట్లో పోటీని మరింత వేడెక్కిస్తూ జియో కొత్తగా ఎంట్రీ లెవెల్ ప్లాన్ను ఆవిష్కరించింది. నెలకు రూ.198 ధరతో బ్రాడ్బాండ్ బ్యాకప్ ప్లాన్ను ప్రవేశపెట్టింది. దీనితో సెకనుకు 10 మెగాబిట్ వేగంతో నెట్ సర్వీసులు అందుకోవచ్చు. రూ. 21–152 వరకు చెల్లించడం ద్వారా 1–7 రోజుల పాటు ఇంటర్నెట్ వేగాన్ని 30 ఎంబీపీఎస్ లేదా 100 ఎంబీపీఎస్కు అప్గ్రేడ్ చేసుకునే వీలును కల్పిస్తున్నట్లు సంస్థ తెలిపింది. 5 నెలల పాటు యూసేజీ, ఇన్స్టాలేషన్ చార్జీలు కలిపి కొత్త కస్టమరు రూ.1,490 కట్టాల్సి ఉంటుంది. ఇప్పటివరకు జియో ఫైబర్ కనెక్షన్ తీసుకునేందుకు కనీస ప్లాన్ నెలకు రూ.399గా ఉంది.

దక్షిణాదిలో లాయిడ్ గ్రాండే డ్యూటీ ప్రచారం



హైదరాబాద్: విద్యుత్ ఉపకరణాల తయారీ సంస్థ హావెల్స్ ఇండియా తన ఎయిర్ కండీషనర్ శ్రేణి 'లాయిడ్ గ్రాండే డ్యూటీ' ప్రచారాన్ని దక్షిణాది రాష్ట్రాల్లో ప్రారంభించింది. 'ఖయాల్ జో ఘర్ కో బనాయే' పేరిట రూపొందించిన ఈ ప్రచార చిత్రంలో సినీ నటులు మహేశ్బాబు, తమన్నాలు నటించారు. ''లాయిడ్ గ్రాండే హెవీ డ్యూటీ శ్రేణిలోని ప్లాస్మా ప్రొటెక్టివ్ షీల్డ్తో ఆరు బయట 60 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నా.., ఇంట్లో అత్యంత అనుకూలమైన సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందిస్తుంది'' అని లాయిడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అలోక్ టిక్కూ తెలిపారు. తెలుగు తమిళ బాషల్లో ఉండే ఈ కమర్షియల్ యాడ్ అన్ని డిజిటల్ మాధ్యమాల్లో ప్రసారం అవుతుంది.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-3-2023	
విశాఖ	450–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	425–00
రిటైల్ ధర (డజను)	66.00
27-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

ఫస్ట్ సిటిజన్స్ చేతికి ఎస్వీబీ

న్యూయార్క్: సంక్షోభంతో మూతబడిన సిలికాన్ వేలీ బ్యాంక్ (ఎస్వీబీ) సింహభాగం కార్యకలాపాలను ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ దక్కించుకుంది. దీంతో ఎస్వీబీకి చెందిన అన్ని డిపాజిట్లు, రుణాలు ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ అండ్ ట్రస్టుకు బదిలీ అవుతాయి. ఎస్వీబీ కస్టమర్లు ఆటోమేటిక్గా ఫస్ట్ సిటిజన్స్ ఖాతాదారులుగా మారతారని ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్డీఐసీ) తెలిపింది. ఫస్ట్ సిటిజన్స్లో ఎఫ్డీఐసీకి 500 మిలియన్ డాలర్ల విలువ చేసే షేర్లు దక్కుతాయి. ఎస్వీబీకి చెందిన 167 బిలియన్ డాలర్ల అసెట్లలో 90 బిలియన్ డాలర్ల అసెట్లు ఎఫ్డీఐసీ వద్దే ఉంటాయి. 72 బిలియన్ డాలర్ల అసెట్లు, ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్కు భారీ డిస్కౌంటుపై 16.5 బిలియన్ డాలర్లకు దక్కుతాయి. ఎస్వీబీ వైఫల్యంతో డిపాజిట్ ఇన్సూరెన్స్ ఫండ్పై 20 బిలియన్ డాలర్ల మేర ప్రభావం పడనుంది. ఎస్వీబీ దెబ్బతో కుదేలైన ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ను గట్టెక్కించేందుకు అమెరికాలోని 11 భారీ బ్యాంకులు దాదాపు 30 బిలియన్ డాలర్ల ప్యాకేజీని అందించాయి.



1898లో ఏర్పాటైన ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ .. నార్త్ కరోలినాలోని రాలీ ప్రధాన కేంద్రంగా పని చేస్తోంది. 100 బిలియన్ డాలర్ల పైచిలుకు అసెట్లతో 21 రాష్ట్రాల్లో 500 శాఖలు ఉన్నాయి. బ్యాంకు ఆర్థిక పరిస్థితిపై అనుమానాలతో ఖాతాదారులు తమ డిపాజిట్లను భారీగా వెనక్కి తీసుకుంటూ ఉండటంతో మార్చి 10న ఎస్వీబీ కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రెండు రోజులకు సిగ్నేచర్ బ్యాంక్ కూడా మూతబడింది.

ఆహా సీఈవోగా రవికాంత్ సబ్నవీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓటీటీ ప్లాట్ఫాం 'ఆహా' సీఈవోగా రవికాంత్ సబ్నవీస్ నియమితులయ్యారు. ఇప్పటిదాకా ఆ స్థానంలో ఉన్న అజిత్ ఠాకూర్ .. బోర్డ్ డైరెక్టరుగా పదోన్నతి పొందారు. సబ్నవీస్ నియామకం తక్షణం అమల్లోకి వచ్చినట్లు సంస్థ తెలిపింది. ఆయన అపార అనుభవం ఆహా వృద్ధికి తోడ్పడగలదని సంస్థ ప్రమోటర్ రాము రావు జూపల్లి తెలిపారు. కంపెనీకి ప్రత్యేక గుర్తింపు తేవడంలో అజిత్ కీలక పాత్ర పోషించారని, ఇకపైనా ఆహా స్టూడియో మొదలైన అంశాల్లో ఆయన మార్గదర్శకత్వం వహిస్తారని ఆహా ప్రమోటర్ అల్లు అరవింద్ పేర్కొన్నారు. విశిష్టమైన ప్రోగ్రామ్లతో వీక్షకులకు ఆహాను మరింత చేరువ చేసేందుకు ఆహా బృందం కృషి చేస్తుందని సబ్నవీస్ చెప్పారు. స్టార్ టీవీ, కింగ్ఫిషర్ ఎయిర్లైన్స్, హెయిన్జ్ ఇండియా వంటి పలు రంగాల సంస్థల్లో వివిధ హోదాల్లో సబ్నవీస్కు 30 ఏళ్ల పైగా అనుభవం ఉంది.



భారత్ వృద్ధి రేటు.. 6 శాతం!

- 2023–24పై ఎస్అండ్పీ అంచనా
- 2022–23లో 7 శాతంగా ఉద్ఘాటన
- రెపో రేటు మరింత పెంచే అవకాశం

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వృద్ధి ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరంలో (2023–24) 6 శాతంగా ఉంటుందన్న తన అంచనాల్లో ఎటువంటి మార్పూ లేదని ఎస్అండ్పీ గ్లోబల్ రేటింగ్స్ తాజా నివేదికలో పేర్కొంది. 2024–25లో ఈ రేటు తిరిగి 6.9 శాతానికి చేరుతుందని అంచనా వేసిన రేటింగ్ దిగ్గజ సంస్థ– మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2022–23) ఎకానమీ వేగాన్ని 7 శాతంగా ఉద్ఘాటించింది. కాగా, ద్రవ్యోల్బణం కట్టడే ధ్యేయంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపోను (ప్రస్తుతం 6.5 శాతం) మరింత పెంచే అవకాశం ఉందని కూడా రేటింగ్ దిగ్గజం అంచనా వేసింది. ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి సంబంధించి ఎస్అండ్పీ త్రైమాసిక ఎకనమిక్ అప్డేట్లో కొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే..

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 6.8 శాతంకాగా, 2023–24లో ఈ



రేటు 5 శాతానికి తగ్గనుంది.

- 2024–2026 మధ్య భారత్ ఎకానమీ వృద్ధి తీరు సగటున 7 శాతం.
- 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరంలలో భారత్ జీడీపీ వృద్ధి తీరు 6.9 శాతంగా ఉండనుంది. 2026–27లో 7.1%కి పెరుగుతుందని అంచనా.
- భారత్ ఎకానమీకి సాంప్రదాయకంగా 'దేశీయ డిమాండ్' చోదక శక్తిగా ఉంది. అయితే ఇటీవలి కాలంలో అంతర్జాతీయ ప్రతికూల ప్రభావం కొంత ఎకానమీపై కనబడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) జీడీపీ వృద్ధి రేట్లు వరుసగా 13.5 శాతం, 6.3 శాతాలుగా నమోదయ్యాయి. డిసెంబర్ త్రైమాసికంలో ఈ రేటు 4.4%కి నెమ్మదించడం గమనార్హం.
- ఆర్బీఐ రేటు పెంపునకు ప్రాతిపదిక అయిన వినియోగ ద్రవ్యోల్బణం 2023–24 ఆర్థిక సంవత్సరంలో 5 శాతానికి తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, వాతావరణ సవాళ్లుసహా పలు అడ్డంకులూ ఉన్నాయి.

అంతర్జాతీయంగా చూస్తే..

ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి సంబంధించి ఎస్అండ్పీ ఆశావాద దృక్పథాన్నే వెలువరించింది. ఈ సంవత్సరం చైనా ఆర్థిక వ్యవస్థ పుంజుకునే అవకాశం ఉందని తెలిపింది. 2023 చైనా వృద్ధికి సంబంధించి నవంబర్లో వేసిన 4.8 శాతం అంచనాలను 5.5 శాతానికి పెంచింది. మార్చిలో జరిగిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ప్రకటించిన 5 శాతం అంచనాలకన్నా ఇది అధికం కావడం గమనార్హం. వినియోగం, సేవల రంగాలు ఎకానమీ పురోగతికి దోహదపడతాయని అభిప్రాయపడింది. అమెరికా, యూరోజోన్లో ఎకానమీలో 2023లో భారీగా మందగించవచ్చని రేటింగ్ దిగ్గజం పేర్కొంది. ఈ ఏడాది అమెరికా 0.7 శాతం, యూరోజోన్ 0.3 శాతం వృద్ధి సాధిస్తాయన్నది తమ అంచనాగా తెలిపింది. చైనా కోలుకోవడం ఆసియా–పసిఫిక్ ప్రాంతంపై అమెరికా, యూరప్లోని మందగమన ప్రభావాన్ని పూర్తిగా భర్తీ చేయబోదని పేర్కొన్న ఎస్అండ్పీ, ఇది కొంత ఉపశమనాన్ని మాత్రం కలిగిస్తుందని అంచనావేసింది.

ఊగిసలాట.. చివరికి స్వల్ప లాభాలు

- కొనసాగిన బ్యాంకింగ్ సంక్షోభ ప్రభావం
- సెన్సెక్స్ లాభం 127 పాయింట్లు
- 41 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్, మారుతీ సుజుకీ, ఎస్బీఐ షేర్లు ఒకటిన్నరశాతం రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. అంతర్జాతీయ బ్యాంకింగ్ సంక్షోభ ప్రభావం కొనసాగింది. ఫలితంగా ట్రేడింగ్లో సూచీలు తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 57,567 వద్ద స్వల్ప లాభంతో మొదలైంది. ఇంట్రాడేలో 605 పాయింట్ల పరిధిలో 57,415 వద్ద కనిష్టాన్ని.., 58,020 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 127 పాయింట్లు పెరిగి 57,654 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 39 పాయింట్లు లాభంతో 16,984 వద్ద ట్రేడింగ్ను ప్రారంభించింది. రోజంతా 16,919 – 17,091 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 41 పాయింట్లు బలపడి 16,986 వద్ద నిలిచింది. ఫార్మా, ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఎఫ్ఎంసీజీ షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆటో, ఫైనాన్స్, మీడియా, రియల్టీ, కన్జూమర్, ఇంధన రంగాలకు చెందిన మధ్య, చిన్న తరహా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 1.50%, ఒకశాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.891 కోట్ల షేర్లను అమ్మేయగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1809 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలపడి 82.37 స్థాయి వద్ద స్థిరపడింది. సిలికాన్ వ్యాలీ బ్యాంక్ ని ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ టేకోవర్ చేయడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సెంటిమెంట్ బలపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- రిలయన్స్ షేరు రాణించి సూచీల పతనాన్ని అడ్డుకుంది. బీఎస్ఈలో ఈ షేరు ఒకటిన్నర శాతం లాభపడి రూ.2,238 వద్ద ముగిసింది.
- లుపిన్ కంపెనీ షేరు మూడుశాతం లాభపడి రూ.659 వద్ద స్థిరపడింది. వాల్బెనజైన్ క్యాప్సుల్ను అమెరికా మార్కెట్లో విక్రయించేందుకు యూఎస్ఎఫ్డీఏ నుంచి తాత్కాలిక అనుమతి పొందడంతో ఈ షేరుకు డిమాండ్ లభించింది.
- రిఫ్రాక్టరీ యూనిట్ ను ప్రమోటర్ కంపెనీకి విక్రయిస్తున్నట్లు ప్రకటించడంతో దాల్మియా భారత్ షేరు 2% లాభపడి రూ.1,872 వద్ద స్థిరపడింది.

రుణ గ్రహీతల వాదన కూడా వినండి

'మోసపు ఖాతా'గా ప్రకటించే విషయంలో బ్యాంకింగ్కు సుప్రీం సూచన

న్యూఢిల్లీ: ఒక అకౌంట్ను మోసపూరితమైనదిగా ప్రకటించేముందు సంబంధిత రుణ గ్రహీత తన వాదనను వినిపించుకునేందుకూ తగిన అవకాశం కల్పించాలని బ్యాంకింగ్కు అత్యున్నత న్యాయస్థానం సూచించింది. ఈ మేరకు 2020లో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం సమర్థించింది. ఒక ఖాతాను మోసపూరితంగా వర్గీకరించడం వల్ల ఆ నేర విచారణను దర్యాప్తు సంస్థలు చేపట్టడమే కాకుండా, అది ఇతర క్రిమినల్, సివిల్ చర్యలకూ దారితీస్తుందన్న విషయాన్ని అత్యున్నత న్యాయస్థానం ప్రస్తావించింది. ఖాతాను మోసపూరితమైనదిగా వర్గీకరించే చర్య.. రుణగ్రహీత వ్యాపారం, సద్భావనపై (గుడ్విల్) మాత్రమే కాకుండా కీర్తి ప్రతిష్టలను కూడా ప్రభావితం చేస్తుందని పేర్కొంది. సహజ న్యాయ సూత్రాల ప్రకారం రుణగ్రహీతలకు తప్పనిసరిగా నోటీసు అందించాలని, 'మోసపూరితమైనదిగా ప్రకటించడానికి దారితీస్తున్న పరిస్థితులకు సంబంధించి ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికలోని తీర్మానాలను వివరించడానికి అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించింది. ''తన అకౌంట్ను నేరపూరితమైనదిగా ప్రకటించడం కూడదని రుణగ్రహీత విజ్ఞప్తిచేస్తే, ఆ అభ్యంతరాలను తోసిపుచ్చాల్సిన పరిస్థితుల్లో... అందుకు సంబంధించి సహేతుకమైన ఉత్తర్వు జారీ చేయవలసి ఉంటుంది' అని బెంచ్ స్పష్టం చేసింది. 2016లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (వాణిజ్య బ్యాంకులు, నిర్దిష్ట ఆర్థిక సంస్థలు మోసాల వర్గీకరణ రిపోర్టింగ్) ఇచ్చిన ఆదేశాలకు సంబంధించిన అభ్యర్థనలపై సుప్రీం తాజా తీర్పు వెలువరించింది.



విద్య, ఉద్యోగ సమాచారం

ఈపీఎఫ్వో, న్యూఢిల్లీలో 2674 ఎస్ఎస్ఏ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్వో).. దేశవ్యాప్తంగా రెగ్యులర్ ప్రాతిపదికన ఈపీఎఫ్వో–రీజియన్ల వారీగా సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్(ఎస్ఎస్ఏ)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2674 (ఆంధ్రప్రదేశ్ రీజియన్లో 39, తెలంగాణ రీజియన్లో 116 ఖాళీలు).
» **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు నిమిషానికి 35 ఇంగ్లిష్ పదాలు లేదా నిమిషానికి 30 హిందీ పదాలు కంప్యూటర్లో టైపింగ్ చేయగల నైపుణ్యం కలిగి ఉండాలి.
» **వయసు:** దరఖాస్తు చివరి తేదీ నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10–15 ఏళ్లు, ఎక్స్–సర్వీస్మెన్లకు 3 నుంచి 8 ఏళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.29,200 నుంచి రూ.92,300 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కంప్యూటర్ టైపింగ్ టెస్ట్,డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో 150 ప్రశ్నలకు 600 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. జనరల్ ఆప్టిట్యూడ్(30 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్/జనరల్ అవేర్నెస్(30 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఎబిలిటీ(30 ప్రశ్నలు), జనరల్ ఇంగ్లిష్(50 ప్రశ్నలు), కంప్యూటర్ లిటరసీ(10 ప్రశ్నలు) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు 4 మార్కులు ఉంటాయి.
» **ఆన్లైన్ దరఖాస్తు/రిజిస్ట్రేషన్ తేదీలు:** 27.03.2023 నుంచి 26.04.2023 వరకు
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 27.04.2023 నుంచి 28.04.2023 వరకు.
» **వెబ్సైట్:** www.epfindia.gov.in

ఏపీ ఎడ్సెట్-2023

ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీఈడీ, బీఈడీ(స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎడ్సెట్)-2023 నోటిఫికేషన్ను విడుదల చేసింది. ఈ ఏడాది పరీక్షను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్శిటీ నిర్వహిస్తోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. బీటెక్, బీసీఏ, బీబీఎం విద్యార్థులు అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు డిగ్రీ స్థాయిలో చదివిన సబెక్ట్లనే ఎడ్సెట్లో మెథడాలజీ సబ్జెక్ట్లుగా ఎంచుకోవాల్సి ఉంటుంది.
» **పరీక్ష విధానం:** పరీక్షలో మూడు విభాగాలలో 150 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:**23.04.2023.
» **ఆలస్య రుసుము రూ.1000తో దరఖాస్తులకు చివరితేది:** 02.05.2023.
» **ఆలస్య రుసుము రూ.2000తో దరఖాస్తుకు చివరితేది:** 10.05.2023.
» **హాల్టిక్కెట్ల డౌన్లోడ్ తేది:** 12.05.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 20.05.2023.
» **వెబ్సైట్:** www.cets.apsche.ap.gov.in

ఏపీ లాసెట్-2023

ఏపీ ఉన్నత విద్యా మండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు, ఐదేళ్ల ఏపీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ లాసెట్–2023), ఏపీ పీజీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ పీజీఎల్సెట్–2023)నోటిఫికేషన్ను విడుదల చేసింది. ఈ పరీక్షను గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది.

» **కోర్సులు:** మూడు, ఐదేళ్ల ఎల్ఎల్బీ కోర్సులు, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సు.
» **అర్హత:** మూడేళ్ల ఎల్ఎల్బీ కోర్సుకు ఏదైనా గ్రాడ్యుయేట్ డిగ్రీ, ఐదేళ్ల ఎల్ఎల్బీ కోర్సుకు ఇంటర్మీడియట్, ఎల్ఎల్ఎం కోర్సుకు ఎల్ఎల్బీ లేదా బీఎల్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష మాధ్యమం:**లాసెట్ ఇంగ్లిష్/తెలుగు, పీజీ ఎల్సెట్ ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది (ఆలస్య రుసుం లేకుండా):** 22.04.2023.
» **హాల్టికెట్ డౌన్లోడ్ ప్రారంభతేది:**15.05.2023
» **పరీక్ష తేదీ:** 20.05.2023.
» **వెబ్సైట్:**https://cets.apsche.ap.gov.in

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో 37 ఫార్మాసిస్ట్ పోస్టులు

హైదరాబాద్లోని ఆఫీస్ ఆఫ్ జాయింట్ డైరెక్టర్ (మెడికల్) ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా ఈఎస్ఐ డిస్పెన్సరీలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఫార్మాసిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
» **పోస్టుల వివరాలు:** సివిల్ అసిస్టెంట్ సర్జన్–16, ల్యాబ్ టెక్నీషియన్–05, ఫార్మాసిస్ట్–16.
» **అర్హత:** ఎంబీబీఎస్, ల్యాబ్ టెక్నీషియన్ సర్టిఫికేట్, డీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు సీఏఎస్కు రూ.58,850, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్కు రూ.31,040.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జాయింట్ డైరెక్టర్(మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, ఐదో అంతస్తు, హాస్టల్ బిల్డింగ్, ఈఎస్ఐ హాస్పిటల్, సనత్నగర్, నాచారం, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.03.2023.
» **వెబ్సైట్:** medchal-malkajgiri.telangana.gov.in

నాగర్ కర్నూలు, జీజీహెచ్లో వివిధ పోస్టులు

నాగర్ కర్నూలులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
» **పోస్టుల వివరాలు:** పాథాలజిస్ట్–01, బయోకెమిస్ట్–01, మైక్రో బయాలజిస్ట్–01, రేడియాలజిస్ట్–01, ల్యాబ్మేనేజర్–01, రేడియోగ్రాఫర్(మేల్)–01.
» **అర్హత:** ఎండీ, ఎంఎస్సీ, డిప్లొమా, బీఎస్సీ, డీఎంఐటీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ల్యాబ్ మేనేజర్/రేడియోగ్రాఫర్ కోసం రూ.30,000, ఇతర పోస్టులకు రూ.1,00,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, నాగర్ కర్నూలు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.03.2023.
» **వెబ్సైట్:** www.nagarkurnool.telangana.gov.in

ఏపీ పీజీఈసెట్-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ.. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ పీజీఈసెట్) నోటిఫికేషన్ విడుదలచేసింది.

» **పీజీ కోర్సులు:** ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మ్ డీ.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీటెక్/బీఫార్మసీ ఉత్తీర్ణత పొందిన/చివరి ఏడాది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» గేట్/జీప్యాట్ అర్హత సాధించిన అభ్యర్థులకు విడిగా నోటిఫికేషన్ విడుదలచేస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2023
» **రూ.5000 ఆలస్య రుసుముతో చివరితేది:** 14.05.2023.
» **ఏపీపీజీఈసెట్ 2023 పరీక్ష తేది:** 28.05.2023 నుంచి 30.05.2023.
» **వెబ్సైట్:** www.cets.apsche.ap.gov.in

బయోటెక్నాలజీలో పీజీ చేస్తారా

» జీఏటీ–బీ/బీఈటీ ద్వారా బయోటెక్నాలజీ పీజీ, పీహెచ్డీల్లో ప్రవేశం
» దేశవ్యాప్తంగా 63 యూనివర్సిటీలు/ఇన్స్టిట్యూట్స్లో అడ్మిషన్
» ఎంపికైన విద్యార్థులకు డీబీటీ స్టయిపెండ్, ఫెలోషిప్లు

బయోటెక్నాలజీ, అనుబంధ విభాగాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వీలు కల్పించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(జీఏటీ-బీ), అలాగే బయోటెక్నాలజీలో డాక్టోరల్ కోర్సుల్లో అడ్మిషన్స్ కోసం నిర్వహించే బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ)-2023 ప్రకటన విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)..జీఏటీబీ/బీఈటీ-2023 నిర్వహించనుంది. జాతీయ స్థాయిలో జరిగే ఈ ప్రవేశ పరీక్షల ద్వారా దేశవ్యాప్తంగా 63 ఇన్స్టిట్యూట్లు, విశ్వవిద్యాలయాల్లో బయోటెక్నాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్ ప్రోగ్రామ్లలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ పరీక్షల వివరాలు..



జీఏటీ-బీ, బీఈటీ 2023

జీఏటీ-బీ కోర్సులు

జీఏటీ–బీలో అర్హత ద్వారా డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ(డీబీటీ) గుర్తింపున్న పోస్ట్గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్.. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ అండ్ అలైడ్ ఏరియాస్; ఎంటెక్ బయోటెక్నాలజీ అండ్ అలైడ్ ఏరియాస్; ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, ఎంవీఎస్సీ యానిమల్ బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.

అర్హత

జీఏటీ–బీ 2023కు హాజరయ్యే విద్యార్థులు కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ప్రవేశ పరీక్షకు హాజరుకావచ్చు. అయితే సంబంధిత విద్యాసంస్థ జారీచేసిన అండర్ టేకింగ్/అటెస్టేషన్ ఫామ్ను సమర్పించాలి.

స్టయిఫండ్

- జీఏటీ–బీ 2023లో అర్హత సాధించి, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి ప్రతి నెల స్టయిఫండ్ అందుతుంది.
- ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, సంబంధిత కోర్సుల్లో ప్రవేశాలు పొందినవారికి నెలకు రూ.5000 స్టయిఫండ్ లభిస్తుంది.
- ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ అభ్యర్థులకు నెలకు రూ.7500 స్టయిఫండ్ చెలిస్తారు.
- ఎంటెక్/ఎంవీఎస్సీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారు నెలకు రూ.12000 స్టయిఫండ్ పొందొచ్చు.
- కోర్సు మొదటి ఏడాదిలో విద్యార్థి చూపిన ప్రతిభ ఆధారంగానే రెండో ఏడాది స్టయిఫండ్ కొనసాగిస్తారు.

పరీక్ష విధానం

- జీఏటీ–బీ ప్రశ్నపత్రం బహుళైచ్ఛిక విధానంలో ఉంటుంది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) విధానంలో మొత్తం 240 మార్కులకు జరుగుతుంది. ప్రశ్నపత్రం ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. సెక్షన్–ఎలో 60 ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 60 మార్కులుంటాయి. ఈ ప్రశ్నలన్నీ కూడా 12 తరగతి(10+2) స్థాయిలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, బయాలజీల నుంచి ఉంటాయి.
- సెక్షన్–బిలో 100 ప్రశ్నలుంటాయి. ఇందులో 60 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 3 మార్కుల చొప్పున 180 మార్కులుంటాయి. పరీక్ష సమయం 3గంటలు.

బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్ (బీఈటీ)

డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోషిప్స్ కోసం దేశవ్యాప్తంగా జరిగే అర్హత పరీక్ష ఇది. సీబీటీ విధానంలో నిర్వహించే ఈ పరీక్షకు కూడా ప్రకటన వెలువడింది. అభ్యర్థులు బీఈటీలో చూపిన ప్రతిభ ఆధారంగా కేటగిరి–1, కేటగిరి–2 అనే రెండు రకాల మెరిట్ లిస్టులను తయారు చేస్తారు. రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా తుది జాబితాను రూపొందిస్తారు. కేటగిరి–1లో స్థానం సంపాదించినవారు దేశంలో గుర్తింపు పొందిన ఏ విద్యాసంస్థలోనైనా పీహెచ్డీలో ప్రవేశం పొంది ఫెలోషిప్ అందుకోవచ్చు. కేటగిరీ–2 మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులు.. డీబీటీ స్పాన్సర్ చేసే ప్రాజెక్టుల్లో చేరి ఫెలోషిప్ పొందొచ్చు. వీరికి ఆయా ఇన్స్టిట్యూట్ల ఎంపిక విధానాన్ని అనుసరించి పీహెచ్డీలో చేరే అవకాశం లభిస్తుంది.

అర్హత

బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) రాసే అభ్యర్థులు కనీసం 60శాతం మార్కులతో బ్యాచిలర్స్ (బీఈ/ బీటెక్/ ఎంబీబీఎస్) అండ్ మాస్టర్స్ (ఎంఎస్సీ/ ఎంటెక్/ ఎంవీఎస్సీ/ ఎం.ఫార్మ్/ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ/ఎంటెక్), బయోమెడికల్, బయోఇన్ఫర్మేటిక్స్, బయోకెమిస్ట్రీ, బయోఫిజిక్స్, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటేషన్, బయాలజీ, జెనిటిక్స్, మైక్రోబయాలజీ, జువాలజీ లేదా బయాలజీ/లైఫ్-సైన్సెస్కు చెందిన అనుబంధ కోర్సు ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఫైనల్ సెమిస్టర్కు హాజరవుతున్న వారు, ఫైనల్ సెమిస్టర్ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

జనరల్ అభ్యర్థుల వయసు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ మహిళలకు 5 ఏళ్ల వయోసడలింపు లభిస్తుంది. ఓబీసీ అభ్యర్థులకు(నాన్-క్రీమి లేయర్)3 ఏళ్ల సడలింపు ఉంటుంది.

పరీక్ష విధానం

- ఈ ప్రశ్నపత్రంలో రెండు సెక్షన్లుంటాయి. సెక్షన్-ఎలో 50 ప్రశ్నలు, ఒక్కో ప్రశ్నకు 3 మార్కుల చొప్పున 150 మార్కులుంటాయి. దీంట్లో జనరల్సైన్స్, మ్యాథమేటిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్ అనలిటికల్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ జనరల్ బయోటెక్నాలజీ ఉంటాయి.
- సెక్షన్–బిలో సిలబస్ ప్రకారం-బయోటెక్నాలజీకి సంబంధించిన 150 ప్రశ్నలుంటాయి. వాటిలో 50 ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది.

ఒక్కో ప్రశ్నకు 3 మార్కుల చొప్పున 150 మార్కులకు పరీక్ష ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 31.03.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 03.04.2023 నుంచి 04.04.2023
- **జీఏటీ–బీ పరీక్ష తేదీ:** 23.04.2023 ఉదయం 9–12 గంటల వరకు
- **బీఈటీ పరీక్ష తేదీ:** 23.04.2023 మధ్యాహ్నం 3–6 గంటల వరకు
- **పరీక్ష కేంద్రాలు:** ఆంధ్రప్రదేశ్లో నెల్లూరు, గుంటూరు, విశాఖపట్నం. తెలంగాణలో హైదరాబాద్/సికింద్రాబాద్.
- **వెబ్సైట్:** http://dbt.nta.ac.in

క్లుప్తంగా...

‘వస్తు మార్పిడి’పై ఆసక్తిగల సంస్థలకు స్టీల్ ప్లాంట్ ఆహ్వానం

ఉక్కునగరం: వస్తు మార్పిడి (బార్టర్ మోడల్) విధానం ద్వారా తమతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి కలిగిన సంస్థలకు ప్రభుత్వ రంగసంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్ ఆహ్వానం పలుకుతోంది. ఈ మేరకు విశాఖ స్టీల్ ప్లాంట్ సోమవారం ఆసక్తి వ్యక్తీకరణకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉక్కు, ముడి ఉక్కు తయారీలో ఆసక్తి ఉన్న కంపెనీలతో భాగస్వామి కావాలని స్టీల్ ప్లాంట్ భావిసోంది. కోకింగ్ కోల్, బీఎఫ్ కోక్, ఐరన్ ఓర్ తదితర ముడి సరుకు సరఫరా చేసి దానికి బదులుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను తీసుకోవడం, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వడం ద్వారా స్టీల్ ఉత్పత్తులను తీసుకోవడం లక్ష్యంగా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆసక్తి కలిగిన సంస్థలు ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వైజాగ్ స్టీల్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

బ్లాస్ట్‌ఫర్నేస్–3 నిర్వహణ కోసమేనా!

ఉత్పత్తికి తగిన ముడి సరుకు అందుబాటులో లేకపోవడం, వర్కింగ్ క్యాపిటల్ లేకపోవడం వల్ల గత ఏడాదిగా విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్–3ను నడపలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ప్లాంట్ వర్గాల సమాచారం. తద్వారా వార్షిక ఉత్పత్తి లక్ష్యం కూడా సాధించలేకపోయారు. తాజా ప్రతిపాదన ద్వారా బ్లాస్ట్‌ఫర్నేస్–3ను నడపాలని యాజమాన్యం భావిస్తున్నట్లు తెలిసింది.

గ్రూప్-1 మెయిన్స్‌కు 3 నెలల సమయం ఇవ్వాలి


టీడీపీ నేత అశోక్‌బాబు డిమాండ్


సాక్షి, అమరావతి: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు 85 రోజుల గడువు మాత్రమే ఇవ్వడం సరికాదని టీడీపీ నేత అశోక్‌బాబు పేర్కొన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చేలగాటమాడేలా ఏపీపీఎస్సీ వ్యవహరిస్తోందని, 85 రోజుల్లో మెయిన్స్ పరీక్షకు ఎలా సిద్ధమవుతారని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆ లోన్ యాప్‌లను నమ్మొద్దు

ఫేక్ లోన్‌యాప్‌లను వెల్లడించిన కేంద్ర హోంశాఖ

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో రుణాల పేరుతో ఇన్‌స్టంట్ లోన్‌యాప్‌ల మోసాలు పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అమాయకులను మోసగిస్తున్న పలు ఆన్‌లైన్ కంపెనీలపై కేసులు నమోదు అవుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఇన్‌స్టంట్ లోన్ల పేరుతో మోసాలకు పాల్పడుతున్న పలు యాప్‌లపైనా కేంద్ర హోంశాఖ వర్గాలు దృష్టి పెట్టాయి. ఈ తరహాలో రెండు యాప్‌లను గుర్తించినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు వెల్లడించారు. ‘స్మార్ట్ క్రెడిట్–ఆన్‌లైన్ యాప్’, ‘ఏపీ క్రెడిట్–ఇన్‌స్టంట్ లోన్‌యాప్ పవన్ ఫిన్వెస్ట్ ప్రైవేటు లిమిటెడ్’లు నకిలీ యాప్‌లు అని వీటి నుంచి లోన్ పేరుతో వచ్చే ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు, ఈ–మెయిల్స్ నమ్మొద్దని అధికారులు సూచించారు.





కేస్ - 01

‘గుడ్‌మార్నింగ్ సార్. యాదాద్రి దగ్గరల్లో కొత్త వెంచర్ ప్రారంభం కాబోతోంది. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాలు. మీ సొంత ప్రాంతానికి వెళ్లే దారిలోనే వెంచర్ ఉంది. తీసుకోండి...’ అంటూ టెలికాలర్ ఫోన్ చేసి తన పేరు, పూర్తి చిరునామా చెప్పడంతో ఓ ప్రభుత్వ ఉద్యోగి అవాక్కయ్యాడు.

కేస్ - 02

‘సార్.. మీరు వాడుతున్న ప్యూరిఫయర్‌తో పోలిస్తే మా ప్రొడక్ట్ అన్ని విధాలా ఉత్తమమైనది. మీరు సరే అంటే మా ఏజెంట్‌ను మీ ఇంటికి డెమోకు పంపుతాం. మీ చిరునామా ఇదే కదా..’ అంటూ తన ఇంటి అడ్రస్‌ను ఓ ఉత్పత్తుల సంస్థ ఉద్యోగి ఫోన్లో చెబుతుంటే ఓ ప్రైవేటు ఉద్యోగి నోరెళ్లబెట్టాడు.

అప్పనంగా డేటా ఇచ్చేస్తున్నాం!

రియల్ ఎస్టేట్ అమ్మకాలని, క్రెడిట్ కార్డులని, ఇన్‌స్టంట్ లోన్లని, మార్కెట్‌లోకి కొత్త ప్రొడక్ట్స్ వచ్చాయని, కొత్త రెస్టారెంట్లు, షాపింగ్స్ మాల్స్ ప్రారంభోత్సవాలకు విచ్చేయాలంటూ దాదాపు నిత్యం మనకు అపరిచితుల నుంచి ఫోన్‌కాల్స్ రావడం పరిపాటిగా మారింది. అయితే వారందరికీ మన పేర్లు, ఫోన్ నంబర్లు, ఇంటి అడ్రస్‌లు, ఈ–మెయిల్స్ ఎలా తెలుస్తున్నాయి.
మన వివరాలు మరెవరో కాదు... అప్పనంగా మనమే ఇచ్చేస్తున్నాం!

సాక్షి, హైదరాబాద్

ప్రస్తుత సాంకేతికత యుగంలో మన పేరు, ఫోన్ నంబర్, ఇంటి చిరునామా, పాన్, ఆధార్, ఈ–మెయిల్ అడ్రస్, పాస్‌వర్డ్‌లు కేవలం సమాచారం మాత్రమే కావు. మన జీవితాలను నిర్దేశించే అంశాలు. ఇవి సైబర్ నేరగాళ్ల చేతికి వెళితే బ్యాంకు ఖాతాలో ఉన్న మన కష్టార్జితం క్షణాల్లో హాంఫట్ అవ్వొచ్చు. మన పేరిట లోన్లు తీసుకొని ఎగ్గొట్టొచ్చు. కోట్ల మంది డేటాను కొల్లగొట్టిన ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు ఇటీవలే రట్టు చేశారు. మన డేటా లీక్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపైనా ఉందని, వ్యక్తిగత సమాచారం ఎక్కడ ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వకూడదో తప్పనిసరిగా అవగాహన ఏర్పరుచుకోవాలని సైబర్ భద్రతా నిపుణులు సూచిస్తున్నారు.

లాటరీలు, కూపన్ల పేరుతో డేటా సేకరణ...

మనం షాపింగ్ మాల్స్‌కు వెళ్లినప్పుడు లాటరీల కోసమనో లేదా గిఫ్ట్ కూపన్లు ఇచ్చేందుకనో మన వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారు. అలా అడిగిందే తడవుగా రివార్డు పాయింట్ల కోసం, డిస్కౌంట్ల కోసం, గిఫ్ట్ కూపన్ల కోసం ఆశపడి మన వ్యక్తిగత వివరాలు ఇతరులకు ఇచ్చేస్తున్నాం. ఇలా పోగేసిన డేటాను కొందరు కేటుగాళ్లు కన్సల్టెన్సీలకు 5 పైసలకు ఒక కాంటాక్ట్ చొప్పున అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా కన్సల్టెన్సీలు కొన్ని వేల రూపాయల ఖర్చుతోనే కోట్ల మంది సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఈ తరహా సంస్థల నుంచి సైబర్ నేరస్తులు గంపగుత్తగా డేటాను కొని ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. అలాగే సోషల్ మీడియా ఖాతాల్లో ఉండే వ్యక్తిగత వివరాలను కొన్ని ఆన్‌లైన్ సంస్థలు డేటా ఎనలిటిక్స్ టెక్నిక్‌లతో సేకరించి వివిధ కంపెనీలకు వాణిజ్య ప్రకటనలు ఇచ్చేందుకు అమ్ముకుంటున్నాయి.

తప్పక డిలీట్ చేయించాలి..



వివిధ అవసరాలు, ప్రభుత్వ పథకాల నిమిత్తం ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌బుక్ మొదటి పేజీ, వివిధ సర్టిఫికెట్ల వంటి వాటిని ఫొటోకాపీ తీయించుకోవడం అనివార్యమవుతోంది. అయితే అలాంటప్పుడు మనం వాట్సాప్ లేదా ఈ–మెయిల్ ద్వారా పంపిన వివరాలను ప్రింట్ అవుట్ తీసుకున్న తర్వాత ఆ జిరాక్స్ సెంటర్ లేదా నెట్ సెంటర్ నుంచి డిలీట్ చేయించాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

డేటా ప్రైవసీలో యూరోపియన్ చట్టాలు ఎంతో కఠినం..



యురోపియన్ దేశాల్లో వ్యక్తిగత సమాచారం. వివరాలకు, వ్యక్తిగత గోప్యతకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. మన వివరాలను అను మతి లేకుండా ఎవరు తీసుకున్నా... వినియోగించినా వెంటనే వారిపై జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ చట్టం కింద భారీ జరిమానాలతోపాటు జైలుశిక్షలు విధించే అవకాశం ఉంది. ఆ తరహా చట్టాలు మన దేశంలోనూ వస్తేనే వ్యక్తిగత వివరాల గోప్యతకు రక్షణ ఉంటుందని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

వీలైనంత వరకు ఇవ్వొద్దు...

వీలైనంత వరకు మీ ఫోన్ నంబర్, చిరునామా, ఈ–మెయిల్ ఐడీ, ఆధార్, పాన్ వంటి వివరాలను ఇతరులకు ఇవ్వొద్దు. ఇలా ఇవ్వడం వల్ల మన డేటాను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడే ప్రమాదం ఉంటుందని గ్రహించాలి.
– పాటిబండ్ల ప్రసాద్, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఢిల్లీ



గాలి జనార్దనరెడ్డి పార్టీకి ఫుట్‌బాల్ గుర్తు



సాక్షి, బళ్లారి: మాజీ మంత్రి గాలి జనార్దన రెడ్డి స్థాపించిన కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ) కి కేంద్ర ఎన్నికల సంఘం ఫుట్‌బాల్ గుర్తును కేటాయించింది. సోమవారం ఆయన బెంగళూరులో తమ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఆయన ఫుట్‌బాల్ గుర్తును ఎందుకు ఎంపిక చేసుకున్నారో వివరించారు. గతంలో తనను అందరూ ఫుట్‌బాల్‌లా ఆడుకున్నారని, శత్రువులు, మిత్రులు సైతం తనను ఫుట్‌బాల్ ఆడారని, అందుకోసం తాను ఎన్నికల గుర్తు కూడా ఫుట్‌బాల్ కావాలని కోరానన్నారు. ఈ ఫుట్‌బాల్ ఆటలో ఎవరికి ఎన్ని గోల్స్ వస్తాయో కాలమే నిర్ణయిస్తుందన్నారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా పర్యటించే ఉద్దేశంతో హెలికాప్టర్ కూడా కొనుగోలు చేశానన్నారు. ప్రజాసేవ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధం అన్నారు.

నడకమార్గాల్లో దివ్యదర్శనం టోకెన్లు

ప్రయోగాత్మకంగా ఏప్రిల్ 1 నుంచి వారం పాటు అమలు

- అనంతరం భక్తుల సూచనలకు అనుగుణంగా నిర్ణయం
- వేసవి రద్దీ దృష్ట్యా సామాన్య భక్తులకు ప్రాధాన్యం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



విద్యుత్ ధర్మ రథం బస్సులను ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఏవీ ధర్మారెడ్డి

తిరుమల: భక్తుల కోరిక మేరకు ఏప్రిల్ 1 నుంచి ప్రయోగాత్మకంగా వారం రోజుల పాటు అలిపిరి మార్గంలో 10 వేలు, శ్రీవారిమెట్టు మార్గంలో 5 వేల దివ్యదర్శనం టోకెన్లు మంజూరు చేస్తామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు. అనంతరం భక్తుల సూచనలను పరిగణనలోకి తీసుకుని.. తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం ఈవో ధర్మారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వేసవి సెలవుల్లో రద్దీని దృష్టిలో పెట్టుకొని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి జూలై 15 వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని.. దీనిని దృష్టిలో పెట్టుకొని సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. వీఐపీ బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300 దర్శన టికెట్లను తగ్గిస్తామని తెలిపారు. ఈ మూడు నెలల పాటు వీఐపీలు తమ సిఫారసు లేఖలను తగ్గించాలని కోరారు. భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో ఎండ వల్ల కాళ్లు కాలకుండా కూల్ పెయింట్ వేస్తున్నట్లు చెప్పారు. తిరుమలలో 7,500కు పైగా గదులు ఉన్నాయని.. వీటిలో దాదాపు 40 వేల మందికి సరిపడా వసతి అందుబాటులో ఉందన్నారు. దాదాపు 85 శాతం గదులను సామాన్య భక్తులకే కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఫేస్ రికగ్నైజేషన్ వల్ల గదుల కేటాయింపులో పారదర్శకతను పెంచినట్లు పేర్కొన్నారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, పాత అన్నదానం కాంప్లెక్స్, పీఏసీ–2, 4తో పాటు నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలు, కంపార్ట్‌మెంట్లలో అన్నప్రసాదాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రధాన కల్యాణకట్ట, మినీ కల్యాణకట్టల్లో నిరంతరాయంగా సేవలందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

విదేశీమారకద్రవ్యం నిల్వలపై టీటీడీకి జరిమానా నిజమే

కేంద్ర హోంశాఖ వద్ద ఫారెన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద రిజిస్ట్రేషన్ లేకుండా టీటీడీ విదేశీ మారకద్రవ్యాన్ని నిల్వ ఉంచుకోవడంపై ఆర్బీఐ రూ.3 కోట్లు జరిమానా విధించిన విషయం నిజమేనని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ‘ఎఫ్‌సీఆర్‌ఏ కింద 2018లో అప్పటి టీటీడీ పాలకమండలి, అధికారులు తగిన వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించలేదు. ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సు పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదు. దీంతో టీటీడీ నగదు డిపాజిట్ ట్రస్టు ఖాతా ఉన్న ఎస్బీఐ... టీటీడీ వద్ద ఉన్న రూ.30 కోట్ల విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని డిపాజిట్ చేసుకోలేదు. ఈ సమాచారం తెలుసుకున్న లైసెన్సు విభాగం... టీటీడీకి జరిమానా విధించింది. లైసెన్స్ కోసం తిరిగి దరఖాస్తు చేసుకున్నాం. త్వరలోనే వస్తుంది’ అని వివరించారు.

భక్తుల కోసం 10 ధర్మరథాలు

శ్రీవారి భక్తులు ఉచితంగా ప్రయాణించేందుకు రూ.18 కోట్ల విలువైన 10 విద్యుత్ బస్సులను (ధర్మరథాలు) మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ టీటీడీకి విరాళంగా అందజేసింది. వీటికి చైర్మన్ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన మేఘా సంస్థ ఒక్కో బస్సును రూ.1.8 కోట్ల ఖర్చుతో తయారు చేయించి 10 బస్సులను టీటీడీకి కానుకగా అందజేసిందని చెప్పారు. తిరుమలలోని వర్క్‌షాప్ సమీపంలో విద్యుత్ బస్సులకు చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ బస్సులు నడిపేందుకు టీటీడీ డ్రైవర్లకు ఒలెక్ట్రా సంస్థ శిక్షణ ఇస్తుందని.. ఏప్రిల్ 15 నుంచి ఈ బస్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఒలెక్ట్రా సంస్థ సీఎండీ కేవీ ప్రదీప్, టీటీడీ అధికారులు నాగేశ్వరరావు, జగదీశ్వర్‌రెడ్డి, శేషారెడ్డి, డాక్టర్ శ్రీదేవి, హరీంద్రనాథ్, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పోలవరం ముంపు’ పై విచారణ వాయిదా వేయండి

సుప్రీంకోర్టును మూడు నెలల సమయం కోరిన కేంద్రం!

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై విచారణ వాయిదా వేయాలని సుప్రీంకోర్టును కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలోనే సోమవారం విచారణ జాబితా నుంచి సదరు కేసు తొలగించినట్లు సమాచారం. కోర్టు ఆదేశాల మేరకు కసరత్తు సాగుతోందని, తుది నివేదికకు మరికొంత సమయం పడుతుందని, ఈ మేరకు జలశక్తి శాఖ చర్యలు చేపట్టినట్లు ఆ లేఖలో కోరినట్లు తెలిసింది. విచారణ మూడు నెలలు వాయిదా వేయాలని కోరినట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపుపై ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.